అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

మంగళవారం 25-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 114 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

ఆ వార్తలకు రక్షణ ఏది?

ఐటీ చట్ట సవరణలపై బాంబే హైకోర్టు



న్యూఢిల్లీ : ఐటీ చట్టంలో చేసిన సవరణలు అనుకరణ, వ్యంగ్య వార్తలకు ఎలాంటి రక్షణ ఇవ్వడం లేదని బాంబే హైకోర్ట్‌ అభిప్రాయపడింది. సవరణల రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ హాస్యనటుడు కునాల్‌ క్రమా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌ జీఎస్‌ పటేల్‌, జస్టిస్‌ నీలా గోఖలేతో కూడిన బెంచ్‌ సోమవారం విచారణ జరిపింది. ఆన్‌లైన్‌ గేమ్స్‌ను, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక వార్తలను నియంత్రిస్తూ ఈ నెల 6న ఈ సవరణలు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఏ సమాచారమైనా అవాస్తవమైనదని, తప్పుదోవ పట్టించేదిగా ఉన్నదని భావిస్తే.. వాటిని నియంత్రించడానికి ...5లో

ఇంటికొకటి కాదు.. ఊరుకో ఉద్యోగమైనా ఇచ్చారా?

50 లక్షల మంది నిరుద్యోగులతో కేసీఆర్‌ చెలగాటం

- మే మొదటివారంలో నిరుద్యోగ నిరసన సభకు ప్రియాంక గాంధీ
- జిల్లాల వారీగా నిరుద్యోగ నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలి : ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ముందు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారని.. కానీ ఈ తొమ్మిదేండ్లలో ఊరుకో ఉద్యోగమైనా ఇచ్చారా అని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్‌ ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్న కేసీఆర్‌ ఏ మేరకు నియామకాలు చేపట్టారని ప్రశ్నించారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి ర్యాలీ ప్రారంభించి ...5లో

భారత్‌ పురోగమిస్తోందా? తిరోగమిస్తోందా?


దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్రలో నీటి సమస్యనా?

- ఔరంగాబాద్‌ సభలో బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు సీఎం కేసీఆర్‌



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్‌

'దేశంలో ఏం జరుగుతుందో ప్రతి ఒక్కరూ గమనించాలి. ప్రజలకు తాగునీరు, సాగు నీరందించలేకపోవడానికి కారణమెవరు? గోదావరి, కృష్ణా వంటి నదులున్నా మహారాష్ట్రలో నీటి సమస్య ఎందుకు వస్తున్నది. ముంబయి దేశ ఆర్థిక రాజధాని కానీ తాగడానికి నీళ్లుండవు. అసలు దేశం పురోగమిస్తుందా? లేక తిరోగమిస్తుందా? అనే విషయాలపై ఆలోచించండి' అని బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు, తెలంగాణ సీఎం కేసీఆర్‌ ప్రశ్నించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌ జబిందామైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్‌ మాట్లాడారు. దేశంలో పేదలు మరింత పేదలవుతున్నారని, ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారని అన్నారు. ఇదంతా మన కండ్లముందు జరుగుతుంటే ఇలాగే జరగాలా? చికిత్స చేయాలా? అని ప్రశ్నించారు. తన మాటలు విని ఇక్కడే మర్చిపోకండని, గ్రామాల్లోకెళ్లి చర్చ చేయాలని పిలుపునిచ్చారు. ఎంత త్వరగా మేల్కొంటే అంత త్వరగా దేశం బాగుపడుతుందని అన్నారు. సమస్యలకు పరిష్కారం లభించకుంటే ఏం చేయాలి? ఇకెంత కాలం పరిష్కారం కోసం ఎదురుచూడాలి? ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పిస్తున్నా ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. భయపడుతుంటే ఇంకా భయపెట్టిస్తారని, ధైర్యంగా పోరాడితేనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. మార్పు రాకుంటే దేశం ముందుకెళ్లదని, అనివార్యమైన ...2లో



ఓట్ల కోసం మత చిచ్చు!

అమిత్‌ షా వ్యాఖ్యలో ఆంతర్యం అదే

- నిబంధనలు, సంప్రదాయాలకు పాతర
- రెచ్చగొట్టే మాటలతో ఓట్లు దండుకునే ప్రయత్నం

'ఎన్నికల ప్రక్రియలో మతానికి ఎలాంటి పాత్ర లేదు. అది ఒక లౌకిక విధి' అంటూ 2017లో ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ఈ ధర్మాసనానికి అప్పటి ప్రధాన న్యాయమూర్తి టీఎస్‌ ఠాకూర్‌ నేతృత్వం వహించారు. మతం, కులం పేరుతో ఓట్లు అడగడం ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతి చర్య అవుతుందని ఆయన ఆ తీర్పులో స్పష్టం చేశారు. కానీ కేంద్ర హోం మంత్రి ఇందుకు విరుద్ధంగా మాట్లాడారు.

ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించి వాటిని ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఇచ్చే పేరిట అమిత్‌ షా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇది మత ప్రాతిపదికన ఓటర్ల మధ్య చిచ్చు పెట్టడమే అవుతుంది. బీజేపీకి ఓట్లు అభ్యర్థిస్తూ కేంద్ర హోం మంత్రి పలు నిబంధనలు, సంప్రదాయాలను తుంగలో తొక్కారు. ఇది మతాల మధ్యేకాదు, కులాల మధ్య కూడా కుంపటి రాజేసే ప్రయత్నం.

న్యూఢిల్లీ : తెలంగాణలో అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లకు చెల్లుచీటీ పలుకుతామని కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా ఆదివారం చేవెళ్లలో జరిగిన బీజేపీ విజయ్‌ సంకల్ప్‌ సభలో సెలవిచ్చారు. 'రెండు పడకగదుల ఇళ్లలోనూ మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బీఆర్‌ఎస్‌ నేతలు చెబుతున్నారు. ఈ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కు. వారికి రిజర్వేషన్లు కల్పించి, ముస్లింలకు తొలగిస్తాం' అని కూడా చెప్పుకొచ్చారు.

ఓబీసీలకు రిజర్వేషన్లు కులం ఆధారంగా కల్పించేవి కావు. అవి సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా కల్పించేవి. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులను కూడా ఓబీసీలుగా పరిగణిస్తున్నారు. ఏ సామాజిక తరగతికైనా విద్య, వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న వారిని ఈ రిజర్వేషన్ల పరిధిలో చేర్చారు. ఈ నేపథ్యంలో ముస్లింలను, ఓబీసీలను వేర్వేరుగా చూడడం పొరబాటు.

తెలంగాణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఏదీ ఇప్పుడు అమలులో లేదు. అయితే అమిత్‌ షా మాత్రం ఈ సంవత్సరం డిసెంబర్‌లోగా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉందని చాలా స్పష్టంగా చెప్పారు. అలా చెప్పడం ద్వారా ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నేరుగా ఉల్లంఘించారు. ఎలా అంటే ఎన్నికల కమిషన్‌ అధికారిక వెబ్‌సైట్‌లో 'సాధారణ ప్రవర్తనా నియమావళి' నిబంధనలోని ఐటమ్‌ నెం. 1 ఇలా చెబుతోంది....ఏ పార్టీ కానీ, అభ్యర్థి కానీ వేర్వేరు కులాలు, సమాజాలు, భాషలు, మతాల మధ్య విభేదాలను మరింత పెంచడం కానీ, వాటి మధ్య పరస్పరం విద్వేషాన్ని రగిలించడం కానీ లేదా ఉద్రిక్తతలను ప్రేరేపించడం కానీ చేయకూడదు...కానీ అమిత్‌ షా చేసిందేమిటి ? ఒకరి ప్రయోజనాలు లాగేసుకొని వేరొకరికి కల్పించాలని ఆయన కోరుకున్నారు.



కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ముస్లింలకు లభిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను గత నెలలో తొలగించింది. ఆశ్చర్యకరమైన, అభ్యంతరకరమైన విషయమేమంటే ఆ నాలుగు శాతం రిజర్వేషన్లను రాష్ట్రంలో అణగారిన కులాలకు కాకుండా, శక్తివంతమైన కులాలుగా చెలామణి అవుతున్న లింగాయతులు, ఒక్కలిగుల మధ్య సమానంగా పంచింది. దీంతో వారి రిజర్వేషన్లు ఐదు శాతానికి, ఏడు శాతానికి చేరాయి. ముస్లింలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్‌) కింద చేర్చారు. ఆ వర్గాలకు ప్రస్తుతం మొత్తంగా పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. జైనులు, బ్రాహ్మణులు సహా పలు కులాలతో కలిసి ముస్లింలు వాటిని పంచుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ముస్లింలను మాత్రమే 2బీ కేటగిరీ నుంచి తొలగించారు. మిగిలిన మైనారిటీలందరూ అందులోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఇప్పటికే ఇద్దరు సభ్యుల బెంచ్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. దీంతో తన వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం మరికొంత సమయం కోరింది. విధిలేని పరిస్థితుల్లో ఎన్నికలు ముగిసేంత వరకూ రిజర్వేషన్లపై ఎలాంటి చర్యలూ చేపట్టబోమని రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి హామీ ఇచ్చింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లపై హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్‌ వంటి స్వతంత్ర సంస్థలు కఠిన చర్యలు తీసుకోగలిగితే కేంద్ర హోం మంత్రి చట్టం ముందు దోషిగా నిలబడక తప్పదు.

చైనా కంటే ఎందుకు వెనుకఉన్నాం?

మతాలు, కులాల పేరిట పనికిమాలిన సంభాషణలు

- ఎనిమిదేండ్లలో తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి
- అదే తీరుగా భారతదేశం సాధించి ఉంటే అగ్రగామి దేశాలతో పోటీ పడేవాళ్లం : అమిత్‌షాపై కేటీఆర్‌ విమర్శలు
- సీఎంఎస్‌ఈఐ, ఎంఎస్‌ఎంఈ లబ్దిదారులకు చెక్కులు, వాహనాలు అందజేత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

"చైనా కంటే భారత దేశం ఎందుకు వెనుకబడింది?. 1987లో రెండు దేశాల జీడీపీ ఒకే దగ్గర ప్రారంభమైంది. 36 ఏండ్ల తర్వాత చైనా జీడీపీ 18 ట్రిలియన్‌ డాలర్లుగా ఉంటే, భారతదేశ జీడీపీ కేవలం 3.4 ట్రిలియన్‌ డాలర్లు మాత్రమే. అంటే చైనా మనకంటే ఆరు రెట్లు ఎక్కువ జీడీపీని కలిగి ఉంది. అమెరికా, జర్మనీ, జపాన్‌ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడటమే లక్ష్యంగా చైనా ఎదిగింది. అయితే మన దేశంలో సహజ వృద్ధి తప్ప మరో వృద్ధి జరగలేదు. నేటి పాలకుల దృష్టంతా ఏ మతం గొప్పది? ఏ కులం గొప్పది? అనే వాటిపైనే. ఎనిమిదేండ్లలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.24 లక్షల నుంచి 3.17 లక్షలకు పెరిగి భారతదేశంలోనే నెంబర్‌ వన్‌గా నిలిచిందని రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా చెప్పింది. జాతీయ పంచాయతీరాజ్‌ దినోత్సవం సందర్భంగా ఇచ్చిన అవార్డుల్లో తెలంగాణ 30 శాతం అవార్డులు కైవసం చేసుకుంది. ఎనిమిదేండ్లలో తలసరి ఆదాయాన్ని తెలంగాణ 162 శాతం పెంచుకోగలిగితే, అదే రకమైన వృద్ధిని మిగిలిన ...5లో

వైఎస్‌ షర్మిలకు 14 రోజుల రిమాండ్‌

- పోలీసులతో షర్మిల దురుసు ప్రవర్తన..



నవతెలంగాణ-బంజారాహిల్స్‌

వైఎస్‌ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిలకు సోమవారం సాయంత్రం నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్‌ విధించింది. టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీకేజీ కేసులో సిట్‌ను కలిసేందుకు వెళుతున్న వైఎస్‌ షర్మిలను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అడ్డుకోవడంతో లోటస్‌ పాండ్‌ వద్ద తీవ్ర ఉద్రిక్త ...2లో

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్‌

- 3 నెలల్లో నిర్వహించాలంటూ హైకోర్టు ఉత్తర్వులు



నవతెలంగాణ - హైదరాబాద్‌

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చింది. మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని ...5లో

ఎంపీ అవినాష్‌ రెడ్డికి ఎదురుదెబ్బ

- ముందస్తు బెయిల్‌ ఉత్తర్వులు నిలిపివేత
- తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- సీబీఐ నిర్దేశించిన రీతిలోనే దర్యాప్తు చేయాలి



వివరాలు 5లో..

ఒకటి తిరస్కరణ.. రెండింటిపై వివరణ కోరిన గవర్నర్‌

- పెండింగ్‌ బిల్లులపై తమిళిసై నిర్ణయం
- వీలైనంత త్వరగా అమోదించాలి
- లేకపోతే నిర్ణీత కాలంలో తిరిగి పంపాలి : సుప్రీంకోర్టు



వివరాలు 5లో..

భవన నిర్మాణ కార్మికుల సొమ్ము స్వాహా

నకిలీ డెత్‌ సర్టిఫికేట్లతో దందా

- కార్మిక శాఖ ఉద్యోగుల పాత్రపైనా అనుమానాలు
- ఏడాదిలోనే 40,900 మంది కార్మికులు చనిపోయారంట
- ఎనిమిదేండ్లలో రూ.531 కోట్ల ఖర్చు.. ఈ ఏడాది రూ.1,417 కోట్ల వాడకం
- వెల్ఫేర్‌బోర్డులో వందల కోట్ల రూపాయల అవినీతి
- ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 80 మరణాలపై అనుమానాలు
- 15 దరఖాస్తులు విచారిస్తే అన్నీ ఫేక్‌ మరణాలే
- వరంగల్‌ జిల్లాలోనే 25 కోట్ల దుర్వినియోగం
- ఆర్టీఐ యాక్టు ద్వారా వెలుగులోకి తెచ్చిన సీపీఐ(ఎం)

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సొమ్ము దొడ్డిదారిన స్వాహా అవుతున్నది. నిర్మాణ సంస్థల నుంచి సెస్‌ వసూళ్ల విషయంలోనే కాకుండా కార్మికుల సంక్షేమం కోసం పెడుతున్న ఖర్చుల్లోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు తెలుస్తున్నది. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్‌ బోర్డు(టీబీఓసీడబ్ల్యూడబ్ల్యూ) ద్వారా తెలంగాణ వచ్చిన దగ్గర నుంచి కార్మికుల సంక్షేమం కోసం ఎనిమిదేండ్ల కాలంలో రూ.531 కోట్లు ఇవ్వగా...2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి వరకు రూ.1417 కోట్లు ఖర్చుపెట్టారు. ఇదే విషయం ఇప్పుడు అక్కడ జరుగుతున్న అవినీతి బాగోతాన్ని ఎత్తిచూపుతున్నది. ఏడాదిలో 40,900 మంది కార్మికులు చనిపోయారంటూ కార్మిక శాఖ లెక్కలు చూపెట్టడమే విస్తుగొల్పుతున్నది.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

రాష్ట్ర బడ్జెట్‌ సందర్భంగా అసెంబ్లీకి కార్మిక శాఖ సమర్పించిన లెక్కల్లో వివిధ సంక్షేమ పథకాల కింద అయిన ఖర్చు రూ.300 కోట్లుగా చూపెట్టారు. సమాచార హక్కు చట్టం ద్వారా కార్మిక శాఖ ఇచ్చిన దాని ప్రకారమైతే రూ.1417 ఖర్చుపెట్టినట్టు ఉంది. రెండూ ప్రభుత్వ లెక్కలే. ఎందుకీ వ్యత్యాసం మిగతా డబ్బులేమైనట్టు అనే విషయం తేలాల్సి ఉంది. నిధుల స్వాహాలో అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఫీల్డు విజిట్‌లో అన్నీ బోగసే...

సూర్యాపేట జిల్లాలో 80 డెత్‌ క్లయిమ్స్‌పై వెల్ఫేర్‌ బోర్డుకు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ కోసం వెల్ఫేర్‌ బోర్డు కొందరు అధికారులను ఫీల్డు విజిట్‌కు పంపగా 15 దరఖాస్తులను వారు పరిశీలించారు. చివ్వెంల, ఆత్మకూరు మండలాల్లోని రాజుతండా, పాండ్యానాయక్‌ తండా, మున్యానాయక్‌ తండా, తుమ్మల పెన్‌పహాడ్‌, రామోజీ తండాలలో అధికారులు పర్యటించారు. ఆయా గ్రామపంచాయతీల్లో ఏడాది కాలంలో జారీ అయిన ...2లో



కార్మిక శాఖలోని అవినీతి, అక్రమాలను తేల్చాలి

- ఎం.శ్రీనివాస్‌, సీపీఐ(ఎం) హైదరాబాద్‌ సెంట్రల్‌ సిటీ కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీతో విచారణ జరిపించి కార్మిక శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను తేల్చాలని సీపీఐ(ఎం) హైదరాబాద్‌ ...2లో

భవన నిర్మాణ కార్మికుల సొమ్ము స్వాహా

(మొదటిపేజీ తరువాయి)

మరణ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. చివ్వెంల మండ లంలోని మున్యా నాయక్ తండాలో ఐదు మరణాలపై విచారణ జరపగా ...అసలు ఆ గ్రామ పంచాయతీ ఆ పేర్లతో మరణ ధ్రువీకరణ పత్రాలే ఇవ్వ లేదని తేలిం ది. ఆత్మ కూరు (ఎస్) మండలంలోని తుమ్మల పెన్‌పహా డ్ పంచాయతీ పరి ధిలో నలుగురి పేరిట నిధులను స్వాహా చేశారు. దీనిపై గ్రామ పంచా యతీలో విచారణ జరపగా... అధికారులు చూపెట్టినవన్నీ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలని తేలింది. చివ్వెంల మండలం పాండ్యా తండాలో నాలుగు మరణాలపై విచారణ జరపగా..అవీ ఫేక్ సర్టిఫికేట్ల ద్వారానే నిధులను పక్కదోవ పట్టించినట్టు వెల్లడైంది. సూచనప్రాయంగా అధికారులు 15 మరణాలపై విచారణ జరపగా..అన్నీ ఫేక్ అని తేలడం విస్తుగొల్పే అంశం. బోగస్ డెత్ సర్టిఫికేట్లు, బోగస్ ఎఫ్ఐఆర్‌లు, బోగస్ డాక్యుమెంట్లతో కొందరు దళారులు, మీసేవ కేంద్ర నిర్వాహకులు, బోర్డు కార్యాలయంలోని కొందరు ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఖర్చు చూపెట్టింది ఇలా..

రాష్ట్రంలో టీబీఓసీడబ్ల్యూడబ్ల్యూ ద్వారా 2022 జనవరి నుంచి 2023 ఫిబ్రవరి మధ్య కాలంలో 2,56,000 మంది లబ్ది పొందారు. దీనికి గానూ వెల్ఫేర్ బోర్డు ఖర్చుపెట్టింది రూ.1,417 కోట్లుగా చూపెట్టారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో కార్మికుల సంక్షే మం కోసం పెట్టిన ఖర్చు రూ.256.85 కోట్లు మాత్రమే. మొత్తం 2014 నుంచి 2020 వరకు కార్మికుల సంక్షేమం కోసం రూ.531 కోట్లు వాడారు. అదే 2022-23కు వచ్చేసరికి అది రూ.1,417 కోట్లకు చేరడమే ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇంకో గమ్మత్తైన విషయమేమిటంటే రాష్ట్ర బడ్జెట్‌లో ఆ ఖర్చు రూ.300 కోట్లుగా చూపెట్టారు. ఇంత పెద్ద తేడా ఎందుకు వచ్చింది? అనూహ్యంగా ఏడాదిలో ఇంత ఖర్చు ఎలా పెరిగింది? నిజ మైన లబ్దిదారులకు డబ్బందిందా? బడ్జెట్‌లో చూపెట్టి న దానికంటే నాలుగురెట్లు అదనంగా ఎలా ఖర్చయింది? అన్న ప్రశ్నలకు కార్మిక శాఖ అధికారులే సమాధానాలు చెప్పాలి. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

ఏడాదిలోనే 40,900 మంది కార్మికులు చనిపోయారా?

ఒక్క ఏడాదిలోనే 40,900 మంది భవన నిర్మాణ కార్మికులు చని పోయారా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. బోర్డు ద్వారా బాధిత కుటుం బాలకు రూ. 525 కోట్లు ఇచ్చారు. 14 నెలల కాలంలో వివిధ ప్రమాదాల్లో 4027 మంది కార్మికులు చనిపోయినట్టు, 313 మంది అంగవైకల్యం పొందినట్టు సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన పత్రాల్లో ఉంది. వారి కోసం రూ.260 కోట్లు చెల్లించారు. ప్రసవ సహాయం కింద 1,38,250 మంది లబ్దిదారులకు రూ.415 కోట్లు ఇచ్చారు. పెండ్లీండ్ల కానుక కింద 71,661 మంది లబ్ది పొందారు. దీని కోసం రూ.215 కోట్లు ఖర్చుపెట్టారు. సూర్యాపేట జిల్లాలో శాంపిల్‌గా 15 మరణాలపై విచారణ జరిపితే అన్నీ ఫేక్ అని తేలాయి. వరంగల్ జిల్లాలో డెత్ క్లయిమ్ లబ్దిదారులకు రెండు సార్లు డబ్బులు చెల్లించడం వల్ల రూ.64 లక్షలు స్వాహా అయ్యాయి. వరంగల్ జిల్లాలో ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు చెల్లింపులు జరిపే విషయంలో రూ.25 కోట్లు దుర్వినియోగం జరిగింది.

హనుమకొండ జిల్లా పరకాలలో బోగస్ డెత్ క్లయిమ్స్‌పై దందా నడిపిస్తున్న ఓ అధికారి బంధువును పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇవి బట్టబయలైనవే. అన్ని జిల్లాల్లోనూ ఇలాంటి అవినీతి పెచ్చుమీరిపోయినట్టు తెలుస్తున్నది.

సంవత్సరం	లబ్దిదారులు	విడుదల చేసిన నిధులు
2014-15	22,610	రూ.24.15 కోట్లు
2015-16	9,180	రూ.25.83 కోట్లు
2016-17	19,013	రూ.46 కోట్లు
2017-18	22,930	రూ.66.14 కోట్లు
2018-19	20,928	రూ.112.10 కోట్లు
2019-20	29,691	రూ.256.85 కోట్లు
2022-23	2,56,000	రూ.1,417 కోట్లు

కార్మిక శాఖలోని అవినీతి, అక్రమాలను తేల్చాలి

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్, ఎం.దశరథతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా లబ్దిదారులకు పంపిణీ చేస్తున్న నిధుల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నదని తెలిపారు. తాము సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలే ఆవిషయాన్ని తెలుపుతున్నాయని వివరించారు. వెల్ఫేర్‌బోర్డు దళారుల కేంద్రంగా మారిందని విమర్శించారు. సూర్యాపేట జిల్లాలోని డెత్ సర్టిఫికేట్ల వ్యవహారం, వరంగల్ జిల్లాలో డబుల్ పేమెంట్ చెల్లింపు, మరణాల కేసుల ఇచ్చే చెల్లింపుల్లో రూ.25 కోట్ల అవినీతిని ఎత్తిచూపారు. పర్యవేక్షణా లోపంతో కార్మిక శాఖలో అవినీతి ఏటేటా పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క ఏడాదిలోనే 1,417 కోట్ల రూపాయల నిధుల పంపిణీ వెనుక భారీ కుంభకోణం జరిగిందని విమర్శించారు. బోగస్ డాక్యుమెంట్లపై విచారణ జరిపితే అన్ని విషయాలు బట్టబయలు అవుతాయన్నారు.

ఈ కుంభకోణంలో వెల్ఫేర్‌బోర్డులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ పాత్ర ఉందనీ, ఆయనకు కార్మిక శాఖలోని ఉన్నతాధికారులతో సత్సంబంధాలున్నాయని విమర్శించారు. సెస్ వసూళ్లల్లో జరుగుతున్న అక్రమాలపై సీపీఐ(ఎం) బట్టబయలు చేసిందనీ, విజిలెన్స్ శాఖ విచారణలోనూ అది నిజమని తేలిందని చెప్పారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా రాష్ట్ర సర్కారు వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏసీబీతో విచారణ జరిపించి కార్మికులకు అందాల్సిన సొమ్మును కొల్లగొడుతున్న దళారులు, అధికారులను కఠినంగా శిక్షించాలి.

సమ్మె చేస్తే టెర్మినేటే..

- క్షేత్రస్థాయి విద్యుత్ సంస్థల అధికారులకు ఆదేశాలు
- ఆర్టిజన్ కార్మికుల ఆందోళనపై సర్కారు ఉక్కుపాదం
- నేటి ఉదయం 8 గంటల నుంచి సమ్మెలోకే...
- స్పష్టం చేసిన హెచ్-52 నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఆర్టిజన్ కార్మికులు ఎవరైనా సమ్మెలో పాల్గొంటే తక్షణం వారిని అక్కడికక్కడే ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేయాలని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీలు దేవులపల్లి ప్రభాకరరావు, జీ రఘుమారెడ్డి, ఏ గోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. తీవ్రమైన అనారోగ్య కారణాలు ఉంటే తప్ప, ఎవరికీ సెలవులు కూడా ఇవ్వొద్దనీ, తప్పనిసరిగా అందరూ విధులకు హాజరుకావల్సిందేనని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏప్రిల్ 15వ తేదీనే వేతన ఒప్పందం కుదిరినందున ఆర్టిజన్ కార్మికులు ఎవరూ సమ్మెలోకి వెళ్లొద్దని వారు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు అయితే తాము శాంతియుతంగా నిరసనలు తెలుపుతామని హెచ్-52 సంఘం ప్రధాన కార్యదర్శి సాయిలు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచే తాము నిరసనల్లో పాల్గొంటామన్నారు. ఆర్టిజన్లను రెచ్చగొట్టే చర్యల్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని కోరారు. తక్షణం తమ సమస్యల్ని పరిష్కరించేలా చర్చలు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు.

వీఓఏల సమ్మె



నవతెలంగాణ- విలేకరులు

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కడ్తాల్, తలకొండపల్లి, కందుకూర్, మహేశ్వరంతోపాటు మరికొన్ని మండలాల్లో వీఓఏలు దీక్షలు చేపట్టారు. మహేశ్వరంలో చేపట్టిన దీక్షకు సీఐటీయూ కందుకూర్ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఒంటి కాలిపై నిలబడి వీఓఏలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. వీఓఏల సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే స్పందించి వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కడ్తాల్‌లో చేపట్టిన దీక్షకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మద్దతు తెలిపారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఐకేపీ వీఓఏల సమ్మెకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. చండూర్‌లో సమ్మెకు కేవీపీఎస్ మండల కమిటీ తరపున సంఘీభావం తెలిపారు.

మర్రిగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య సమ్మెలో పాల్గొన్నారు. చిట్యాలటౌన్‌లో చిట్యాల మండల కేంద్రంలో వీవోఏలు మోకాళ్ల మీద నిలబడి, బతుకమ్మ ఆటపాటలతో ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ సమ్మె శిబిరాన్ని సందర్శించారు. దేవరకొండలో వీఓఏల సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో వీఓఏల సమ్మెకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ సంఘీభావం తెలిపారు.

గోసంరక్షణ గోవా నుంచే ప్రారంభించాలి

- గోవా సీఎం ప్రమోద్ సావంత్‌కు 'నమో వందే గోమాతరం' వినతి

నవతెలంగాణ-అంబర్‌పేట



గోవుల సంరక్షణ బాధ్యత గోవా నుంచే ప్రారంభించాలని గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్‌ను నమో వందే గోమాతరం విజ్ఞప్తి చేసింది. నమో వందే గోమాతరం నేషనల్ ప్రెసిడెంట్ పెరిక సురేష్ ఆధ్వర్యంలో సోమవారం గోవా ముఖ్యమంత్రి సావంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఎం సావంత్‌ను శాలువాతో సత్కరించి గోవు ప్రతిమను బహూకరించారు. ఈ సందర్భంగా సురేష్ భారతీయ సంస్కృతికి, వారసత్వానికి ప్రతిరూపమైన గోమాతను సంరంక్షించాల్సిన అవసరముందని, అది గోవా నుంచే ప్రారంభించాలని సీఎం సావంత్‌ను కోరారు.

దానికి గోవా సీఎం సానుకూలంగా స్పందించారని సురేష్ వెల్లడించారు. నమో వందే గోమాతరం ఆధ్వర్యంలో గోవులను రక్షించే కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సీఎంలను కలిసి గోహత్యలను నిషేధం కఠినంగా అమలు చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సెక్రటరీ మున్నంగి రమణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కట్టా రవి చారీ, తెలంగాణ సెక్రటరీ తోట కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలకు 14 రోజుల రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో షర్మిలకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకోవడంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కానిస్టేబుల్ గిరిబాబు కాలు మీద కారు ఎక్కించిన షర్మిల కాన్వాయ్ ఇద్దరు డ్రైవర్‌ల మీద కేసులు నమోదయ్యాయి. ఏ1గా షర్మిల, ఏ2గా కారు డ్రైవర్ బాలు, ఏ3గా మరో డ్రైవర్ జాకబ్ పేర్లు చేర్చారు.. షర్మిలను అరెస్టు చేసి, ఆ తర్వాత గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నాంపల్లి కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చారు. శాంతిభద్రతల కోసం 24 గంటలు పోలీసులు పని చేస్తారని, అలాంటి వారిపై చేయి చేసుకోవడం వల్ల సమాజానికి తప్పుడు సందేశం వెళ్తుందని, షర్మిలను రిమాండ్‌కు ఇవ్వాలని పోలీసులు వాదనలు వినిపించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు అడ్డుకుని షర్మిలపై దురుసుగా ప్రవర్తించారని, ఆత్మ రక్షణలో భాగంగానే పోలీసులు నెట్టివేయాల్సి వచ్చిందని వారు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రిమాండ్ తిరస్కరించాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి షర్మిలకు మే 8 వరకు రిమాండ్ విధించింది.

సోమవారం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సిట్‌ను కలిసేందుకు వెళుతున్న వైఎస్ షర్మిలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకోవడంతో లోటస్ పాండ్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో షర్మిలకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. షర్మిల ఆగ్రహానికి లోనై ఓ పోలీసును తోసేశారు. పోలీసుల తీరుకు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. తనను ఎందుకు నిర్బంధించారో చెప్పాలని నేలపై కూర్చొని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అడ్డుగా ఉన్నా లెక్క చేయకుండా కారులో ముందుకు వెళ్లేందుకు షర్మిల ప్రయత్నించారు. అయినా, పోలీసులు అడ్డు తొలగలేదు. దీంతో షర్మిల..అక్కడే విధుల్లో ఉన్న పోలీసు అధికారుల దగ్గరకు వెళ్లి వారిపట్ల దురుసుగా ప్రవర్తించారు. మధ్యలో అడ్డుకున్న మహిళా కానిస్టేబుళ్లను తోసివేసి చేయి చేసుకున్నారు. షర్మిలను బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకుని షర్మిలను కలిసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆమె తల్లి విజయమ్మను పోలీసులు అడ్డుకున్నారు. ఆ సందర్భంలో కూడా విజయమ్మ మహిళా పోలీసులను నెట్టివేసి తీవ్ర ఆగ్రహం ప్రదర్శించారు. మహిళా పోలీస్‌పై చేయి చేసుకున్నట్టు వీడియో వైరల్ అయింది. తాను ఎవరిమీద కావాలని చేయి చేసుకోలేదని విజయమ్మ అన్నారు.

సచివాలయం, సిట్ ఆఫీస్‌కు వెళ్లి హడావుడి చేయాలని షర్మిల ప్లాన్ : సీపీ ఆనంద్

షర్మిల ఎపిసోడ్‌పై పోలీసులు రియాక్ట్ అయ్యారు. హైదరాబాద్ సీపీ సీవీఆనంద్ మాట్లాడు తూ సచివాలయం, సిట్ ఆఫీస్‌కు వెళ్లి ఏదైనా హడావుడి చేయాలని షర్మిల ప్లాన్ చేశారని అన్నారు. అందుకే ముందస్తు సమాచారంతో ఆమెను హౌస్ అరెస్టు చేసేందుకు యత్నించామన్నారు. గతంలో ఆమె చేసిన చర్యలు కారణంగానే ఇప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు. ఎస్సై, కానిస్టేబుల్‌పై దాడి కేసులో పూర్తి విచారణ జరుగుతున్నదని వివరించారు. అంతకంటే ముందు మాట్లాడిన డీసీపీ జోయల్ డెవిస్... ఎస్సైను షర్మిల కొట్టారన్నారు.

షర్మిలను పరామర్శించిన భర్త అనిల్

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఉన్న వైఎస్ షర్మిలను ఆమె భర్త బ్రదర్ అనిల్ పరామర్శించారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆమెను పరామర్శించేం దుకు ఆమె తల్లి విజయలక్ష్మి, పార్టీ నాయకులు గట్టు రామచంద్రరావు రాగా వారికి అనుమతి ఇవ్వలేదు.

భారత్ పురోగమిస్తోందా? తిరోగమిస్తోందా?

(మొదటిపేజీ తరువాయి)

మార్పు తీసుకురావడానికే బీఆర్ఎస్ పుట్టిందని వెల్లడించారు.. మార్పు వచ్చేవరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని, అన్ని వర్గాలకు న్యాయం దక్కాల్సిందేనని అన్నారు. దేశంలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయని కేసీఆర్ గుర్తుచేశారు. సాగుకు యోగ్యత ఉన్న భూములకు నీటిని అందించాల్సిన అవసరముందన్నారు. నిజాయితీగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి విజయం తథ్యమని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకొస్తే ఐదేండ్లలోపు ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు ఎన్ని అటంకాలు సృష్టించినా తమ పోరాటం ఆగదని, తెలంగాణలో తాగునీరు, సాగునీటి సమస్యలేకుండా చేశామని, అదే రీతిలో మహారాష్ట్రను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో అన్ని అందేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఒక కులం, మతం, వర్గం కోసం బీఆర్ఎస్ ఆవిర్భవించలేదని, నిజాయితీగా పోరాడుతాం..విజయం సాధిస్తామని చెప్పారు. తెలంగాణలో ఉచిత విద్యుత్ సాధ్యమైనప్పుడు మహారాష్ట్రలో ఎందుకు సాధ్యంకాదని ప్రశ్నించారు. దేశంలో కొత్త లక్ష్యాలు, సంకల్పంతో ముందుకెళ్లాలని, దేశంలో 24గంటలపాటు విద్యుత్ సరఫరా చేసే వనరులు న్నాయని చెప్పారు. దేశంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడానికి అవకాశముందని, ఇది అబద్ధమైతే ఒక్క నిమిషం కూడా సీఎం పదవిలో ఉండబోనని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ అధికారంలోకొచ్చిన తర్వాత వాటిని తిరిగి ప్రభుత్వపరం చేస్తామని అన్నారు. దేశంలోని సమస్యలను మనమే పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. పాలనా సామర్థ్యం కల్గిన అధికారులు ఉన్నప్పటికీ తెలంగాణ తరహా పథకాలు ఎక్కడా? ఎందుకు అమలు కావడంలేదిన ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చట్టాలు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో కచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు.

కేసీఆర్ కిట్‌తో అనేక ఫలితాలు

వైద్యసిబ్బందికి మంత్రి హరీశ్‌రావు అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

2021-22 సంవత్సరానికిగాను ఆస్పత్రుల్లో వంద శాతం డెలివరీలతో దేశానికే తెలంగాణ మార్గదర్శకంగా నిలిచిందని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. కేసీఆర్ కిట్ కార్యక్రమం లక్ష్యానికి ఇది నిజమైన నిదర్శనమని పేర్కొన్నారు. గర్భవిచ్ఛిత్తికి సంబంధించి దేశంలోనే అతి తక్కువ కేసులు నమోదవుతున్నరెండో రాష్ట్రంగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు. నవజాత శిశువులకు మొదటి గంటలోనే ముర్రుపాలు అందించడంలో 80.75 శాతం, హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్‌లో 104 శాతంతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని తెలిపారు. మీజిల్స్, రుబెల్లాకు వంద శాతం వ్యాక్సినేషన్, దేశంలోనే పూర్తి నిర్వహణ, పరికరాలు కలిగిన ఫస్ట్ రెఫరల్ యూనిట్లు మన రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు.

సిబ్బంది బంధువులను ఎందుకు విచారించలేదు

టీఎస్‌పీఎస్సీ లీకేజీ దర్యాప్తు వేగం పెంచండి : రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో పనిచేసే సిబ్బంది పరీక్షలు రాస్తే వాళ్ల బంధువులను ఎందుకు విచారించలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం కొన్ని విషయాల్లో ఎందుకుమౌనంగా ఉంటోందని నిలదీసింది. టీఎస్‌పీఎస్సీకి సంబంధించిన ప్రశ్నాపత్రం లీకేజీ కేసు దర్యాప్తు వేగం పెంచాలని సిట్‌కు తేల్చి చెప్పింది. 45 రోజులవుతున్నా ఇప్పటి వరకు నిందితులు ఎవరో వెల్లడించలేకపోయిందని ఆక్షేపించింది. ఇప్పటికీ నిందితుల వాంగ్మూలం నమోదు చేయడం తప్ప ఏమీ చేసినట్టుగా లేదని వ్యాఖ్యానించింది. ఎలాంటి ఫలితాన్ని రాబట్టకపోయిందని తప్పుపట్టింది. ప్రశ్నాపత్రం లీక్ కేసుపై ప్రస్తుత సిట్ విచారణ కొనసాగిస్తుందా లేక సీబీఐ లేదా ఇతర స్వతంత్ర దర్యాప్తు సంస్థకు విచారణ అప్పగించాలా అనే అంశాలపై ఈనెల 28న జరిగే విచారణలో తేల్చుతామని హైకోర్టు వెల్లడించింది. సిట్‌కు ఏదైనా మార్గదర్శకాలు ఇవ్వాలా?.. సీనియర్ ఐపీఎస్‌ను సిట్‌లో చేర్చాలా.? అనేది తదుపరి విచారణ తేదీన నిర్ణయిస్తామని స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరై ఉత్తీర్ణులైన అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల మనోవేదన, బాధలను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. పేపర్ లీకేజీ తర్వాత పరీక్షల వాయిదా, కొన్నింటిని రద్దు చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేస్తూ జస్టిస్ బిజయ్‌సేన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌గౌడ్ సహా ముగ్గురు వేసిన పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది వివేక్ ఠంకా వాదనలు వినిపించారు.

కేంద్రమే కొంత భరించాలి

- డిస్కమ్ నష్టాలపై సీఎంలకు మాజీ ప్రభుత్వ కార్యదర్శి లేఖ

న్యూఢిల్లీ : డిస్కమ్ నష్టాలలో కొంత భాగాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. విద్యుత్ పంపిణీ కంపెనీలకు (డిస్కమ్) వచ్చే నష్టాలలో యాభై శాతాన్ని వినియోగదారులే భరించాలంటూ కేంద్ర విద్యుత్ శాఖ ఇటీవల రాష్ట్రాలకు తాఖీదులు పంపింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ముసాయిదా విద్యుత్ సవరణ నిబంధనలను విడుదల చేసింది. 2005 నాటి విద్యుత్ నిబంధనల్లో రెండు ప్రత్యామ్నాయాలను సూచించింది. వీటిపై మే 11వ తేదీ లోగా అభిప్రాయాలు తెలియ జేయాలని రాష్ట్రాలను కోరింది. వీటి ప్రకారం డిస్కమ్ నష్టాలను పంపిణీ లైసెన్స్‌దారుడు, వినియోగదారులు భరించాల్సి ఉంటుంది. ఒకవేళ డిస్కమ్‌కు లాభాలు వస్తే మూడింట రెండో వంతును వినియోగదారులకు అందిస్తారు. మిగిలినది పంపిణీ లైసెన్స్‌దారుకు చెందుతుంది. నష్టం వస్తే మాత్రం చెరి సగం భరించాలి. అయితే విద్యుత్ శాఖ ఏకపక్ష వైఖరి తీసుకుందని, రాష్ట్ర విద్యుత్ సంస్థలపై కేంద్రం విధించిన ఆంక్షల కారణంగానే డిస్కమ్‌కు నష్టాలు వస్తున్నాయన్న వాస్తవాన్ని అది విస్మరించిందని శర్మ ఆ లేఖలో వివరించారు.

గ్రాట్యూటీపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్ల గ్రాట్యూటీపైన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఐసీడీఎస్ డైరెక్టర్ లక్ష్మీదేవికి ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పద్మ, పి.జయలక్ష్మి, కోశాధికారి కె.సునీత వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా పరిగణించాలనీ, గ్రాట్యూటీ చెల్లింపు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటీకి వారు అర్హులని సుప్రీం కోర్టు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. మెరైగన పని పరిస్థితులను కల్పించేందుకు విధివిధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలనే ఆదేశాలను పాలకులు బుట్టదాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలనీ, కనీస వేతనాలు, పింఛన్ చెల్లింపులకు తగిన ఆర్థిక కేటాయింపులు, ఐసీడీఎస్ పటిష్టత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మలేరియా కేసులు తగ్గించడంలో రాష్ట్రానికి బెస్ట్ పర్ఫార్మెన్స్ స్టేట్ అవార్డు

- డీహెచ్ డాక్టర్ జి.శ్రీనివాసరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మలేరియా కేసులను గణనీయంగా తగ్గించినందుకుగాను 2022 సంవత్సరానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బెస్ట్ పర్ఫార్మెన్స్ స్టేట్ అవార్డును తెలంగాణకు ప్రదానం చేసిందని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని (ఏప్రిల్ 25) ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2014లో 5,222 మలేరియా కేసులు నమోదు కాగా 2022 నాటికి వాటి సంఖ్య 611కు తగ్గిందని తెలిపారు. ఆ ఏడాది దేశంలో 1.73 లక్షల కేసులు రాగా అందులో 0.35 శాతం మాత్రమే రాష్ట్రంలో నమోదు కావటం గమనార్హం. రాష్ట్రంలో కొత్తగూడెం, ములుగు, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా కేసులు నమోదు కాగా, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి- భువనగిరి జిల్లాల్లో సున్నా కేసులు నమోదయ్యాయి. 15 జిల్లాల్లో 10 లోపు కేసులు మాత్రమే నమోదయ్యాయి.



భారీగా తోటల పెంపకం

అడవులకు పునరుజ్జీవం

- హరితహారం కింద సాగునీటిశాఖ భారీగా సన్నాహాలు

నవతెలంగాణ-హైదరాబాద్

నీటిపారుదల శాఖ పరిధిలోని ఖాళీగా ఉన్న భూము ల్లో భారీగా తోటల పెంపకం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమం హరితహారం కింద రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయనుంది. ఇది తగ్గిపోతున్న అడవుల ను పెంపకంలో సహాయపడటమే కాకుండా తాజాగా అందుబాటులో ఉన్న సర్వేల ప్రకారం ఏడు శాతం పచ్చదనాన్ని పెంచడంలో దోహదపడనుందని సర్కారు అంచనా. 2022-23 సంవత్సరంలో జిల్లాల వారీగా నీటిపారుదల భూములలో తోటల కోసం అందుబాటులో ఉన్న కాలువల వెంట నాటాలని నీటిపారుదల భావిస్తున్నది. అలాగే లీనియర్ ప్లాంటేషన్ కింద 5408.53 కిలోమీటర్ల విస్తీర్ణం, బ్లాక్ ప్లాంటేషన్ కింద 1782 ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రణాళిక రూపొందించారు.

మొక్కలు ...

9475.68 కిలోమీటర్ల విస్తీర్ణంలో 2767.31 కిలోమీటర్లలో ప్లాంటేషన్ చేపట్టగా 13,42,173 మొక్కలు నాటారు. 3875.26 ఎకరాల విస్తీర్ణంలో 590.04 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టగా 6,01,385 మొక్కలు నాటారు.

ఆయా జిల్లాల్లో

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, సిద్దిపేట, సూర్యాపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ తోటలను పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయిలో ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, మహబూబాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్లాంటేషన్‌లను క్వాలిటీ కంట్రోల్ సెల్ ఆధ్వర్యంలో సీనియర్ క్వాలిటీ కంట్రో ల్ ఆఫీసర్ (ఎస్‌క్యూసీఓ), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (జేక్యూసీఓ), ప్లాంటేషన్ మేనేజర్ పరిశీలించారు. కానుగ, ఈత, గుల్మోహర్, సీమ తంగేడు, రెయిన్ ట్రీ, సీతాఫల్, దిరిశెన, పెల్టోఫోరం వంటి జాతుల మొక్కలను ఈ జిల్లాల్లో నాటడం జరిగింది. క్షేత్రస్థాయిలో ప్లాంటేషన్లను పరిశీలించిన అధికా రులు క్షేత్ర స్థాయి సిబ్బంది అందరికీ అవగాహన అవసరమని భావించారు. మొక్కలు కట్టే ఏర్పాట్లు, పొడవాటి మొక్కల వినియోగం, అంచనా తయారీ, మొక్కల మధ్య అంతరం పాటించాలని, వేప, చింత పండు, జామున్, బాబుల్, నీరుమద్ది, మారేడు, కాసురినా, వెదురు మొదలైన స్థానిక జాతులను ప్లాంటేషన్ కోసం ప్రతిపాదించారు. అవసరమైన చోట సాధరణ రీప్లేస్‌మెంట్ అవసరమని అధికారులు సూచించారు. పశువులు మేయకుండా ఫెన్సింగ్ వేయాలనీ, తోటల మంచి మనుగడకు ఎరువులు వేయడం, కలుపు తీయడం, నీరు పెట్టడం మొదలైన అన్ని పనులు చేయాల్సిన అవసరముందని సూచించారు. ఈమేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ సోమవారమొక ప్రకటన జారీచేసింది.

నేటి నుంచి బడులకు వేసవి సెలవులు

హైదరాబాద్ బ్యూరో :

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు మంగళవారం వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జూన్ 11వ తేదీ వరకు విద్యార్థులకు ఈ సెలవులుంటాయి. అదే నెల 12వ తేదీన పాఠశాలలు పున: ప్రారంభమవుతాయి. జూన్ ఒకటి నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఉపాధ్యాయులు ఆ రోజు నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. వేసవి సెలవుల్లో మన ఊరు-మన బడి, మనబస్తీ- మన బడి కార్యక్రమానికి సంబంధించిన పనులు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. సర్కారు బడుల ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందుబాటులో ఉంచాలని చర్యలు చేపట్టారు.



మహిళల హక్కులను కాలరాసే మనుస్మృతి

మనుధర్మ శాస్త్రాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతున్నారు

- విద్యకు దూరమవుతున్న బాలికలు
- అక్టోబర్ 5న ఢిల్లీలో భారీ ప్రదర్శన: ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

నవతెలంగాణ - యాదగిరిగుట్ట

మహిళల హక్కులను కాలరాసే మనుధర్మ శాస్త్రాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చుతోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండ్రోజులు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సోమవారం ప్రారంభ సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ బడులను మూసేస్తుండటంతో బాలికలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశ విదేశాల్లో మహిళలు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లేక సతమతమవుతుండగా.. ఇంకోవైపు మతోన్మాద శక్తులు మహిళల హక్కులను నీరుగార్చుతు న్నాయన్నారు.

దేశంలో ప్రస్తుతం కార్పొరేట్ మతోన్మాద శక్తుల కలయికతో ప్రజల జీవితాలు అతలాకుతలమవుతున్నాయని చెప్పారు. అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరులు అవుతుండగా.. పేద ప్రజల జీవి తాలు మరింత దుర్భరమవుతున్నాయని చెప్పారు. మహిళలు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, లైంగికదాడులు, హింస పెరిగిందన్నారు. మోడీ వ్యతిరేక ప్రచార క్యాంపెనింగ్‌ను ఐద్వా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతుందని చెప్పారు. ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ మహిళలను పెద్దఎత్తున సమీకరించి అక్టోబర్ 5న ఢిల్లీలో పెద్ద ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలపై మహిళలను చైతన్యవంతం చేయాల్సిన అవసరాన్ని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి, నాయకులు ఎం.భారతి, పి.ప్రభావతి, కెఎన్.ఆశాలత, బి.అనురాధ, రామేశ్వరి, టి.జ్యోతి, బి.సరళ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాల వల్ల పంటనష్టం వివరాలివ్వండి

- జిల్లాల కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాలతో వివిధ జిల్లాలో జరిగిన పంట నష్టంపై వివరాలను అందించాలంటూ జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లతో సీఎస్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం వివరాలను వచ్చేనెల ఒకటో తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారులను నియమించి జరిగిన పంట నష్టం వివరాలను సమర్పించాలని సీఎస్ కోరారు. గతంలో జరిగిన పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులపాటు ఉరుములతో కూడిన వర్షాలు సంభవించే అవకాశమున్నందున ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడవకుండా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

ఆకట్టుకున్న చుక్క రాములు ప్రసంగం



నవతెలంగాణ జహీరాబాద్

మహేంద్ర అండ్ మహేంద్ర ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కేంద్రం శంకుస్థాపన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, మహేంద్ర అండ్ మహేంద్ర యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు ప్రసంగం సభికులను, మంత్రిని ఆకట్టుకుంది. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో రూ.వెయ్యి కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కేంద్రం శంకుస్థాపనకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. 'కార్మికులు, పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం సవ్యంగా ఉంటే ఆ రాష్ట్ర అభివద్ధి చెందుతుంది. రాష్ట్రంలోకి పెట్టుబడులు వస్తాయి' అని మహేంద్ర కార్మిక యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అనడంతో... ఆ మాటలకు ఆకర్షితులైన మంత్రి కేటీఆర్ హర్షధ్వానాలతో చుక్క రాములును అభినందించారు. సీఐటీయూ యూనియన్ రాష్ట్ర అభివద్ధికి, కార్మికులు, యాజమాన్యాల సంక్షేమానికి అన్ని విధాలాకషి చేస్తుందని చుక్క రాములు అన్నారు. అపార అనుభవం కలిగిన చుక్క రాములు మహేంద్ర యాజమాన్యాన్ని అన్ని విధాలా ఒప్పించగలుగుతున్నారని కార్మికులు చర్చించుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మే డే వారోత్సవాలు

- 1 నుంచి 7 వరకు నిర్వహణ
- రైతు, వ్యకాస, కార్మిక సంఘాల నేతల పిలుపు

నవతెలంగాణబ్యూరో్-హైదరాబాద్

చారిత్రాత్మకమైన మే డేను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మే 1 నుంచి 7 వరకు వారోత్సవాలను నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో జరిగిన మహత్తరమైన పోరాటంలో అనేకమంది కార్మికులు బలిదానం చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నారని అన్నారు. ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానంతోపాటు వారి హక్కులను హరిస్తున్నదని అన్నారు. నాలుగు రకాల లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి 29 చట్టాలన్నింటినీ కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రవ్యాప్తంగా కార్మిక వర్గంలోకి విస్తతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రైతుల హక్కులను కాపాడాలి, కనీసం మద్దతు ధర ఇవ్వాలి, నల్లచట్టాల రద్దు చేయాలనే డిమాండ్లపై చారిత్రాత్మక రైతు పోరాటం జరిగిందని గుర్తు చేశారు. తద్వారా ఆ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కి కొట్టినప్పటికీ వాటిని మరో రూపంలో తీసుకొచ్చి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని అన్నారు. పని హక్కు కోసం ఆనాడు వామపక్షాలు యూపీఏ ప్రభుత్వంతో పోరాడి ఉపాధి హామీ గ్యారెంటీ చట్టాన్ని సాధించాయని అన్నారు. దాన్ని కూడా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజల మీద తీవ్రమైన భారాలను కేంద్ర ప్రభుత్వం మోపుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులపాటు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే రాబోయే కాలంలో కార్మికులు, కర్షకులను కలిపి ఐక్యంగా మహా ఉద్యమాన్ని చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపా6ధ్యక్షులు పి.జంగారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పాల్గొన్నారు.

ప్రభుత్వం షర్మిలను అడ్డుకుంటున్నది : వైఎస్ విజయమ్మ

నవతెలంగాణ బ్యూరో్-హైదరాబాద్

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిలను ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటున్నదని ఆమె తల్లి వైఎస్ విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో విజయమ్మ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం షర్మిలను ఎందుకు అడ్డుకుం టుందో అర్థం కావడం లేదన్నారు. ప్రతి సారి హౌజ్ అరెస్టులతో అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లు, పదో తరగతి పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయనీ, దీనిపై ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే తప్పేంటని నిలదీశారు. మహిళ అనే కనీస గౌరవం లేకుండా అంతమంది పోలీసులు పైన పడుతుంటే ఆవేశం రాదా? అని ప్రశ్నించారు. పది మంది మహిళా పోలీసులు తనపై పడుతూ, ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ నన్ను కార్లో ఎక్కించబోతే నాకు కూడా ఆవేశం వచ్చిందని చెప్పారు. పోలీసులు షర్మిల డ్రైవర్‌ను, గన్ మెన్లను, మీడియా వాళ్లను కొట్టారని వాపోయారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

పగటేషగాళ్ల మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మరు.

- మైనారిటీ రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు
- అమితాషా వ్యాఖ్యలపై మంత్రి కొప్పుల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్


పగటేషగాళ్ల మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మబోరని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం చేవెళ్ల సభలో చేసిన వ్యాఖ్యలపై కొప్పుల ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీలకు రిజర్వేషన్లనేవి రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. తెలంగాణ సమాజం గురించి అమిత్‌షా కు ఏం తెలుసని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సభలు.. సమావేశాలు పెట్టు కుని పబ్బం గడిపేవారు కేసీఆర్‌ను విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే మైనారిటీ రిజర్వేన్లు తొలగిస్తామని చెప్పడం రాజ్యంగాన్ని అపహాస్యం చేయడమేనని తెలిపారు. దీన్ని బట్టే అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల పట్ల వీరి చిత్తశుద్ధి ఏపాటితో విదితమవుతున్నదని ఎద్దేవా చేశారు. ఇదేనా బీజేపీ నేతలకు రాజ్యాంగం పట్ల ఉన్న నమ్మకం అని ప్రశ్నించారు.దళిత, మైనారిటీ వర్గాలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ప్రపంచ గూఢచారి!

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ పైన, ఇంకొందరు ఐరాస అధికారులపైన అమెరికా గూఢచర్యానికి పాల్పడడం దారుణం. విస్తుగొలిపే ఈ వాస్తవాన్ని ఇటీవల లీకైన పెంటగాన్ పత్రాలు వెల్లడించాయి. ప్రపంచంపై తన ఆర్థిక, రాజకీయ, సైనిక పెత్తనం కోసం నిరంతరం ప్రయత్నించే అమెరికా ఇటువంటి సిగ్గుమాలిన పనులకు దిగజారుతోంది. శత్రు దేశాల సంగతి అటుంచి తన మిత్ర దేశాల అధినేతలపై కూడా ఇటువంటి గూఢచర్యానికి పాల్పడుతోంది. స్వయంప్రకటిత ప్రపంచ పోలీసు మాదిరిగా వ్యవహరించే అమెరికా దూకుడుకు, దుశ్చర్యలకూ అడ్డుకట్ట వేయడం అవసరం. గూఢచర్యంపై ఐరాస తన ఆందోళనను అమెరికాకు లాంఛనంగా తెలియజేసింది. దౌత్యపరంగా అది ప్రాథమిక ప్రతిస్పందన. కానీ ప్రపంచ దేశాల ప్రతినిధిగా ఉన్న సంస్థ అధినేతపైన, దాని అధికారులపైనా నిఘా వేయడం ఆ సంస్థను అవమానించడం, దాని ప్రత్యేక ప్రతిపత్తిని ధిక్కరించడమే అవుతుంది. ఐరాస స్వతంత్రతకు, స్వేచ్ఛకు భంగం కలిగించే రీతిలో అమెరికా వ్యవహరించడం ఎంత మాత్రం తగదు. ఐక్యరాజ్యసమితికి ఆతిథ్యమిస్తున్న దేశంగా అమెరికా ఇటువంటి చర్యలకు పాల్పడరాదు. ఈ సిగ్గుమాలిన చర్యపై అంతర్జాతీయ సమాజానికి వివరణ ఇవ్వడం అమెరికా కనీస బాధ్యత. అగ్రరాజ్యం ఆ పని చేయకుండా ప్రజాస్వామ్యం గురించి, స్వేచ్ఛ గురించీ ఉపన్యాసాలు ఉపదేశాలు చేస్తే కుదరదు. వివిధ ప్రభుత్వాలు, అంతర్జాతీయ సమాజం గట్టిగా ఒత్తిడి చేస్తేనే అమెరికా మెడలు వంచడం సాధ్యం.


> ప్రపంచ ఐ.టి రంగంలో, సాంకేతికంగా తన ఆధిపత్యం కొనసాగుతున్నందునే అమెరికా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిలో తనకున్న పట్టు, డిజిటల్ వ్యవస్థల్లో అమెరికన్ కంపెనీలే పైచేయిగా ఉండం తదితర కారణాలవల్ల అగ్రరాజ్యం ఆటలు సాగుతున్నాయి. ఏమైనప్పటికీ తాజాగా వెల్లడైన గూఢచర్యంపై అమెరికా బాధ్యతాయుతమైన రీతిలో వివరణ ఇవ్వాలి. ఐరాసకు అతిథ్యమిచ్చే దేశంగా అమెరికా దాని బాధ్యతలను నెరవేర్చేందుకు ఐరాస ఛార్టర్ ప్రకారం చేపట్టాల్సిన కొన్ని కచ్చితమైన చర్యలు అమలు చేయాల్సిందే.



ఐరాసపై అమెరికా గూఢచర్యానికి పాల్పడడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఐరాస చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించిన బాన్ కి మూన్ పైన, నాటి భద్రతా మండలిలోని నాలుగు దేశాల ప్రతినిధులతో సహా పలువురిపై నిఘా వేసిందని ది గార్డియన్ పత్రిక 2010 లోనే వార్తా కథనాలిచ్చింది. 2013లో లీకైన 'ప్రిజమ్' రహస్య పత్రాలు ఆ విషయాన్ని నిర్ధారించాయి. కాబట్టి అమెరికాకు ఇటువంటి తప్పుడు పనులు చేయడం ఓ అలవాటని విదితమవు తోంది. ఏవైనా పత్రాలు లీకైతేనో పరిశోధనాత్మక జర్నలిస్టులు వెలికితీస్తేనో ఇలాంటి దుశ్చర్యల గురించి లోకానికి తెలుస్తోంది. అసలు వెల్లడి కాకుండా ఎన్ని దాగి ఉన్నాయో! ప్రపంచ దేశాల ప్రతినిధిగా ఐక్యరాజ్య సమితి, దాని అను బంధ సంస్థలూ వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల మొదలు అత్యంత వెనుకబడిన దేశాల వరకూ ఉన్న యావత్ ప్రపంచ ప్రజల విద్య, వైద్య, ఆరోగ్య, ఆహార అంశాలతోబాటు సాంస్కృతిక విషయాలపై కూడా పరిశీలన, అధ్యయనం చేయడమేగాక పరిష్కార మార్గాలనూ ఆయా సందర్భాల్లో సూచిస్తున్నాయి. ప్రపంచ సంస్థగా అది నిరపేక్ష వైఖరి అనుసరిస్తున్నా వెనుకబడిన దేశాలకు బాసటగా నిలవడం సహజం. అమెరికాకు ఇది కంటగింపుగా ఉంది. ఆ కారణంగానే ఐరాసకు, డబ్ల్యూహెచ్ఓ వంటి ఇతర సంస్థలకూ అమెరికా చెల్లించవలసిన నిధుల వాటా చెల్లించకపోవడం లేదా భారీగా కోతలు విధించడం జరుగుతోంది. ఇంకొన్ని జి-7 దేశాలు కూడా ఆ బాట పట్టడంతో ఐరాస, దాని అనుబంధ సంస్థల నిర్వహణకు, కార్యకలాపాలు సాగించడమూ కష్టతరమవుతోంది. ఆర్థిక దిగ్బంధనానికి తోడు నిఘా చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు.

ఇప్పటికీ ప్రపంచ ఐ.టి రంగంలో, సాంకేతికంగా తన ఆధిపత్యం కొనసాగుతున్నందునే అమెరికా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిలో తనకున్న పట్టు, డిజిటల్ వ్యవస్థల్లో అమెరికన్ కంపెనీలే పైచేయిగా ఉండం తదితర కారణాలవల్ల అగ్రరాజ్యం ఆటలు సాగుతున్నాయి. ఏమైనప్పటికీ తాజాగా వెల్లడైన గూఢచర్యంపై అమెరికా బాధ్యతాయుతమైన రీతిలో వివరణ ఇవ్వాలి. ఐరాసకు అతిథ్యమిచ్చే దేశంగా అమెరికా దాని బాధ్యతలను నెరవేర్చేందుకు ఐరాస ఛార్టర్ ప్రకారం చేపట్టాల్సిన కొన్ని కచ్చితమైన చర్యలు అమలు చేయాల్సిందే. ఆ మేరకు అంతర్జాతీయ సమాజం నుండి ఒత్తిడి పెంచాలి. అమెరికా దురహంకారానికి చెక్ పెట్టాలి.

మన దేశ ఆర్థిక పరిస్థితి పుంజుకునే మార్గం



ప్రభాత్ పట్నాయక్

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ప్రధాన దేశాలలోకల్లా అతి వేగంగా పెరుగుతోందని మన ప్రభుత్వ అధికారులు అలుపూ, విరామం లేకుండా చెపుతూనే వుంటారు. 2020-21లో మన దేశం అత్యంత దుర్మార్గమైన లాక్‌డౌన్‌ను అమలు చేసిన సంగతి గాని, దాని పర్యవసానంగా ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకీ మన దేశమే అత్యంత ఎక్కువ మోతాదులో జీడీపీ పతనాన్ని చవిచూసిన సంగతి గాని వారు ఎన్నడూ ప్రస్తావించరు. అలా అతి హీన స్థాయికి పడిపోయిన సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని అక్కడినుంచి మన పెరుగుదలను లెక్కించి మన దేశ ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతోందంటూ చెప్పుకుంటున్నారు.

లాక్‌డౌన్ కన్నా ముందటి ఏడాది, అంటే 2019-20తో 2021-22 సంవత్సరపు (లాక్‌డౌన్ తర్వాత ఏడాది) జీడీపీని పోల్చి చూస్తే కేవలం 1.5శాతం మాత్రమే ఎక్కువగా ఉంది. ఇక 2022-23 సంవత్సరపు జీడీపీ అంతకు ముందటి ఏడు (2021-22) కన్నా 6.8శాతం ఎక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ గాని, మన రిజర్వు బ్యాంకు గాని అంచనా వేస్తున్నాయి. అంటే అది 2019-20 కన్నా 8.4శాతం ఎక్కువ అన్నమాట. మధ్యలో 2020-21ని పక్కన పెట్టి చూస్తే (అది లాక్‌డౌన్ సంవత్సరం కనుక) 2019-20 నుండి 2022-23 దాకా ఉన్న మూడు సంవత్సరాలకాలంలో ఏడాదికి 2.7శాతం చొప్పున మాత్రమే మన దేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలను నమోదు చేసినట్టు కనిపిస్తుంది. ఈ హీనమైన పెరుగుదల కూడా 2023-24లో కొనసాగే అవకాశాలు లేవు. గత ఏడాది కన్నా తక్కువ స్థాయిలోనే పెరుగుదల ఈ ఏడు ఉండబోతున్నట్టు అంచనాలు సూచిస్తున్నాయి.

> ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం అనేది మన దేశంలో అంతగా ఫలితాన్ని ఇవ్వదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. ఆ తరగతి చేసే వినిమయం ప్రధానంగా విదేశాల మార్కెట్లకు తోడ్పడుతుంది.

దాదాపు అన్ని సంస్థలూ 2023-23లో వృద్ధి రేటు గతేడాది కన్నా తక్కువగానే ఉండబోతున్నట్టు తమ తమ అంచనాలను ప్రకటించాయి. ఐఎంఎఫ్ అంచనాలనే చూసుకుంటే భారతదేశం 2022-23లో 6.8శాతం వృద్ధి నమోదు చేసిందని, అదే 2023-23లో వృద్ధి 5.9శాతం మాత్రమే ఉండబోతున్నదని తెలిపింది. మన ప్రభుత్వ అధికారులు ప్రకటిస్తున్న వృద్ధిరేటు తప్పుడు ప్రాతిపదికలతో లెక్కించినందువలన వాటిని ప్రామాణికంగా తీసుకోకూడదని, వాస్తవ వృద్ధి రేటు కన్నా బాగా ఎక్కువగా చూపిస్తున్నారని కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేసినవారు తెలిపారు. లాక్‌డౌన్‌తో కుదేలైన మన ఆర్థిక వ్యవస్థ ఆ తర్వాత పడుతూ లేస్తూ ముందడుగు వేస్తోందని, ఇప్పుడు ఆ పరిస్థితి కూడా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదని, ఈ ఏడాది వృద్ధిరేటు తగ్గబోతోందని అంచనాలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పుడు వేస్తున్న అంచనాలకన్నా కూడా ఇంకా తగ్గుదల ఎక్కువగా ఉండబోతోందని చెప్పవచ్చు. ఎందుకంటే చమురు ఉత్పత్తి దేశాలు మే ఒకటో తేదీనుండి తమ ఉత్పత్తిని రోజుకు పది లక్షల బ్యారెళ్ళ మేరకు తగ్గించుకోవాలని నిర్ణయించాయి. గత అక్టోబర్‌లో 20లక్షల బ్యారెళ్ళ మేరకు తమ రోజువారీ ఉత్పత్తిని తగ్గించాయి. దానిమీద ఇప్పుడు అదనంగా మరోసారి తగ్గించబోతున్నాయి. దీని ఫలితంగా మన దేశ వృద్ధిరేటు మరింత దెబ్బ తింటుంది.

చమురు ఉత్పత్తి తగ్గించినందువలన అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం మరింత కష్టసాధ్యం ఔతుంది. (గత వారం వ్యాసంలో ఈ విషయాన్ని వివరంగా మనం చర్చించాం) అందువలన అమెరికా తన వడ్డీ రేట్లను మరింత పెంచక తప్పదు. అప్పుడు మన దేశంనుండి పెట్టుబడులు అమెరికావైపు మరింత ఎక్కువ వేగంగా తరలిపోతాయి. మనదగ్గర ఉండే డాలరు నిల్వలు తరిగిపోతే మన రూపాయి విలువ పడిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే విదేశీ నిల్వలు అమెరికాకు తరలిపోకుండా ఆపాలి. అందుకోసం మనదగ్గర వడ్డీ రేట్లను కూడా బాగా పెంచాలి. అప్పుడు మన దేశంలో ద్రవ్యోల్బణం బాగా పెరుగుతుంది. దాని ఫలితంగా మన ఆర్థిక వృద్ధిరేటు తగ్గిపోతుంది.


అమెరికా వడ్డీరేట్ల సంగతి పక్కన పెట్టినా, చమురు ఉత్పత్తి తగ్గిందంటే దాని ఫలితంగా పెట్రోలు, ఇతర చమురు ఉత్పత్తుల ధరలు పెరిగిపోతాయి. అప్పుడు మన దేశం దిగుమతి చేసుకునే చమురుకు ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది. దాని కారణంగా ఇతరత్రా ఆర్థిక కార్యకలాపాలకు చేసే ఖర్చు తగ్గిపోతుంది. దానిఫలితంగా మన వృద్ధిరేటు తగ్గిపోతుంది.

ఈ చమురు ధరలు పెరగడం వలన కలిగే ప్రభావం పక్కన పెట్టినా, మన దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం తగ్గిపోనుంది. నిజానికి 2022-23 చివరి త్రైమాసికంలోనే వృద్ధిరేటు అంతకు ముందరి మూడు నెలలతో పోల్చితే 4.4. నుండి 4.2కి తగ్గిపోయిందని రిజర్వుబ్యాంకు అంచనాలు చెపుతున్నాయి. కరోనా మహమ్మారి అనంతరం మన దేశం సాధించిన స్వల్పమైన వృద్ధి రేటు కూడా నిలబడకుండా ఎందుకు దిగజారిపోతోంది?

దీనికి మూలకారణం నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థ స్వభావంలోనే ఉంది. ఈ తరహా ఆర్థిక వ్యవస్థలో జరిగే మొత్తం ఉత్పత్తిలో ప్రయివేటు వ్యక్తుల వినిమయం భాగం తగ్గిపోతుంది. ఆర్థిక అసమానతలు నయా ఉదారవాద విధానాల ఫలితంగా పెరిగిపోతాయి. అందువలన ఎక్కువ మంది వ్యక్తుల వినిమయ శక్తి తగ్గిపోతుంది. తమ ఆదాయాలతో నిమిత్తం లేకుండా ఖర్చు చేయగలవారు (సంపన్నులు) కొద్దిశాతమే ఉంటారు. వారి వినిమయం ఎంత ఉన్నా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నెట్టడానికి అది సరిపోదు.

ఇంకోవైపు ప్రయివేటు వ్యక్తులు పెట్టే పెట్టుబడులు మార్కెట్‌లో వృద్ధి ఎంత మోతాదులో ఉండబోతోంది అన్న అంచనా బట్టి ఉంటాయి. కాబట్టి ప్రయివేటు పెట్టుబడులూ ఆర్థిక వృద్ధిని ముందుకు నెట్టడానికి తోడ్పడవు. ఇక ప్రభుత్వం చేసే వ్యయంతో ఆర్థిక వృద్ధిని ప్రేరేపించాలనుకుంటే, ఆ ప్రభుత్వ వ్యయం కూడా పరిమితులకు లోబడే ఉండాలి. ఎందుకంటే ద్రవ్యలోటు జీడీపీలో ఒక నిర్దిష్ట శాతానికి (దాదాపు 4శాతం) మించి ఉండకూడదన్నది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విధించిన నిబంధన. ఆ నిబంధనను అతిక్రమించకుండా ప్రభుత్వ వ్యయం పెరగాలంటే సంపన్నులమీద విధించే పన్నులను పెంచడమే మార్గం. కాని అందుకు కూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు. ఇంక మిగిలినవి రెండే మార్గాలు. మొదటిది: దిగుమతులకన్నా ఎగుమతులు బాగా ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, రెండోది: గృహాల, భూముల విలువలను కృత్రిమంగా పెంచివేయడం. అప్పుడు వ్యక్తుల ఆదాయాలతో నిమిత్తం లేకుండా ఆర్థిక వ్యవస్థ వృద్ధి కొంతవరకూ జరగవచ్చు.

కాని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం అనేది మన దేశంలో అంతగా ఫలితాన్ని ఇవ్వదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. ఆ తరగతి చేసే వినిమయం ప్రధానంగా విదేశాల మార్కెట్లకు తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడంలేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రయివేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనేలేదు.



> కరోనా తర్వాత మన ప్రభుత్వం తనవద్ద నిల్వ ఉన్న ఆహారధాన్యాలలో కొంత భాగాన్ని పేద కుటుంబాలకు అందిస్తోంది. అందుచేత శ్రామిక ప్రజానీకానికి నేరుగా అందేలా ప్రభుత్వ వ్యయం ఉంటే, ఆ సొమ్ము ఆహారదినుసుల కొనుగోలు కన్నా ఇతర వినిమయ సరుకుల కొనుగోలు కోసం ఎక్కువగా ఖర్చు అవుతుంది. అప్పుడు ఆ సరుకులను మళ్ళీ ఉత్పత్తి చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఆ విధంగా డిమాండ్ పెరిగి ఆరిక్థ వ్యవస్థ మళ్ళీ వేగం పుంజుకునే వీలుంటుంది.

ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏ యే పద్దులమీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు ప్రభుత్వం చేసే ఖర్చు నేరుగా శ్రామిక ప్రజానీకానికి అందించవచ్చు, లేదా, మౌలికవసతుల కల్పనపై ఖర్చు చేయవచ్చు. ఒకవేళ ప్రభుత్వం నేరుగా శ్రామిక ప్రజానీకానికి అందే విధంగా ఖర్చు చేసిందనుకుందాం. అప్పుడు ఆ సొమ్ము మొత్తం శ్రామిక ప్రజానీకం తిరిగి ఖర్చు చేసేస్తారు. వాళ్ళు సరుకులను, సేవలను పొందడానికి ప్రధానంగా ఖర్చు చేస్తారు. ఆ సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమవద్దకు వచ్చినసొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్‌లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్‌లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులకోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతులకోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్‌లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్‌లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు.

కరోనా తర్వాత మన ప్రభుత్వం తనవద్ద నిల్వ ఉన్న ఆహారధాన్యాలలో కొంత భాగాన్ని పేద కుటుంబాలకు అందిస్తోంది. అందుచేత శ్రామిక ప్రజానీకానికి నేరుగా అందేలా ప్రభుత్వ వ్యయం ఉంటే, ఆ సొమ్ము ఆహారదినుసుల కొనుగోలు కన్నా ఇతర వినిమయ సరుకుల కొనుగోలు కోసం ఎక్కువగా ఖర్చు అవుతుంది. అప్పుడు ఆ సరుకులను మళ్ళీ ఉత్పత్తి చేయవలసిన అవసరం ఏర్పడుతుంది. ఆ విధంగా డిమాండ్ పెరిగి ఆరిక్థ వ్యవస్థ మళ్ళీ వేగం పుంజుకునే వీలుంటుంది. పైగా అదనపు ఉపాధికల్పన కూడా జరుగుతుంది. ఈ విధంగా ప్రస్తుతం ఆర్థిక భారాలతో నలిగిపోతున్న శ్రామిక ప్రజానీకానికి ఊరట లభించడంతో ఒబాటు ఆర్థిక వ్యవస్థవేగం కూడా పెరిగేందుకు వీలు ఉన్నప్పుడు ప్రభుత్వం ఆ విధంగా ఎందుకు చేయడం లేదు? తన ఆశ్రయంలో ఉన్న కార్పొరేట్ల సేవ తప్ప తక్కినదేదీ పట్టని మోడీ ప్రభుత్వానికి శ్రామిక ప్రజలను పట్టించుకునే తీరిక ఎంతమాత్రమూ లేదు.

(స్వేచ్ఛానుసరణ)

రిపోర్టర్స్ డైరీ

అన్నయ్య వచ్చాడోచ్...

విశాఖ ఉక్కు కర్మాగారం నడ్డి విరిచి... దాన్ని అర్థకో, పావలాకో అమ్మేందుకు కంకణం కట్టుకున్న మోడీ సర్కార్ అందుకోసం శరవేగంగా పావులు కదుపుతూ ఉన్నది. అక్కడి కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు ఏకమై పిడికిలి బిగించిన తర్వాత అలాంటి చర్యల నుంచి కాస్త వెనక్కి తగ్గినట్టు కనిపించినా ఆ సంస్థను కార్పొరేట్ గద్దలకు అప్పజెప్పటంలో మాత్రం 'తగ్గేదేలే...' అన్నట్టుగా కేంద్రం తీరు ఉండటం యావత్ తెలుగు ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో ఇటు తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి సంస్థ నుంచి కూడా విశాఖ ఉక్కు బిడ్డింగ్‌లో పాల్గొంటామంటూ ప్రకటనలూ వెలువడటం తెలిసిందే. అయితే ఆయా బిడ్లలో ఆ రెండూ పాల్గొన లేదనుకోండి... అది వేరే విషయం. సరిగ్గా ఈ చర్చ కొనసాగుతున్న సమయంలోనే 'ది గ్రేట్ కేఏ పాల్ అన్న...' సీన్‌లోకి ఎంటరయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో విశాఖ ఉక్కు పరిశ్రమను కొనుగోలు చేయగల ఏకైక మొనగాణ్ని నేనే నంటూ స్టేట్‌మెంట్ ఇచ్చి పారేశాడు. ఇది విన్న ఆంధ్రా, తెలంగాణ ప్రజలు... 'బాబ్బాబూ... నీకు పుణ్యం ఉంటుంది. కాస్త ఆ పని చేసి పెట్టు. రెండు రాష్ట్రాలూ నీకు రుణపడి ఉంటాయి. లక్షలాది మంది ఉపాధిని కాపాడిన వాడివవుతావు...' అంటూ పాలన్నను వేడుకుంటున్నారు. కేసీఆర్ అయితేనేం, పాలన్న అయితేనేం... మనకు కావాల్సింది వైజాగ్ స్టీల్‌ను కాపాడుకోవటం. మరి జనం వేడుకోలును పాలన్న ఆలకిస్తాడా..? లేదా..? చూద్దాం... అన్న ఏం చేస్తాడో...

-బి.వి.యన్.పద్మరాజు

ఏసింది మొన్ననే గదా..?

ఓవైపు ఆకాశమంత అంబేద్కర్ విగ్రహం... మరోవైపు తళుకులీనుతున్న నూతన సచివాలయం... ఇంకోవైపు స్ఫూర్తిని నింపబోతున్న అమరవీరుల జ్యోతి... వెరసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు సరికొత్త కళను సంతరించుకున్నాయి. ఈ మూడింటిని చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. ఈ క్రమంలో సచివాలయం, ఎన్టీఆర్ గార్డెన్ ముందు ప్రాంతాలను పరిశీలించిన ఓ ఔత్సాహిక పాత్రికేయుడు... ఓ డౌటనుమానం వ్యక్తం చేశారు. అదేంటంటే... ఇటీవల ఫార్ములా వన్ రేసు పేరిట అక్కడి రోడ్లను తవ్వేసి, కొత్త రోడ్లను వేసిన జీహెచ్ఎంసీ, ఇప్పుడు ఆ కొత్తగా వేసిన రోడ్డును మళ్లీ తవ్వేయటమేంటా..? అన్నది ఆయన అనుమానం. దాన్ని తవ్వటమేగాకుండా మళ్లీ ఆగమేఘాల మీద కొంగొత్త రోడ్డును రూ.కోట్లను వెచ్చించి నిర్మిస్తున్నారు. 'అరే బయ్... ఈ మధ్యనేగదా కోట్లు గుమ్మరించి, రోడ్డును వేశారు. మళ్లీ దాన్ని తవ్వేసి, ఇంకో రోడ్డు వేయటం దేనికి... ఇది ప్రజాధనం దుర్వినియోగం చేయటమేకదా..?' అన్నది ఆ జర్నలిస్టు ఆవేదన. ఆయన ఆవేదనలో నిజముందంటారా..? లేదా..?

-కేఎన్ హరి

ఎర్రసైన్యం... బలగం...

సినీ చరిత్రలో కమర్షియల్ చిత్రాలెన్నో బ్లాక్‌బస్టర్ అందుకున్నాయి. థియేటర్లలో రెండు, మూడు వందల రోజులు నడిచిన సినిమాలు ఉన్నాయి. వందల కోట్ల రూపాయాల కలెక్షన్లు రాల్చాయి. జనం థియేటర్లకు రావడం తప్ప మరో మార్గంలేని రోజులవి. అటువంటి చిత్రాల గురించి జనం కథలు, కథలుగా చెప్పుకునేవాళ్లు. అలాంటివి కమర్షియల్‌గా గొప్పపేరు తెచ్చిపెట్టినవే. కానీ ప్రజల హృదయాలను కొల్లగొట్టే చిత్రాలు కొన్నే ఉంటాయి. అందులో ఒక్కటి పీపుల్స్‌స్టార్ నటించి, దర్శకత్వం వహించిన ఎర్ర సైన్యం చిత్రం సినీ ఇండ్రస్టీని షేక్ చేసింది. తక్కువ బడ్జెట్ ఎక్కువ పాపులారిటీ సంపాధించి, కమర్షియల్ డైరెక్టర్లకు సవాల్ విసిరింది. కుటుంబాలకు కుటుంబాలు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, బస్సుల్లో సైన్యంలా వెళ్లి ఎర్ర సైన్యం చిత్రాన్ని తిలకించారు. పైసలు లేకపోయినా బదులో, సదులో చేసి మరి ఆ సినిమాను చూశారు. వామపక్ష భావజాలానికి స్వర్ణయుగంగా ఉన్న రోజుల్లోనూ ఎర్రసైన్యం దేశ సరిహద్దులను దాటింది. ఇప్పుడంటే పార్కింగ్‌లో కార్లు, టూ వెహికల్స్ కనిపిస్తున్నాయి. అప్పుడు మాత్రం ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల కనిపించేవి. తాజాగా బలగం చిత్రం సైతం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. మెస్మరైజ్ చేస్తున్నది. అన్ని సౌకర్యాలు ఉండి థియేటర్లకు పోవడం ఒక ఎత్తయితే... ఉరూరా పరదపై బలగం చిత్రాన్ని చూపించడం మరో ఎత్తు. ఆయా కుటుంబాల్లో ఎప్పుడో మరణించిన తమ వారి స్మార్థకార్థం కోసం బలగాన్ని ఉచితంగా చూపిస్తున్నారు. ప్రజల అదరణను పసిగట్టిన మన నేతలు సైతం ఈ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. ఆ సినిమా నాయకుల ప్రసంగంతో ప్రారంభిస్తున్నారంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. తెలంగాణలో పాతుకు పోయిన కర్మకాండల సెంటిమెంట్‌ను రగిలించిన బలమే మన 'బలగం'.

-గుడిగ రఘు

ప్రతిపక్షాల ఐక్యతకు సార్థకత చేకూరాలంటే...

ఈ మధ్య ప్రతిపక్షాల ఐక్యత గురించి ఎక్కువగా మాట్లాడుకోవడం వినిపిస్తోంది. వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు సమావేశాల మీద సమావేశాలు జరుపుతుండటంతో ఈ చర్చ మరింత ఊపందుకుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ అర్ధభాగంలో 18ప్రతిపక్ష పార్టీలు ప్రదర్శించిన ఐక్యవైఖరి నేపథ్యంలో ఈ అంశం ముందుకొచ్చింది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జె.పి.సి) వేయాలని ఆ పార్టీలన్నీ డిమాండ్ చేశాయి. అలాగే, ప్రతిపక్ష నేతలను ఈడీ, సిబిఐ లక్ష్యంగా చేసుకోవడాన్ని కూడా అవి సమైక్యంగా వ్యతిరేకించాయి.

క్రిమినల్ పరువునష్టం కేసులో సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి శిక్ష విధించడం, ఆ వెంటనే రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేసినప్పుడు ఐక్యంగా వ్యవహరించాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నేతల అరెస్టు, విచారణ చూశాక, నిరంకుశ ప్రభుత్వం నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం మనుగడ కోసం సాగే పోరాటంగా చాలామంది గుర్తించారు. అయితే ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తేవాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు అనుసరించిన మార్గం, వివిధ రాజకీయ వ్యాఖ్యాతలు, మీడియా ఈ విషయమై చేస్తున్న ఊహాగానాలు చూస్తుంటే... దీని గురించి వాటికి స్పష్టమైన ఆలోచన కొరవడిందని, అవాస్తవిక అంచనాలతో వున్నాయని అర్థమవుతోంది. అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు ఒకే వేదికపైకి వస్తే అది అఖిల భారత ప్రతిపక్ష పార్టీల కూటమి ఏర్పాటుకు ఆలంబనగా ఉంటుందని చెప్పడం చాలా తేలికైన భావన. జాతీయ స్థాయిలో ప్రతిపక్షం తరపున బరిలో నిలిచే నేత ఎవరనే దాని గురించి చర్చించడం మరో వ్యర్థ ప్రయత్నం. రాష్ట్రంలోని అత్యంత బలమైన ప్రతిపక్ష పార్టీ... అది ప్రాంతీయ పార్టీ అయినా లేదా జాతీయ పార్టీ అయినా సరే... బీజేపీ, దాని మిత్రపక్షాలతో ముఖాముఖి పోటీ పడగలిగేలా ఇతర పార్టీలతో అవగాహనకు అవసరమైన షరతులు, నిబంధనలను రూపొందించు కోవడానికి లేదా నిర్దేశించడానికి అనుమతించాలనేది ఈ చర్చలో వచ్చిన మరో ముఖ్యమైన అంశం.

ఈ సూచనలన్నీ క్షేత్ర స్థాయిలో వాస్తవికతకు దూరంగా ఉన్నవే. ప్రతిపక్ష పార్టీల భిన్నమైన స్వభావాలు, సంక్లిష్టతలను ఇవి ఏమాత్రం పరిగణనలోకి తీసుకున్నట్టుగా లేదు. మొట్టమొదట స్పష్టం చేయాల్సిన అంశం ఏమిటంటే అన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలతో కూడిన కూటమి లేదా ఫ్రంట్ రూపంలో ప్రతిపక్షాల ఐక్యతను జాతీయ స్థాయిలో రూపొందించలేమని అర్థంచేసుకోవాలి. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖాముఖి పోటీ ఉండేలా చూడటం ద్వారా బీజేపీపై విజయం సాధించవచ్చనేది మరో భావన. సంకుచిత ఎన్నికల దృక్పథం నుండి వచ్చిన తప్పుడు ఆలోచన ఇది.

ప్రజాస్వామ్యంపై మూకుమ్మడి దాడి, రాజ్యాంగ విధ్వంసం, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, రాష్ట్రాల హక్కులు, సమాఖ్యవాదంపై వ్యవస్థాగతమైన దాడి, హిందూత్వ సిద్ధాంతాలను విద్యా రంగంలోకి చొప్పించడం, మైనారిటీలపై దాడులు వంటి ప్రధానమైన జాతీయ, కీలకమైన రాజకీయ అంశాలపై తీసుకునే ఉమ్మడి వైఖరే ప్రతిపక్షాల ఐక్యతకు ముఖ్య ప్రాతిపదిక అని గ్రహించాలి.

దేశ భవిష్యత్‌కు సంబంధించి కీలకమైన, ప్రాథమికమైన అంశాలు ఇవి. హిందూత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం కోసం పోరాడేందుకు వారు ఎంతవరకు ఐక్యంగా కలిసి వస్తారనేది ప్రతిపక్షాల ఐక్యతకు ఒక పరీక్షగా నిల్చింది. వీటితో పాటు ప్రధానిని, ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసే అనేక కీలకాంశాలు ఉన్నాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై పార్లమెంట్‌లో అన్ని రకాల చర్చలకు అడ్డుగోడగా మోడీ ప్రభుత్వం నిలవడం, పార్లమెంట్‌లో మోడీ చేసిన ప్రసంగంలో అదానీ పేరును కనీసం ప్రస్తావించకపోవడం ఈ మొత్తం వ్యవహారం మీద సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయడానికి తిరస్కరించిన తీరు ఇవన్నీ కలిసి పార్లమెంట్‌లో ప్రతిపక్షాల విస్తృత ఐక్యతకు దోహదపడ్డాయి. పార్లమెంట్ వెలుపల కూడా ఇదే ఐక్యత కొనసాగాలి.



అదానీ అసాధారణంగా ఎదిగిన తీరుపై ప్రధానిని జవాబుదారీ చేయడం, పుల్వామా దాడికి సంబంధించి జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వెల్లడించిన అంశాలపై జవాబు రాబట్టేలా చూడటం వంటివన్నీ ప్రతిపక్షాలను ఏకంచేసే అంశాలే. అదే సమయంలో, రాష్ట్రాల హక్కులపై, సమాఖ్యవాదంపై కేంద్రం దాడిని సమైక్యంగా తిప్పికొట్టేందుకు బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు కనీసం ఒక్కసారైనా సమావేశం కాకపోవడం మొత్తం ప్రతిపక్ష పార్టీల ఆలోచనా ధోరణిలో సమగ్రత కొరవడిన విషయాన్ని తెలియచేస్తోంది.

అన్ని కీలకమైన విధానపరమైన అంశాలపై తమ ప్రత్యామ్నాయ వైఖరిని ప్రతిపక్షాలు ముందుకు తేగలిగితే, ప్రజాస్వామ్యం లౌకికవాదం, సమాఖ్యవాదం వంటి వాటి పరిరక్షణకు అవి గట్టిగా నిలబడగలిగితే, అది, సమైక్య ప్రత్యామ్నాయాన్ని సాధించే దిశగా వేసిన ఒక ముందడుగుగా భావించవచ్చు. ప్రజా సమస్యల పైన అలాగే ప్రజల జీవనోపాధుల పైన నిరంతరం సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా ఉమ్మడి ప్రచారాలు, నిరసనలకు పిలుపు ఇవ్వడం వంటివి చేయాలి.

ఇటువంటి పిలుపులను పలు పార్టీలు కలిసి ఉమ్మడి వేదికల ద్వారాగాని, ఐక్య కార్యాచరణ ద్వారాగాని చేయాలి. ఇది సాధ్యం కాని రాష్ట్రాల్లో సంబంధిత పార్టీలు సమాంతర కార్యాచరణ ద్వారా విడిగా నిర్వహించుకోవచ్చు. జాతీయ స్థాయిలో ఉమ్మడిగా పిలుపునిచ్చినా, కొన్ని రాష్ట్రాల్లో అది అమలు చేయలేని పరిస్థితుల్లో కొన్ని పార్టీలు ఉన్నందున ముందుకెళ్లాల్సిన వాస్తవిక మార్గమిదే.

బీజేపీ వ్యతిరేక ఓట్లను గరిష్ట స్థాయిలో సమీకరించేందుకు రాష్ట్రస్థాయిలో ఎన్నికల ఎత్తుగడలను రూపొందించుకునేందుకు అనువైన పరిస్థితిని కల్పించే సూచనలే ఇవన్నీ. ప్రస్తుతానికి, బీజేపీ, దాని కూటమిపై పోరాడేందుకు విస్తృత అవగాహన కుదిరిన రాష్ట్రాలు రెండే రెండు ఉన్నాయి. అవే తమిళనాడు, బీహార్.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం వంటి కీలకాంశాలపై ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి వైఖరిని తీసుకోగలిగితే, ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టగలిగితే, మొత్తం ప్రతిపక్షం విశ్వసనీయత పెరుగుతుంది. అప్పుడు ప్రజలు వాటిని బీజేపీకి ప్రత్యామ్నాయంగా భావించడం మొదలుపెడతారు. లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు, ఈ ఐక్యతా చొరవలన్నీ ప్రతిపక్ష పార్టీలకు (అవి ఎన్నికల్లో పొత్తు పెట్టుకోనప్పటికీ) ఏదోఒక విధంగా ఉపయోగపడతాయి. అందువల్ల అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒకేచోటకు చేర్చేందుకు ప్రస్తుతం జరుగుతున్న యత్నాలు ఒక స్పష్టమైన డైరెక్షన్‌లో ముందుకు సాగేలా చూడడం అత్యంత కీలకం. ముఖ్యమైన జాతీయ సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయంతో ఐక్యంగా ముందుకు కదలడం, రాష్ట్రాలలో బీజేపీపై పోరుకు ప్రజలను సమీకరించి వీలైన చోటల్లా ఐక్య కార్యాచరణకు పూనుకోవడం, బీజేపీ వ్యతిరేక ఓట్లను గరిష్ట స్థాయిలో ఒకేచోట చేర్చడం వంటివి చేసినప్పుడే ఆ ఐక్యతా యత్నాలకు సార్థకత.

> ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్యవాదం వంటి కీలకాంశాలపై ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి వైఖరిని తీసుకోగలిగితే, ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణ చేపట్టగలిగితే, మొత్తం ప్రతిపక్షం విశ్వసనీయత పెరుగుతుంది. అప్పుడు ప్రజలు వాటిని బీజేపీకి ప్రత్యామ్నాయంగా భావించడం మొదలుపెడతారు. లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు, ఈ ఐక్యతా చొరవలన్నీ ప్రతిపక్ష పార్టీలకు (అవి ఎన్నికల్లో పొత్తు పెట్టుకోనప్పటికీ) ఏదోఒక విధంగా ఉపయోగపడతాయి. అందువల్ల అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒకేచోటకు చేర్చేందుకు ప్రస్తుతం జరుగుతున్న యత్నాలు ఒక స్పష్టమైన డైరెక్షన్‌లో ముందుకు సాగేలా చూడడం అత్యంత కీలకం.

- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

ప్రతిభా తప్లియాల్... 41 ఏండ్ల సాధారణ గృహిణి. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సీనియర్ మహిళల విభాగంలో స్వర్ణం సాధించింది. ఇందులో విశేషమేమిటంటే ఉత్తరాఖండ్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళ ఈమె. అంతేకాదు అనారోగ్యం ఉన్నప్పటికీ కేవలం 16 నెలలు శిక్షణ తీసుకుని ఛాంపియన్ బాడీబిల్డర్‌గా నిలిచింది. అదెలా సాధ్యమయిందో మానవిలో తెలుసుకుందాం...



అనారోగ్యాన్ని జయించింది బాడీబిల్డర్‌గా స్వర్ణం సాధించింది

పౌరీలోని యమకేశ్వర్ బ్లాక్‌కు చెందిన ప్రతిభ గత ఏడాది కేవలం మూడున్నర నెలల శిక్షణ తీసుకుంది. తన జీవితంలో తొలిసారిగా బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొంది. సిక్కింలో జరిగిన జాతీయ ఛాంపియన్ షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. మహిళా బాడీ బిల్డింగ్ లో ధృవతారలా మెరిసిపోయింది. అయితే ఆమె ఈ బాట లో నడవడానికి కారణం ఆమె అనారోగ్యమే. 2008లో రెండో కొడుకు పుట్టాక ఆమె ఆరోగ్యం కాస్త క్షీణించింది. శరీరం కొద్ది శ్రమకే చాలా అలసిపోయేది. బీపీ కూడా తగ్గడం ప్రారంభించింది. ఇద్దరు చిన్న పిల్లల సంరక్షణ, ఇంట్లో పని వల్లే ఇలా జరుగుతోందని అనుకునేది. అయితే ఈ సమస్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది.

ప్రమాద స్థాయిలో థైరాయిడ్

ప్రతిభ భర్త భూపేష్ థప్లియాల్ డెహ్రాడూన్‌లో బట్టల వ్యాపారం చేస్తున్నాడు. అతనికి రెండు దుకాణాలు ఉన్నాయి. పెండ్లి తర్వాత ప్రతిభ భర్త వ్యాపారంలో సహాయం చేసేది. మహిళల బట్టల దుకాణాన్ని ఆమే చూసుకునేది. 2014 వరకు ప్రతిభ ఇల్లు, వ్యాపారం, పిల్లల బాధ్యతలతో పాటు అలసట, లోబీపీతో పోరాడుతూనే ఉంది. చివరకు తట్టుకోలేక డాక్టర్ దగ్గరకు వెళితే థైరాయిడ్ ప్రమాదకర స్థాయికి పెరిగిపోయిందని తెలిసింది. 5 పాయింట్లకు మించకూడని థైరాయిడ్ ఆమెకు 50 పాయింట్లకు చేరుకుంది. దాంతో వెంటనే భారీ డోసు మందులు తీసుకోవడం ప్రారంభించింది. థైరాయిడ్‌ను మందులతో అదుపు చేయవచ్చని అనుకుంది. కానీ పెరుగుతున్న తన బరువును నియంత్రించలేకపోయింది. 2014 - 2018 మధ్య ఆమె బరువు 60 కిలోల నుండి 85 కిలోలకు పెరిగింది. దాంతో డాక్టర్ సలహా మేరకు జిమ్‌లో చేరింది. ఆమెతో పాటు భర్త భూపేష్ కూడా జిమ్‌లో చేరాడు.

ఆటల్లో చురుగ్గా...

ప్రతిభ రిషికేశ్‌లో చదువుకుంది, అక్కడే పెరిగింది. హిందీలో ఎంఏ చేసిన ఆమె చదువుతో పాటు క్రీడల్లో కూడా చాలా చురుగ్గా ఉండేది. చదువుకునే రోజుల్లో వాలీబాల్‌లో ఉత్తరాఖండ్‌కు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించింది. నార్త్ జోన్‌లో ఐదుసార్లు ఆడింది. అంతే కాకుండా ఆల్ ఇండియా స్థాయిలో నాలుగు సార్లు క్రికెట్ ఆడింది. కాబట్టి జిమ్‌లో చెమటలు పట్టడం ఆమెకు కొత్త విషయం కాదు. అయితే ఊహించని విధంగా కేవలం 3-4 నెలల్లో ఆమె బరువు 85 కిలోల నుండి 60 కిలోలకు తగ్గింది.

బాడీబిల్డర్‌కు అనుకూలంగా...

కరోనా తర్వాత 2021 జూన్‌లో థాప్లియాల్ దంపతులు మళ్లీ జిమ్‌లో చేరినపుడు ప్రతిభ తన శరీరాన్ని బాడీబిల్డింగ్‌కు అనుగుణంగా మార్చుకో వచ్చని గమనించిన భూపేష్ "బాడీబిల్డర్‌గా మారే అవకాశాలు ఆమె శరీరంలో కనిపించాయి. బరువు తగ్గించుకునే శిక్షణ ప్రారంభించి నప్పుడు ఆ ఫలితాలు కండరాలపై వెంటనే కనిపిస్తాయి. ఆమె ఇంకొంచెం శిక్షణ తీసుకుంటే సరి పోతుంది" అని భావించాను అన్నాడు. అదే ఏడాది నవంబర్‌లో బాడీ బిల్డింగ్ కోసం భూపేష్ తన భార్యను ఉత్తరాఖండ్ బాడీ బిల్డర్ల సంస్థలో ఉన్న జిమ్‌లో చేర్పించాడు. అయితే మార్చి 2022లో జరగనున్న జాతీయ ఛాంపియన్ షిప్‌ల కోసం ప్రతిభను తయారు చేయడం కంటే అతను చేసిన సప్లిమెంట్‌లను విక్రయించడంపై తన కోచ్ ప్రాధాన్యం ఉందని తర్వాత అతను గ్రహించాడు.



కోచ్ కుంగదీసాడు

నెల రోజుల తర్వాత ప్రతిభ శరీరంలో తేడా గమనించాడు. ఆమె కూడా పోటీకి సిద్ధం కావడం ప్రారంభించింది. కానీ ఆమె కోచ్ మాత్రం తీవ్రంగా నిరుత్సాహ పరిచాడు. "నీకు థైరాయిడ్ వచ్చింది, వృద్ధాప్యం వచ్చింది" అంటూ తనను కుంగదీసే వాడని ప్రతిభ చెప్పింది. దాంతో ప్రతిభ శిక్షణ మొత్తం భూపేష్ చూసుకోవడం మొదలుపెట్టాడు. ఆమె డైట్, ట్రైనింగ్, సప్లిమెంట్స్ అన్నీ భర్త పర్యవేక్షణలోనే మొదలయ్యాయి.

– భూపేష్



దుస్తులతో ఇబ్బంది పడింది

భర్త పర్యవేక్షణలో ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతున్న ప్పటికీ ఆమెకు ఎందుకో కాస్త సంకోచం ఉంది. అది దుస్తుల గురించి. నిజానికి బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్‌లో టూ-పీస్ బికినీలో ప్రదర్శన ఇవ్వాలి. టీషర్ట్, షార్ట్స్ వరకు ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ టూ-పీస్ బికినీ ధరించడానికే ఇబ్బంది పడింది. అయితే అది అసలు సమస్య కాదని భర్త ఆమెకు హామీ ఇచ్చారు. భర్త ఇస్తున్న నిరంతర ప్రోత్సాహంతో ఆమెలోని సంకోచం మాయమైపోయింది.

మంచి గుర్తింపు వచ్చింది

మూడున్నర నెలల బాడీ బిల్డింగ్ కెరీర్‌లో ఎన్నో ఏండ్లగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళలను వెనక్కి నెట్టి నాలుగో స్థానంలో నిలిచిందని భూపేష్ చెబుతున్నాడు. ఈ ఘనత వల్ల ఆమెకు కూడా మంచి గుర్తింపు వచ్చింది. స్థానిక హోటల్ ప్రతిభ వన్-టైమ్ డైట్‌ను స్పాన్సర్ చేసింది. జిమ్ యజమాని ఆమెకు అనుకూలమైన సమయంలో జిమ్‌ను ఉపయోగించుకునే సౌకర్యాన్ని కల్పించారు. ఇలా వచ్చిన అవకాశాలన్నీ ఉపయోగించుకుని ఈ ఏడాది మార్చి 4-5 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని రత్లామ్‌లో జరిగిన జాతీయ ఛాంపియన్ షిప్ లో ప్రతిభ స్వర్ణం సాధించి యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది.

బాడీబిల్డింగ్ ఖరీదైన క్రీడ

ఛాంపియన్‌షిప్‌కు నెల ముందు భూపేష్ తన దుకాణాన్ని మూసివేసాడు. ప్రతిభ శిక్షణ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఆమె శారీరక, మానసిక బలాన్ని చూసుకున్నాడు. వాస్తవానికి బాడీబిల్డింగ్ ఖరీదైన క్రీడ. డైట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి, పూర్తి కాలం శిక్షణ కోసమే కేటాయించాలి. దాంతో ఒకానొక సమయంలో వారి ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా మారిందని, తన ఇద్దరు అన్నలు, అక్క తనకు సహాయం చేశారని ప్రతిభ చెప్పింది. ఇప్పుడు ప్రతిభ ఆసియా, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు సిద్ధమవుతోంది. దేశానికి ప్రపంచ గుర్తింపును తీసుకొస్తానంటుంది. తనకు కోచ్‌గా ఉన్న భర్తపై ఆమెకు పూర్తి విశ్వాసం ఉంది. అయితే డబ్బు ఏర్పాటు చేయడమే సవాలు. ప్రభుత్వం నుంచి, సమాజం నుంచి తమకు సాయం అందుతుందని ఆశిస్తున్నట్లు భూపేష్ అంటున్నాడు.

కుటుంబ మద్దతుతో...

ప్రతిభ పిల్లలు కూడా వంట చేయడం ప్రారంభించారు. దాంతో తల్లికి మరింత సమయం దొరికింది. అయితే ఈ విజయం ఆమె అంత సులభంగా రాలేదు. ఈ విజయం కోసం ప్రతిభ ఏడాది పొడవునా చాలా కఠినమైన శిక్షణ చేసింది. కుటుంబం కూడా పూర్తి మద్దతు ఇచ్చింది. భర్త భూపేష్ కోచ్‌గా, మెంటార్‌గా ఆమెకెంతో ధైర్యాన్ని ఇచ్చాడు. ఇంటర్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కొడుకులు కూడా ఆమెకు పూర్తిగా సహకరించారు. చిన్న కొడుకు ఆమ్లెట్‌తో పాటు శాండ్‌విచ్‌లు చేయడం కూడా నేర్చుకున్నాడు. దాంతో తాను భోజనం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతిభ చెప్పింది.



విద్యే అసలైన సంపద

హలో.. నమస్తే శ్రీవిద్య.. మా పిల్లలకు చదివి చెప్పేందుకు మంచి పుస్తకాలు కావాలండీ. మా చిరునామా పంపిస్తానండీ. అయితే అంతకన్న ముందు మీవంటి మేధోసంపదతో మాట్లాడటానికి ఓ పది నిముషాలు అంగీకరించారు చాలా కృతజ్ఞతలు...

మీరు పిల్లలకోసం వివిధ గ్రంథాలలో నుంచి సేకరించిన అమూల్యమైన విషయాలను కథలుగా రూపొందించి అందజేస్తున్నారంట. అసలు అంతటి గొప్ప ఆలోచన మీకు ఎలా తట్టింది. ఓహో... మీ పిల్లలకోసం మీ మేధస్సులో మెరిసిందా.. ఒక గృహిణీగా ఒకతల్లిగా బాధ్యతలు ఉన్నప్పటికీ మీ పిల్లల్లాంటి ఎందరో బిడ్డల కోసం ఇంత అపూర్వ సంపద సమకూర్చుతున్నారన్నమాట.. శభాష్

ఓహ్... ఔనా తొలిగా మన తెలుగింటి పండుగలైన దీపావళి సంక్రాంతి గురించే పుస్తకాలు ప్రచురించారా..! వావ్... ఏంటీ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. దాన్ని ఆవిష్కరించారా..! అదిగో మా అబ్బాయి చెబుతున్నాడు మీ పుస్తకాలు అల్లు అర్జున్ పిల్లలు కోరి తెప్పించుకున్నారట. ఒక ఘనతను మించిన ఘనత.. మరొకటీ.. మీతో మాట్లాడుతుంటే ఆనందం ఆశ్చర్యం ఉప్పొంగుతున్నాయి.

ఏంటీ స్వప్నా దత్ కూడా కోరి మరీ పొందారా.. ఆహా అంతర్జాల మాధ్యమాల్లో కూడా ఉంచారా..! అక్షర కిరణాలు ప్రసరించే పశ్చిమ సూర్యునిలా మీరు విదేశంలో ఉంటూ మన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల గ్రంథ విశేషాలను ఇలా పంచటం ఒక బృహత్తరసత్కార్యం. పుస్తకం, పఠనం అనే శుభ లక్షణాలు కొరవడుతున్నాయని నిత్యం ఆవేదన చెందే నాలాంటి పుస్తక ప్రేమికుల వేదనకు ఎంత చక్కని వెన్నెలమలాము అద్దారండి. నిజంగా మీ కృషి ప్రసంశనీయం, ప్రశస్తం.

ఈ రంగంలో మీ నిత్య కృషికి పురస్కారాలు సైతం మిమ్మల్ని చేరి సార్థకత పొంది ఉంటాయి అనుకుంటా వాటివివరాలూ... ఓహ్ స్వీయ పుస్తక కేటగిరిలో బిజినెస్ మింట్ పురస్కారం పొందారన్నమాట. హృదయపూర్వక అభినందనలు. ఈ పుస్తకాలు ప్రచురణా ఇదంతా.. ఎలా? ఓ ఔనా ప్రచురణ కర్తలు, దిద్దుబాట్లు చేసేవారూ, ముఖచిత్రరూపకర్తలు అందరూ ఇంటి నుంచే పని చేస్తారా. చాలా బాగుంది విద్య ఈ సేనతో లోకానికి జ్ఞాన వికాసం కలిగిస్తున్న యోధ మీరు. ఇంతటి గొప్ప సంపద అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో తెలుసుకోవచ్చా..?

ఆహా.. విమానాశ్రయాలలో వాణిజ్య సముదాయాలలో లభ్యమయ్యే విధంగానా బావుందండీ. Apic.com వ్యవస్థాపకురాలిగా మీ కృషి అద్భుతం. మీ మేధకు తోడు వియ్ హబ్ సహకారంతో అశేష తెలుగు ప్రజలకు ఉపయోగపడేలా గొప్ప పని చేస్తున్నారు. మీ అసాధారణ మేధో సంపదతో మహిళాశక్తిని మహోన్నతంగ చాటుతున్నారు. విద్యే అసలైన సంపద అని ప్రపంచానికి చాటి చెబుతున్న మీరు మరిన్ని విజయాలు సాధించాలి.



– డా.కోడూరు సుమనశ్రీ
9490401968

ఎంపీ అవినాష్ రెడ్డికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి అత్యున్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను సీబీఐ అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అవినాష్ రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులను నిలిపివేసింది. అంతేకాదు విచారణలో లిఖిత పూర్వకంగా ప్రశ్నలు ఇవ్వాలని సీబీఐని హైకోర్టు ఆదేశించడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుబట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని నిర్దేశించిన రీతిలోనే దర్యాప్తు చేయాలని ఆదేశించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది.

వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డికి ప్రింటెడ్ ప్రశ్నలను అందించాలని సీబీఐని ఆదేశిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా ధర్మాసనం కొట్టివేసింది. ఇటువంటి ఆదేశాలు తీవ్ర పక్షపాత దర్యాప్తుకు సంబంధించినవని పేర్కొంది. హైకోర్టు ఉత్తర్వులు దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీబీఐ విచారణకు గడువు పెంపు

అంతేకాదు ఏప్రిల్ 30 నాటికి విచారణ ముగించాలని గతంలో ఇచ్చిన గడువును సుప్రీంకోర్టు పెంచింది. జూన్ 30 లోపు విచారణ పూర్తి చేయాలని న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. హైకోర్టు బెయిల్‌పై తేల్చేంత వరకు అరెస్టు చేయకుండా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని అవినాష్ తరపు న్యాయవాది కోరగా.. ఈ విజ్ఞప్తిని సుప్రీం అంగీకరించలేదు. అవినాష్ విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు తప్పుడు సంప్రదాయానికి దారితీసేలా ఉన్నాయని, దర్యాప్తును కూడా ప్రభావితం చేసేలా ఉన్నాయని సీజేఐ ధర్మాసనం పేర్కొంది.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రెండేండ్లకు ఒకసారి ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతాయని, వెంటనే ఆ ప్రక్రియ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేత కె రాజిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్ నందా సోమవారం విచారించారు. 2016లో ఎన్నికలు జరిగాయని, 2018లో ఆ సంఘం కాల పరిమితి ముగిసిందని వివరించారు. రెండేండ్లకోసారి ఎన్నికలు జరగాలన్న నిబంధనను అమలు చేయడం లేదంటూ పిటిషనర్ వాదించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఎండీతోపాటు పలువురిని పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలంటూ పలుమార్లు కార్మిక శాఖ కమిషనర్‌ను స్వయంగా కోరినా ఫలితం లేదన్నారు. ట్రేడ్ యూనియన్లను నీరుగార్చేలా ప్రభుత్వ విధానం ఉందని తెలిపారు. సంఘ వ్యవహారాన్ని నిరుత్సాహపరిచేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వివరించారు. ఎన్నికలు నిర్వహించకపోవడం చట్టవిరుద్ధమని చెప్పారు. వెంటనే టీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ పిటిషనర్ తరపున న్యాయవాది ఏకే జయప్రకాశ్‌రావు వాదించారు. వాదనల అనంతరం మూణ్నెళ్లలోగా ఎన్నికలు నిర్వహించాలంటూ న్యాయమూర్తి నందా ఉత్తర్వులు జారీ చేశారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలపై అవగాహనా కార్యక్రమం : టీఓఎమ్‌సీఓఎమ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ఈ నెల 27న హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టీఓఎమ్‌సీఓఎమ్) సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఒకటి తిరస్కరణ..రెండింటిపై వివరణ కోరిన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్, న్యూఢిల్లీ

రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ బిల్లులపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఒక బిల్లును తిరస్కరించి.. మిగిలిన రెండు బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరారు. డీఎంఈ (డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) సహా వైద్యవిద్యలో పాలనాపరమైన పోస్టుల పదవీ విరమణ వయస్సు పెంపునకు ఉద్దేశించిన చట్ట సవరణ బిల్లును తమిళిసై తిరస్కరించారు. పురపాలికల్లో అవిశ్వాస తీర్మానం గడువును మూడు నుంచి నాలుగేండ్లకు పొడిగింపు, కో-ఆప్షన్ సభ్యుల సంఖ్య పెంపునకు ఉద్దేశించిన పురపాలిక చట్టసవరణ బిల్లు, కొత్తగా మరికొన్ని ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు అనుమతిస్తూ తీసుకొచ్చిన చట్టసవరణ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమె వివరణ కోరారు. గతంలోనే మూడు బిల్లులకు ఆమోదం తెలిపిన గవర్నర్..రెండింటిని రాష్ట్రపతి సమ్మతి కోసం పంపారు. తాజాగా గవర్నర్ తీసుకున్న నిర్ణయంతో రాజ్‌భవన్‌లో ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేనట్టయింది.

మరోవైపు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను క్లియర్ చేసేందుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం శనివారం విచారించింది. గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గవర్నర్ వద్ద ఏ బిల్లులు పెండింగ్‌లో లేవంటూ తెలిపారు. కొన్ని బిల్లులను మాత్రం ఆమె తిప్పి పంపారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ.. ఎన్నికైన ప్రభుత్వం గవర్నర్ దయకోసం చూడాల్సి వస్తోందన్నారు. 'మధ్యప్రదేశ్‌లో ఒక వారంలో, గుజరాత్‌లో ఒక నెలలో బిల్లులు ఆమోదం పొందుతున్నాయి. తెలంగాణ ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం కాబట్టి ఇది జరుగుతోంది' అని పేర్కొన్నారు. 2022 సెప్టెంబర్ నుంచి మూడు బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచారనే విషయాన్ని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో దవే, మెహతా మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కోర్టులో అరవొద్దనీ, దానివల్ల ఏం సాధించలేరంటూ దవేని ఉద్దేశించి మెహతా అన్నారు. దీనికి దవే స్పందిస్తూ "ఆయన అంత నీచ స్థాయికి దిగజారిపోయాడు. ఆయన అరుస్తూ అన్నాడు. నేనూ అరిచానా? ఇతను దేశానికి లా ఆఫీసర్. కేంద్ర ప్రభుత్వం నియమించిన న్యాయాధికారి. కనిపించిన ప్రతిసారీ, అతనికి నామీద ఎలర్జీ ఉంటుంది. నాకు మీ మీద అలెర్జీ ఉంది. అతను చాలా దిగజారిపోయాడు" అని పేర్కొన్నారు. ఈ తరుణంలో ధర్మాసనం ఈ విషయంపై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నది. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200లోని మొదటి నిబంధనను అమలు చేయడానికి బిల్లులను "సాధ్యమైనంత త్వరగా" వాపసు చేయాలని పేర్కొంది. బిల్లులను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేయాలనీ, లేకపోతే నిర్ణీత సమయంలో తిరిగి పంపాలని సూచించింది. బిల్లులను ఎప్పటికప్పుడు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించింది. ఆర్టికల్ 200 మొదటి నిబంధన ప్రకారం, బిల్లును సమర్పించిన తరువాత గవర్నర్ 'సాధ్యమైనంత త్వరగా' నిర్ణయం తీసుకోవాలి. సమ్మతి కోసం, ద్రవ్య బిల్లు కాని బిల్లును రాష్ట్ర శాసనసభకు పునరాలోచన సందేశంతో తిరిగి పంపండి. "సాధ్యమైనంత త్వరగా" అనే ముఖ్యమైన రాజ్యాంగ ఉద్దేశం ఉంది. దానిని గుర్తుంచుకోవాలి" అని పేర్కొంది. ధర్మాసనం పరిశీలనపై ఎస్‌జీ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. అది అవసరం లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ స్పందిస్తూ 'మేం ఈ గవర్నర్ కోసం ఈ పరిశీలన చేయలేదు. దీన్ని గుర్తుంచుకోవాలని మేము చెప్పాం' అని అన్నారు. ప్రస్తుతం బిల్లులు పెండింగ్‌లో లేనందున ఈ కేసును ముగిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది.

ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు ఐఎఫ్‌టియు మద్దతు

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్న ఆర్టిజన్ కార్మికులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఆ మాట తప్పారని విమర్శించారు. విద్యుత్ సంస్థల్లో ఒకే రకమైన పనికి రెండు రకాల వేతనాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేలా యాజమాన్యం ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

చైనా కంటే ఎందుకు వెనుకఉన్నాం?

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్రాలు ఎందుకు సాధించలేకపోయాయి.? అలా సాధించి ఉంటే చైనా మాదిరిగానే భారతదేశం కూడా అగ్రదేశాలతో పోటీ పడేది... " అని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కె.తారక రామారావు వ్యాఖ్యానించారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీఎంఎస్‌ఈఐ, ఎంఎస్‌ఎంఈ లబ్దిదారులకు చెక్కులను, వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ కుల, మతాలు దేవుని సృష్టించినవి కాదనీ, అవి మనిషి కల్పించుకున్నవేనని తెలిపారు. నీళ్లు, విద్యుత్ పై చర్చించకుండా నా దేవుడు గొప్పా? నీ దేవుడు గొప్పా? అనే చర్చల వల్ల ప్రయోజనం లేదని చెప్పారు. సమాజం తనకు తాను ఎన్నిరకాలుగా విభజించుకున్నా... కరోనా ఉపద్రవం విశ్వ మానవాళి అంతా ఒక్కటేనని గుర్తుచేసిందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారతదేశం అవతరించినా, ఇప్పటికీ ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఒక ఆవిష్కరణ అందించలేకపోవడానికి పాలకుల వైఫల్యమే కారణమని విమర్శించారు.

కులాన్ని పెట్టుబడితో కొట్టాలి

కులాన్ని పెట్టుబడితో కొట్టాలని డిక్కీ జాతీయ అధ్యక్షులు చెప్పిన మాటలను తనను బాగా ఆకర్షించాయని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కుల నిర్మూలన జరిగి అంతరాలు లేని సమాజం రావాలని అంబేద్కర్ ఆశించారనీ, ఆయన ఆశయ సాధన కోసం ముందుగా యువత ఆత్మన్యూనత నుంచి బయటపడాలని సూచించారు. రిస్క్ తీసుకోవద్దు, అప్పు చేయొద్దు. ప్రభుత్వ ఉద్యోగమైతేనే జీవితానికి భద్రత... వంటి చెడగొట్టు సామెతల నుంచి బయటపడాలని సూచించారు. అందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకోసం ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు. పడిపోతే తిరిగి లేవాలనీ, ఓటమిని కూడా ఉత్సవంగా జరుపుకునేంత ధైర్యంగా నిలబడాలన్నారు. గిరిజన యువత కూడా ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హామీలకే పరిమితం ...సత్యవతి రాథోడ్

తండాలను గ్రామపంచాయతీలు చేస్తామంటూ దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చి మోసం చేసిందని గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. కానీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని అమలు చేసి చూపించిందని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, వాటికి రోడ్లతో అనుసంధానం, గిరిజన సంక్షేమ హాస్టళ్ల భవనాల నిర్మాణం, రెసిడెన్షియల్ విధానంలో డిగ్రీ కళాశాలలు, పెండ్లికి కళ్యాణలక్ష్మి, ఆరోగ్యంగా ఉండేందుకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ తదితర పథకాలతో సీఎం కేసీఆర్ గిరిజనులకు జీవిత కాలానికి సరిపడినన్ని ఇచ్చారని కొనియాడారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ రావు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ట్రైకార్ చైర్మెన్ రామచంద్రు నాయక్, జీఎం శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికొకటి కాదు.. ఊరుకో ఉద్యోగమైనా ఇచ్చారా?

(మొదటిపేజి తరువాయి)

మూడు కి.మీ మేర పాదయాత్ర చేస్తూ వైరారోడ్డు, జడ్పీ సెంటర్ మీదుగా పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఆలోచన ఖమ్మం జిల్లాలోనే పుట్టిందన్నారు. రాష్ట్రం వచ్చి తొమ్మిదేండ్లయినా ఉద్యోగాలు రాలేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వలేదన్నారు. ఉద్యమకారులపై కేసులు తొలగించలేదని, అమరవీరుల కుటుంబాలను రాష్ట్రప్రభుత్వం ఆదుకోలేదని తెలిపారు. తెలంగాణ తొలి శాసనసభలో 1.07 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని సీఎం కేసీఆర్ ప్రకటించారని, తొమ్మిదేండ్ల తర్వాత నేడు బిశ్వాస్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని తేలిందన్నారు. దీన్నిబట్టి ఉన్న ఉద్యోగాలు పోయాయి తప్ప కొత్త నియామకాలు జరగేలేదని అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పోరాటాలతో దిగివచ్చిన కేసీఆర్.. 80వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తున్నామని ప్రకటించారని, దాంతో ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు ఆశపడ్డారని తెలిపారు. కానీ ఎంతకూ నోటిఫికేషన్ రాక ఖమ్మం జిల్లాలోనే ముత్యాల సాగర్ అనే పీజీ యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువకులు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో నమోదు చేసుకుంటే.. ప్రశ్నాపత్రాలు అమ్ముకుని, దొంగిలించినోన్ని పట్టుకోకుండా.. దాన్ని వెలికి తీసిన తనపై కేసులు పెట్టిస్తావా అని నిలదీశారు. తెలంగాణ నిరుద్యోగుల తరపున పోరాడేందుకు ప్రియాంక గాంధీ మే మొదటివారంలో సరూర్‌నగర్‌లో నిరసనకు హాజరవుతారని తెలిపారు. 2014, 2018లో ఒక్కో స్థానం బీఆర్‌ఎస్ గెలుచుకున్నా...ఈసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది స్థానాలు చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం పోరాటాలకు మారుపేరన్నారు. టీఎస్‌పీఎస్సీలో అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చి పేపర్‌లీకేజీకి ప్రభుత్వం కారణమైందన్నారు. జిల్లాల వారీగా నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలో అనేక ఖాళీలున్నా భర్తీ చేయడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం పోటీ చేసే అవకాశం కల్పించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. మాటపైన జీఎస్టీ లేదు కాబట్టి ఏదైనా మాట్లాడొచ్చనే రీతిలో కేసీఆర్, కేటీఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ.. తాను బీసీనంటూ బీసీలపై మోడీ కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారన్నారు. అంత ప్రేముంటే క్రీమిలేయర్ ఎందుకు ఎత్తివేయడం లేదని ప్రశ్నించారు. అమిత్‌షా తాము అధికారంలోకి వస్తే తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్ ఎత్తివేస్తామనడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ర్యాలీలో భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, సంభాని చంద్రశేఖర్, మాజీ కేంద్రమంత్రి బలరాంనాయక్, మాజీ ఎంపీ మల్లు రవి, గడ్డం ప్రసాద్, శివసేనారెడ్డి, బల్మూరు వెంకట్, అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, జావీద్, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, కొప్పెర ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్తలకు రక్షణ ఏది?

(మొదటిపేజి తరువాయి)

నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఈ సవరణ ఐటీ శాఖకు అధికారం కట్టబెట్టింది. అనుకరణ, వ్యంగ్య వార్తలను అడ్డుకోవాలన్న ఉద్దేశం తనకు లేదని కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌ను జస్టిస్ పటేల్ ప్రస్తావిస్తూ 'మీ నిబంధనలు అలా చెప్పడం లేదే' అని ప్రశ్నించారు. ఆ వార్తలకు ఎలాంటి రక్షణ ఇవ్వడం లేదని, ఆ విషయాన్ని తాము పరిశీలిస్తామని చెప్పారు. నిబంధన అవసరమైన రక్షణ చర్యలు లేవని తెలిపారు. కమ్రా పిటిషన్ రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినదని చెప్పారు.

ఎల్‌బీనగర్ పోలీసుల మానవత్వం

నవతెలంగాణ-హయత్ నగర్



కొందరు ఎంత డబ్బు ఉన్నా.. ఇంకా తన కుటుంబ సభ్యుల కోసం సంపాదించాలని చూస్తారు. ఇంకొందరు తన సంపాదనలో కొంత సమాజానికి ఖర్చు పెడతారు. ఈ కోవకు చెందిన వారే ఎల్‌బీ నగర్ పోలీసులు. సోమవారం ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జీఎంఆర్ స్వీపర్ మెహబూబ్ బీ కుమార్తె పెళ్లికి ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డితో పాటు ఎస్ఐలు, సిబ్బంది కలిపి రూ.69,600 ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా సామ సుందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సంతోష్ నగర్



బీఆర్ఎస్ యాకూత్ పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమా నుల ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలేబొక్కే అందజేస్తూ జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేసిన కేకును ఆయనతో కట్ చేయించి తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, హెూం మంత్రి మహమ్మద్ అలీ పరిపాలన దక్షత పథకాల అమలు తీరు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని, ప్రస్తుతం తరుణంలో కేసిఆర్ లాంటి నాయకత్వం దేశవ్యాప్తంగా ఎంతైనా అవసరమన్నారు.

దోమల బాబోయ్ దోమలు..

- నాగోల్‌లో తీవ్ర దోమల బెడద
- కాపాడాలని వేడుకుంటున్న డివిజన్ ప్రజలు

నవతెలంగాణ-నాగోల్



హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్‌లో సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే దోమలు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దాంతో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నాగోల్ డివిజన్‌లోని మూసీ నదీ పరిసర ప్రాంత కాలనీలవాసులు వాపోతున్నారు. మూసీ నదికి పరిసరాలలో న్యూ నాగోల్, మమతా నగర్, బీకే రెడ్డి నగర్, నాగోల్ గ్రామం ,వెంకటరెడ్డి నగర్, రాజ్యలక్ష్మి నగర్‌లతో పాటు పలు కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీల్లో సాయంకాలం కాగానే తేనెటీగలను మరిపించేలా గుంపులు, గుంపులుగా దోమలు సంచరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆయా కాలనీలో ప్రజలు పేర్కొంటున్నారు. ఒకవైపు మూసి, మరోవైపు నాగోలు చెరువు ,ఉండడంతో వాటికి తోడు కాలనీలోని కొంతమంది ఇండ్లలోని చెత్త, మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఎక్కడపడితే అక్కడే రోడ్లపై వేయడంతో విపరీతమైన దోమలు పుట్టుకొస్తున్నాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దోమల నివారణకు పలు చర్యలలో భాగంగా మందులను పిచికారి చేసినా లాభం లేకపోయిందని, దీంతో చీమల పుట్టల్లా పుట్టుకొస్తున్న దోమల వల్ల తాము పలు రోగాల బారిన పడే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందంటే ఇక రాత్రంతా జాగరణనే అని, ఒకవైపు ఊడకపోత, మరోవైపు దోమల బెడద ను తట్టుకోలేక పోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు దోమలపై ప్రత్యేక దృష్టిని సారించి దోమల బెడద ను నివారించి తమ ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

రియాల్టర్ హత్యకు కుట్ర

- కిరాయి హంతకులతో కలిసి పన్నాగం
- రిటైర్డ్ సీఐతోపాటు మరో ఇద్దరి అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతకక్షలు మనస్సులో పెట్టుకుని ఓ రియాల్టర్‌ను హత్యచేసేందుకు కిరాయి హంతకులతో కలిసి కుట్రచేసిన రిటైర్డ్ సీతోపాటు మరో ఇద్దరిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కంట్రీమేడ్ పిస్టోల్, మారుణాయుధాలతోపాటు రూ.1లక్ష నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని సీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీలు జోయేల్ డేవీస్, రాధాకిషన్ రావులతో కలిసి సీపీ సీవీ ఆనంద్ వివరాలను వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన దాసరి భూమయ్య పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. ఆర్ఎస్ఐగా 1992లో భూమయ్య పోలీస్‌శాఖలో చేరాడు. 1996లో సివిల్ ఎస్ఐగా కన్వర్ట్ అయ్యాడు. కరీంనగర్ జిల్లాలోని దాదాపు 12 పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా పనిచేశాడు. 2012లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందాడు. ఆదిలాబాద్, హుస్నాబాద్, మంథిని తదితర ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌లో సీఐడీ విభాగంలో పనిచేశాడు. ఇతనికి ఏ.విజయ్‌పాల్ రెడ్డి అనే రియాల్టర్ పరిచయమయ్యాడు. ఇద్దరి కలిసి గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ తదితర ప్రాంతాలల్లో భూములు కొనడం, విక్రయించడంతోపాటు సెటిల్‌మెంట్లు చేసేవారు. అయితే వారిమధ్య ఆర్థికపరమైపన తేడాలు రావడంతో భూమయ్య కక్ష పెంచుకున్నాడు. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ ట్రాఫిక్ విభాగంలో పనిచేసిన సమయంలో 2018లో భూమయ్యపై ఏసీబీ రైడ్‌చేయడంతో జైలుకెళ్లాడు. అయితే తనను ఏసీబీకి రియాల్టర్ ఏ.విజయ్ పాల్ రెడ్డి పట్టించాడని అనుమానించాడు. జైలు నుంచి తిరిగొచ్చిన భూమయ్య పెద్దపల్లికి చెందిన తన స్నేహితుడు వ్యాపారి ఎం.చంద్రయ్యను కలిశాడు. విజయ్‌పాల్ రెడ్డిని ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలని చంద్రయ్యకు చెప్పాడు. హత్యచేయాలంటే రూ.40 నుంచి 50లక్షలు ఖర్చవుతుందని చంద్రయ్య చెప్పాడు. చివరకు ఇద్దరి మధ్య రూ.20లక్షలకు ఒప్పందం కుదిరింది. అడ్వాన్స్‌గా రూ. ఐదు లక్షలు తీసుకున్న చంద్రయ్య ఖాజీపేట్, మంచిర్యాల్‌కు చెందిన కిరాయి హంతకులు (పాత నేరస్తులు) గొర్రె రాయిగొల్ల అలియాజ్ శంకర్, గడ్డం కుమార్‌ను సంప్రదించాడు. నిందితులు బీహార్ నుంచి కంట్రీమేడ్ పిస్టోల్, బులెట్స్‌ను కొనుగోలు చేశారు. విజయపాల్‌రెడ్డిని కదలికలను గమనిస్తూ వస్తున్నారు. అయితే అనుమానం కలిగిన విజయపాల్‌రెడ్డి టాస్క్‌ఫోర్సు పోలీసులకు సమాచారం అందించాడు. నిందితులపై ప్రత్యేక నిఘావేసిన పోలీసులు సికింద్రాబాద్‌లో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ టీ.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐలు బీ.అశోక్‌రెడ్డి, కే.శ్రీకాంత్, ఎం.అనంతచారి, బీ.అరవింద్‌గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి వినతి



నవతెలంగాణ -ఎల్బీనగర్

సరూర్‌నగర్ డివిజన్‌లో పారిశుధ్యంతో పాటు కాలనీలోని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని బాపు నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొనగా.. కాలనీలో పలు సమస్యలను ప్రజలు వివరించారు. అనంతరం వాటిని వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాలనీలో డ్రయినేజీ గుంతలతో పాటు పది రోజులకి ఒకసారి డ్రయినేజీ పొంగి పొర్లడంతో కాలనీ వాసులు బాగా ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం కొన్ని చోట్ల కొత్త లైన్లు వేయడంతో పాటు మరికొన్ని చోట్ల ఉన్న లైన్‌ను బాగు చేయాలని, ఇంటర్నల్ రోడ్స్ రిపేర్ చేయాలని కోరారు. అలాగే బస్తీలో త్రీ ఫేస్ కరెంట్‌తో పాటు రోడ్ నెం 2,5లో కరెంట్ పోల్స్ కావాలన్నారు. రోడ్ నెం. 4లో కొత్త సీసీ రోడ్ వేయించాలని విన్నవించారు. చెట్ల కొమ్మలతో కాలనీలో కరెంట్ సమస్యలు వస్తున్నాయని, వాటిని కట్ చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోయిని మహేందర్ యాదవ్, మహేశ్వరం నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, విద్యార్థి నాయకులు పుట్టం విజయ్, నియోజక వర్గ వీసీ సెల్ ప్రధానకార్యదర్శి గౌని శ్రీనివాస్ గౌడ్, కిల్లా మైసమ్మ టెంపుల్ మెంబర్ రాగం సునీల్ యాదవ్, ప్రత్యుష్, గుండె నాగరాజ్, వినయ్ చారి, సాజిద్, జీహెచ్ఎంసీ అధికారులు పూజ, శివ, సురేష్, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ఇంట్రాక్షన్ ప్రోగ్రామ్‌లో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉప్పల్



నియోజకవర్గంలోని పలు డివిజన్‌ల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం డివిజన్‌లోని భరత్‌నగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ ఇంట్రాక్షన్ ప్రోగ్రామ్‌లో స్థానిక కార్పొరేటర్ మందముల రజితా రెడ్డి, ఉప కమిషనర్ అరుణకుమారితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని కాలనీలో పర్యటించారు. ప్రజలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రయినేజీ సమస్యలతో పాటు రోడ్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, అన్య వెంకటేష్, నోముల మైసయ్య, పొంగ మహేందర్ రెడ్డి, సల్ల సందీప్ రెడ్డి, మల్లేష్, స్థానిక కాలనీవాసులు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక మంత్రిపై వ్యక్తిగత ఆరోపణలు

- అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధం
- బీజేపీ నాయకులకు బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కార్తిక్ రెడ్డి సవాల్



నవతెలంగాణ - మీర్ పేట్

మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే బీజేపీ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పి. కార్తీక్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి 24 గంటలూ ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల స్థాయిలో మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఒక మహేశ్వరం నియోజకవర్గంలోనే రైతు బీమా, రైతుబంధు, దళిత బంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గొర్రెల పంపిణీ, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్ల ద్వారా రూ.80 కోట్లు నేరుగా 90వేల మంది లబ్దిదారులకు అందాయని తెలిపారు. 'మన ఊరు - మన బడి' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన కోసం రూ.80 కోట్లతో పాటు సీఎస్ఆర్ ఫండ్ కింద రూ 10 కోట్లు, హెచ్ఎండీఏ నుంచి మున్సిపాలిటీలకు నిధులు, మండలాల్లో అభివృద్ధికై ఆర్ఎన్బీ నుంచి రూ 432 కోట్ల ప్రత్యేక నిధులు తేవడం జరిగిందన్నారు. నూతన భవన నిర్మాణాల కోసం రూ. 165 కోట్లు, ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణానికి రూ.92 కోట్లను మంత్రి మంజూరు చేయించారని తెలిపారు. అబద్దాల పునాదులపై సగం రియల్ ఎస్టేట్, సగం రాజకీయం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. సమస్యలపై అవగాహనతో కొట్లాడితే ప్రజల్లో గుర్తింపు వస్తుందని, అభివృద్ధి చేస్తున్న వారిపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని హితవుపలికారు. రియల్ ఎస్టేట్ చేసేవారికి ప్రజా సమస్యలపై ఏం అవగాహన ఉంటుందని ఎద్దేమో చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఏం అభివృద్ధి జరిగిందనే దానిపై జీవోలతో సహా నిధుల మంజూరు పత్రాలను ఈ మీడియా సమావేశంలో బహిరంగంగా ఇస్తున్నామని, ఇంకా అభ్యంతరాలు ఉంటే బహిరంగ చర్చకు సిద్ధమని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. సమావేశంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు ముద్దా పవన్ కుమార్, బడంగ్‌పేట్ అధ్యక్షులు రామిడి రామ్‌రెడ్డి, మీర్‌పేట్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, జలపల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా జెండా పండుగ

- మినీ ప్లినరీని జయప్రదం చేయండి
- బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్



మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మినీ ప్లినరీ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవాలని బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ నగర అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం పురుడు పోసుకున్న టీఆర్ఎస్ నేడు దేశ ప్రజల కష్టాలు తీర్చడానికి బీఆర్ఎస్‌గా అవతరించిందని తెలిపారు. అందులో భాగంగానే మేడ్చల్ జిల్లా తూంకుంట దేవారయంజల్‌లో జరిగే మినీ ప్లినరీ సందర్భంగా 28 డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, పార్టీ నేతలతో కలిసి భారీ ర్యాలీగా ప్లినరీ వేదిక వద్దకు చేరుకుంటామని తెలిపారు.

బీజేపీతో దేశానికి పెను ప్రమాదం

- చట్టసభల్లోకి కమ్యూనిస్టులు ప్రవేశించేందుకు కృషి
- పొత్తుల రూపంలో త్యాగాలకు సిద్ధంగా లేం
- ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-బోడుప్పల్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో దేశానికి పెనుప్రమాదం పొంచి ఉందని, అందుకే బీజేపీని తరమికొట్టి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు దేశవ్యాప్తంగా సీపీఐ చేపట్టిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన పాదయాత్రలో సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. మోడీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేస్తూ ప్రజల సంపదను, దేశ సంపదను కొల్లగొడుతూ అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని అన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ ప్రజల మధ్య చీలికలు తెచ్చేలా కుట్రలు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చకుండా కేంద్ర హోం మంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నుంచి ప్రాజెక్టులు ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టకుండా తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం రిజర్వేషన్లు మతం ఆధారంగా కాకుండా వారి సామాజిక పరిస్థితుల అధారంగా అప్పటి రాజశేఖరరెడ్డి సర్కారు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దమ్ముంటే బీసీ జన గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్టీల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, చిత్తశుద్ధి ఉంటే ఎస్టీ రిజర్వేషన్లు పెంచుతూ చట్టం తేవాలని డిమాండ్ చేశారు.

బీజేపీని ఎదుర్కోవడమే ప్రధాన ఏజెండా

దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీని గద్దె దించడానికి లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేస్తామని కూనంనేని స్పష్టం చేశారు. ప్రమాదకరమైన బీజేపీని ఎదుర్కోవడం తమ ప్రధాన కర్తవ్యం అని, అదే సందర్భంలో పొత్తుల రూపంలో త్యాగాలు చేయడానికి సిద్ధంగా లేమన్నారు. కమ్యూనిస్టులుగా చట్ట సభల్లోకి ప్రవేశించడానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. ఇప్పుడే రాజకీయ పొత్తుల గురించి ఆలోచించడం లేదని, భవిష్యత్తులో పరస్పర సహకారం అందించే పార్టీలతో కలిసి వెళ్లే విషయాల గురించి మాట్లాడుతామని అన్నారు. మేడిపల్లి సీపీఐ మండల కార్యదర్శి ఆర్.కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పద్మ, బాలమల్లేష్, జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సీపీఐ సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీమాన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే లక్ష్యం'



నవతెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ శుభోదయ కాలనీని ఆదర్శం గా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లక్ష్యమని డివిజన్ పార్టీ అధ్యక్షులు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో రూ.8.80 లక్షలతో కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను బస్తీ వాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, మాజీ వార్డ్ మెంబర్ శివ గౌడ్, చంపాపేట్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు నరేష్, ఎస్సీ సెల్ సెక్రటరీ రాజు, నాయకులు గోగు శేఖర్ రెడ్డి, బీరమ్మ, సుజాత వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

నవతెలంగాణ-ఉప్పల్



ఉప్పల్ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందముళ్ళ రజితా రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్లాలని, కాలనీలోని సీసీ రోడ్లు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కోసం అధికారులు విస్తృతంగా పర్యటించాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి అరుణకుమారి, ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ నాగమణి, ఏఈ వసంత, శానిటేషన్ అధికారి చందన, సుదర్శన్, హార్టికల్చర్ సర్కిల్ మేనేజర్ మేధా, నర్సింగ్ రావు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన కొనసాగుతోంది

- టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ - ఘట్‌కేసర్

రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన కొనసాగుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఘట్‌కేసర్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అంకుశాపూర్, అవుషాపూర్ గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను కలుస్తూ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి కోరల్లో చిక్కుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకపాలనతో ప్రజలు విసుగుచెందారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, మేడ్చల్ నియోజకవర్గం హాత్ సే హాత్ జోడో యాత్ర ఇన్‌చార్జి చారుకొండ వెంకటేష్, మేడ్చల్ బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్, అధికార ప్రతినిధి కవాడి మాధవరెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ తోటకూర అజయ్ యాదవ్, అవుషాపూర్ గ్రామశాఖ అధ్యక్షులు మేడబోయిన జంగయ్య ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీటీసీ పులకంటి భాస్కర్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిళ్ల ముత్యాల్లవ్, పన్నాల ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉల్లాసం

- బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి పాన్నాల కృష్ణారెడ్డి

నవతెలంగాణ - హయత్‌నగర్



క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కలుగుతుందని, అందు కే యువత క్రీడలపై దృష్టి పెట్టాలని మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడి యా ఇన్‌చార్జి పాన్నాల కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మహేశ్వరం నియోజ కవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో వారం రోజులుగా జరుగుతున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో నాదర్‌గుల్ కింగ్స్ లెవెన్ (వల్లపు సుభాన్ యాదవ్ టీం) విజేతగా నిలవగా, రన్నర్స్‌గా నాదర్‌గుల్ సూపర్ కింగ్స్(వైపీఆర్) టీం నిలిచింది. విన్నర్ టీమ్‌కు కృష్ణారెడ్డి చేతుల మీదుగా రూ. 55,555, రన్నర్స్‌కు ఎల్బల జీవన్‌రెడ్డి చేతులగా రూ.33,333 ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించటానికి మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు, ఆర్గనైజర్ టీం, 8 టీంల ఫ్రాంచైజర్స్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్ రెడ్డికి ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పాలి'



నవతెలంగాణ - హస్తినాపురం

టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ చేసిన నిరాధారమైన, అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనుక్కు తీసుకొని కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, ఇలా మాట్లాడితే బీజేపీ నాయకులు ప్రజల్లో కూడా తిరగలేరని హెచ్చరించారు. బీజేపీ కుల, మత రాజకీయాలు చేస్తూ దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్నదన్నారు. మునుగోడు ఉపఎన్నికలో ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి కాంగ్రెస్ కార్యకర్తలు చందాల రూపంలో ఇచ్చిందేనని, కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ, ఆర్థిక సాయాన్ని అవమానించేలా రాజకీయాల కోసం ఈటల దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ సమీకరణాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని తెలిపారు.

పేదలకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

- ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్‌కు బస్తీ వాసుల వినతి

నవతెలంగాణ-హయత్ నగర్



ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్‌లోని ఎరుకల నాంచారమ్మ బస్తీలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మొత్తం 288 ఇండ్లు ఉండగా ప్రస్తుతం 200మందికి మాత్రమే కేటాయించారని, మిగిలిన వాటిని అక్కడే ఉన్న పేద ప్రజలకు మాత్రమే కేటాయించాలని సోమవారం రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ తిరుపతి రావు, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కొనేండ్లుగా అక్కడే నివాసం ఉన్న తాము సర్వే సమయంలో ఇంట్లో లేమనే సాకుతో తమకు ఇవ్వమంటున్నారని, ఆసమయంలో కూలి పనులకు వెళ్లామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేదలను గుర్తించి మిగిలిన ఇండ్లను తమకే కేటాయించాలని, లేని యెడల మరొకరికి ఇవ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. వారిని కలిసిన వారిలో జగన్నాథం, గంగన్న, వనం గంగన్న, యేసు, స్వామి తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఎస్.కె మాజీద్

నవతెలంగాణ-సంతోష్ నగర్



అంతర్జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయం సంస్థ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఎస్.కె మాజీద్ ఎన్నికయ్యారు. యాకత్ పురా నియోజకవర్గం మొగల్ పురా డివిజన్ పరిధిలోని అంతర్జాతీయ ఫౌండర్ అధ్యక్షులు నిరాజ్ సింగ్ ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ బషారత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐహెచ్‌హెచ్ఆర్ఎస్‌ఓ జైపూర్‌లో జరిగిన చర్చను ప్రస్తావిస్తూ సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాజీద్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు, యూత్ వింగ్ నేషనల్ అధ్యక్షులు బ్రజేశ్ పతక్, నేషనల్ జనరల్ సెక్రెటరీ సుశీల్ కుమవత్, డైరెక్టర్ రూపేష్ జారీ, హెడ్ హెచ్ఆర్ జాగృతి దుబే, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర సంఘం ప్రతినిధుల వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

'అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగింది'

నవతెలంగాణ- చైతన్యపురి



హైదరాబాద్ కనెక్ట్ సుప్రీం క్లబ్‌కు మైల్ స్టోన్ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందని లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కనెక్ట్ సుప్రీం అధ్యక్షుడు మంచుకొండ సురేందర్ గుప్తా అన్నారు. సోమవారం సిటాడెల్ హెూటల్‌లో జరిగిన లైన్స్ మల్టీపుల్ డిస్ట్రిక్ట్ 320 ఏ సమావేశంలో హైదరాబాద్ కనెక్ట్ సుప్రీం క్లబ్‌కు వచ్చిన మైల్ స్టోన్ అవార్డును లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లైన్స్ ఏరియా ఆఫీసర్ లైన్ సునీల్ కుమార్, లైన్ విద్యాసాగర్ రెడ్డి, లైన్ దీపక్ భట్టాచార్య లైన్ జూలూరి రఘు చేతుల మీదుగా అధ్యక్షులు మంచుకొండ సురేందర్ గుప్త అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కనెక్ట్ సుప్రీం క్లబ్ తరఫున ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి పేదవారికి సహాయం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక సదుపాయాల కోసం కూడా ఎంతో కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ గుర్తించి అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సెక్రటరీ నల్లపాటి బసంత్, ట్రెజరర్ పద్మ రాము, ఓరుగంటి సుధాకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సాక్షిగా అక్రమ నిర్మాణాలు..!



నవతెలంగాణ-హయత్ నగర్

అంబేద్కర్ సాక్షిగా సర్కారు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఇవన్నీ రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పాండు నాయక్ తెలిపారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 60/1లో ఉన్న భూమిని కొందరు పక్కా సర్వే నెంబర్ వేసి నిర్మాణాలు చేస్తున్నారని, ఫిర్యాదు చేస్తే వచ్చిన అధికారులు.. అక్కడ వెలిసిన హద్దు రాళ్లను కొన్నింటిని మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారన్నారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అక్కడ అంబేద్కర్ భవనం నిర్మాణం చేపట్టాలని పలు మార్లు కలెక్టర్‌కు, ఆర్‌డీఓకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల సర్వే అధికారులు వచ్చి ఈ భూమిని సర్వే చేసి వెళ్లారని, రిపోర్ట్ రాగానే భూమికి ఫెన్సింగ్ వేయాలని కలెక్టర్‌ను కోరారు.

దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించిన భరత్ గురూజీ

నవ తెలంగాణ - వనస్థలిపురం



సత్య శ్రీ గురు పిఠాధిశులు సత్య శ్రీ డాక్టర్ భరత్ గురూజీ సోమవారం జగత్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో ఉన్న మదన దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. మదరదుర్గమ్మ ఆలయ ధర్మకర్తలు ఆయన్ని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం మదన దుర్గమ్మ ఫామ్ ల్యాండ్ ఎల్బీసీ రియల్ ఎస్టేట్ ఆగ్రో ఫామ్‌ను సందర్శించారు. ఆయన వెంట నారాయణ, వంశీకృష్ణ, మాధవి ఉన్నారు.

ఆలయంలో పవర్ బోర్‌ను ప్రారంభించిన గజ్జల నాగేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పికెట్ బాలంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ ఛైర్మెన్ గజ్జల నాగేష్ పవర్ బోర్‌ను ప్రారంభించారు. ఆలయంలో నీటి ఎద్దడి ఉండడంతో కమిటీ సభ్యులకోరిక మేరకు గజ్జెల నాగేష్ సొంత నిధులతో కొన్ని రోజుల క్రితం పవర్ బోర్ వేశారు. సోమవారం ఉదయం దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం గజ్జల నాగేష్ పూజలు నిర్వహించి పవర్ బోర్వెల్ ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యురాలు కిరణ్, శ్రీధర్, గంగారామ్, దేవాలయ కమిటీ సభ్యులు కష్ణ, మచేందర్, బీఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, శ్రీనివాస్, నరేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు

పూడిక తీత పనుల పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని వీఎన్ రెడ్డి నగర్ కాలనీలో వారు చేస్తున్న నాల పూడిక తీత పనులనుకార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించిన. త్వరలో వీఎన్ రెడ్డి నగర్ నుంచి మారుతి నగర్ కాలనీ వరకు హిటాచితో నాల పూడిక తీత పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌తో పాటు బీఆర్ఎస్ స్థానిక ఇన్‌చార్జ్ నాగిళ్ళ బాలరెడ్డి, కనకరాజ్ గౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, రాజ్యలక్ష్మి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు .సోమవారం కీసర మండలం చీర్యాల, తిమ్మాయిపల్లి గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ 50 లక్షలతో ఆధునికరించిన (నూతన ఫర్నిచర్, బాత్ రూమ్లు, కిచెన్ షెడ్,) మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలను (రెండు గ్రామాల్లో) మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం సీఎం కేసీఆర్ రూ.7300 కోట్లతో అభివద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకుని గొప్ప వ్యక్తులుగా ఎదగలన్నారు.అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేసిస్కూల్, క్లాస్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమలలో ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీ నారాయణ, వైస్ ఛైర్మెన్ జె.సత్తిరెడ్డి, చీర్యాల సర్పంచ్ తుంగ ధర్మేందర్ ,ఉప సర్పంచ్ జి.తిరుమల్ రెడ్డి, తిమ్మయి పల్లి సర్పంచ్ పెంటయ్య ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలక్రిష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జలాల్ పురం సుధాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజం మార్పు చెందుతుంది

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

నేటి విద్యార్థులను రేపటి భావి భారత నిర్మాతలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రాథమిక పాఠశాలల పైనే ఉంటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ బ్లాక్ 1 లక్ష్మీ నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.22.54 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తరగతి గదులను సోమవాం ం ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోని పాలనలో కొనసాగామని.. నేడు సీఎం కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. విద్య ద్వారానే సమాజం మార్పు చెందుతుందని నమ్మకాన్ని ప్రజల్లో బలంగా తీసుకువెళు న్నారన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం బాలికలకు ప్రత్యేక టాయిలెట్స్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్డు, అన్ని తరగతి గదులలో ఎలక్ట్రికల్ ఫ్యాన్స్, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాలలో పెయింటింగ్, కాంపౌండ్ వాల్, విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, ఉపాధ్యాయులకు కావలసిన ఫర్నిచర్ ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్ కోసం ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటుచేసి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పాఠశాల హెడ్ స్టర్ నెల్సన్, లక్ష్మీ నగర్ పాఠశాల హెడ్ స్టర్ అంజిరెడ్డి, ఈఈ గోపాల్ రావు, ఏఈ చంద్రశేఖర్, స్థానిక నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, వాసుదేవ్ గౌడ్, దుర్గయ్య, రాము, భూసాని రఘు, జగన్, ప్రవీణ్, శ్రీకాంత్, ధీరజ్, అల్లాడి కష్ణ యాదవ్, మధన, అనురాధ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాచారం వార్డు కార్యాలయ నిర్మాణానికి నిధులు కేటాయించండి

- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ వార్డు కార్యాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ పంకజను కలిసి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. నాచారం గ్రామపంచాయతీ నాటి కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేండ్ల క్రితం భారీ వర్షాలకు కూల్చారు. కూల్చిన కార్యాలయ స్థానంలో నూతనంగా వార్డు కార్యాలయం నిర్మించడానికి జీహెచ్ఎంసీ నిధులు కేటాయించాలని కోరారు. కార్తికేయ నగర్ స్ట్రీట్ నెంబర్ 9లో చిన్న వర్షానికి రోడ్లపై నీళ్లు నిలిచి సమస్యాత్మకంగా మారుతుంది. నూతన డ్రయినేజీ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ లోని ఐజికే కాలనీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ బొంతు రామ్ మోహన్ , కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ విచ్చేసి ఐజికే కాలనీ నూతన అధ్యక్షుడు ముత్యాలు, నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బొంతు రామ్ మోహన్ మాట్లాడుతూ కాలనీలల్లో కార్యవర్గం ప్రధాన పాత్ర పోషించి కాలనీ అభివద్ధి కోసము పాటుపడాలని సూచించారు.కాలనీ కోసం ఏ అవసరం ఉన్న మీకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. కాలనీ నూతన అధ్యక్షుడు ముత్యాలు మాట్లాడుతూ తన విజయానికి వెన్నెముకగా నిలిచిన బొంతు శ్రీదేవి యాదవ్, ప్రభు గౌడ్, గోపి చెన్నంలకు కతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐజికే కాలనీ అధ్యక్షులుగా ముత్యాలు , వైస్ ప్రెసిడెంట్ గా ఎస్.కె నజీర్. వై సత్యమ్మ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనుముల వెంకట్ రెడ్డి, తన్వీర్, కోశాధికారిగా సిహెచ్ శ్యామ్, కొండయ్య, నరసింహ, సాంబయ్య,చీఫ్ అడ్వైజర్ అనిల్ గౌడ్, నరసింహారెడ్డి, సెక్రెటరీ వి కష్ణ తో పాటు బీఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి, కనకరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో హెచ్ బీ కాలనీలో బిజెపి కో హఠావ్-దేశ్ కో బచావో ' నినాదంతో 'ఇంటింటికీ సీపీఐ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్. బోస్ తెలిపారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి బోస్ ముఖ్య నేతగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీ యజమా నులకుతొత్తుగా వ్యవహరించిందనిధ్వజమెత్తారు. ప్రభుత్వం నడుపుతున్న విమానయానం, ఓడరేవులు, రైల్వే, ఎల్ఐసి ,అంతరిక్ష పరిశోధన సంస్థలు,క్రీడా మైదానాలు, బొగ్గు గనులు, ఉక్కు పరిశ్రమలను ప్రయివేటు పరం చేసి కార్పొరేట్ కంపెనీ యజమానులకు అప్పగించే కుటిల నీచ పనులు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్ డీజిల్ ధరలు, నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలను పెంచింది మోడీ ప్రభుత్వం అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి పౌరుల హక్కులకు, లౌకిక తత్వానికి దేశ సమగ్రతకు సార్వభౌమ అధికారానికి తూట్లు పొడిచే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. అందుకే మోడీ హటావో ...దేశ్ కో బచావో అని సిపిఐ పార్టీ దేశవ్యాప్తంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని,ప్రజలందరూ ఆలోచించి అర్థం చేసుకొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి, ఉప్పల్ నియోజకవర్గ కన్వీనర్ జీ. దామోదర్ రెడ్డి,సీపీఐజిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, కె. ధర్మేంద్ర, సీపీఐ కాప్రా పట్టణ కార్య దర్శి జీ. లక్ష్మీ నారాయణ, సీపీఐ నియోజకవర్గ ముఖ్య నేతలు నర్సింహా, బొడ్డుపల్లి కష్ణ, రాజేందర్, బషీర్,జాన్, స్వామి దాస్, కుమార్, నర్సింగరావు, భిక్షపతి, ప్రసాద్, యాదయ్య, 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి

- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్,
- జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 94 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు,



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో పాటు సీపీఓ మోహన రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీ లన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామాంతపూర్‌లో 2023-24 విద్యాసంవత్సరానికి ఒకటవ తరగతి ప్రవేశం కోసం గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు హైదరాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.ఈ రామేశ్వరి దేవీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు హైదరాబాద్ జిల్లా వాస్తవ్యులై ఉండాలని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2017 జనవరి 01 నుంచి 2017 డిసెంబర్ 31వ తేదీలోగా జన్మించి ఉండాలని వివరించారు. దరఖాస్తు ఫారముతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మీ సేవా ద్వారా తహసీల్దార్ ధ్రువీకరించిన కుల, ఆదాయ, నివాసంతో పాటు జనన ధ్రువపత్రాలు జత చేయాలని ఆమె తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను హైదరాబాద్‌లోని బోయినపల్లిలో బాపూజీనగర్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పంపించాలని కోరారు.

ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి



- కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-నాచారం

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ బలోపేతానికి కషి చేస్తున్నట్టు కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన యాదాల మనోహర్ కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ యువ నాయకుడు నెమలి అనిల్‌తో కలిసి రాగిడి లక్ష్మారెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసి ఐక్యంగా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తే కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పదవులు పొందిన యువత పార్టీ బలోపేతానికి కషిచేసి అధిష్టానం ఆశీస్సులు పొందాలని కోరారు. ఇతర రాజకీయ పార్టీలు ఎన్ని ప్రలోభాలు పెట్టిన అదరక, బెదరక అహర్నిశలు పార్టీ కోసం పనిచేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు యువత పైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, అబ్దుల్ రషీద్ అశు, మహమ్మద్ రిజ్వాన్, సంతోష్, భాను గౌడ్,కాప్రా సాయి, బాలరాజు గౌడ్, సాయి సాధినేని, రాకేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటింటికి నల్లా నీళ్లు అందిస్తాం

- ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

పేదలు నివసిస్తున్న బస్తీలలో మంచినీటి సమస్యను తీర్చేందుకు మల్లాపూర్ డివిజన్‌లోని నెహ్రు నగర్ మూడవ బ్లాక్ లో మంచినీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు మంచినీటి సమస్య ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రతీ ఇంటికి మంచి నీరు అందిస్తామని చెప్పిన మాటను నెరవేరుస్తూ కాలనీలో బస్తీల్లో నూతన మంచినీటి పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు నీళ్లు అందిస్తున్నట్టు తెలిపారు. ఇక మల్లాపూర్ డివిజన్‌లోని నెహ్రు నగర్ మూడవ బ్లాకులో మంచినీటి సమస్య ఉండదని అన్నారు. ఇప్పటికే అన్ని కాలనీలో నూతన పైప్ లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇంటింటికి మంచినీళ్లు అందించే కార్యక్రమానికి బీఆర్ఎస్ కషి చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, సివరేజ్ బోర్డు డీజీఎం సతీష్, మేనేజర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ స్థానిక నాయకులు బోదాస్ లక్ష్మీనారాయణ, వాసుదేవ్ గౌడ్, చిన్న దుర్గయ్య బాసిత్ ఖాన్, రామాంజనేయులు, ప్రకాష్, యాదగిరి, మల్లేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులతో కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో పార్టీ జెండాల ఆవిష్కరణ, నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల సభకు సంబంధించిన విషయాలపై డివిజన్ బీఆర్ఎస్ నాయకులతో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పార్టీ జెండాల ఆవిష్కరణ, బైక్ ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

26 ఎస్ బస్సు వెంటనే పునరుద్ధరించాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

నిలిపివేసిన 26 నెంబర్ బస్సును పునరుద్ధరించాలని స్థానిక వాసులు కార్పొరేటర్ నరసింహ యాదవ్‌ను కోరారు. వివిధ కాలనీలలో ఉన్న సమస్యలు తెలుసుకు నేందుకు గాను కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సోమవారం పీవీఎన్ కాలనీలోని సీనియర్ సిటిజన్ హాల్లో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సమతా నగర్ లక్ష్మీనరసింహ, రాంరెడ్డి గోరీనగర్ పీవీఎన్ కాలనీ వెస్లీ టీచర్స్ కాలనీ అసోసి యేషన్ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ప్రధానంగా సమావేశంలో రద్దు చేయబడిన 26 నెంబరు బస్సును పునరుద్ధరించాలని కోరారు. అలాగే భూగర్భ డ్రయినేజీ, రోడ్డు, వీధి కుక్కల బెడదతో పాటు ఆకతాయిల వేధింపులు సమస్య కూడా ఉందని కార్పొరేటర్ దష్టికి తీసుకువెళ్లారు. పోలీసు పెట్రోలింగ్ విస్తతంగా జరపాలని నీటి సరఫరాను సమద్ధిగా చేయాలని విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు సవరించాలని వీధి దీపాలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఆయా కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తులు చేశారు. సమతా నగర్ కాలనీ తరఫున వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కార్యదర్శి గొట్టిపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు, సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రాధాకష్ణ, కోశాధికారి అబ్బరాజు రామకష్ణ, మహిళా ప్రతినిధులు సదాలక్ష్మీ ప్రమీల, యువజన ప్రతినిధి పెండం రాకేష్ సమక్షంలో కాలనీ సమస్యలపై ప్రత్యేకంగా ఒక వినతి పత్రం కార్పొరేటర్‌కు అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఈ సమస్యలకు సత్వరమే పరిష్కరిస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు.

పేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు సాయం అందిస్తాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ 5 లక్షలు ఆర్థిక సహాయం అందచేస్తామని ఆ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ హామీనిచ్చారు. సోమవారం వెంకటాపురం, కొత్తబస్తీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జో డో యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యన మాట్లాడుతూ... తెలంగాణ లో అధికారంలోకి వచ్చే ది కాంగ్రెస్ ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే గ్యాస్ సిలిండర్ రూ. 500లకే ఇస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందచేస్తామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి సీనియర్, నాయకుడు కష్ణ గౌడ్, అల్వాల్ డివిజన్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి, పవన్ శ్రీనివాస్, సాయికుమార్, శ్రీనివాస్, అంబ, రామానుజన్, మార్షల్, సంతోష్ రెడ్డి, వీనస్ మేరీ, పద్మ ,నిర్మల , ముత్తు లక్ష్మి వాణి , పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పత్రాల పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైదాబాద్ మండంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలడేరాలో సోమవారం విద్యార్థులకు ప్రగతి పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కో-ఆర్డినేటర్ రజిత, మండల డిప్యూటీ ఈవో నెహ్రూ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవుల్లో ఫోన్లకు, టీవీలకు మాత్రమే పరిమితం కాకుండా.. ప్రతిరోజు కథల పుస్తకాలు, బొమ్మలు, డ్రాయింగ్, పజిల్స్, న్యూస్ పేపర్ రీడింగ్ లాంటివి ప్రాక్టీస్ చేస్తూ ఉండాలని సూచించారు. బేసిక్ తెలుగు, మ్యాథ్స్, ఇంగ్లీష్ విషయాలూ డైలీ ఒక గంట చదవాలన్నారు. నెహ్రూ బాబు మాట్లాడుతూ పిల్లలు ఆటపాటలతో పాటు రోజూ ఒక గంట చదువుకోవాలన్నారు. కాలడేరా పాఠశాల అభివృద్ధిని గమనించి పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని, కొత్త పిల్లలు చేరాలని చెప్పారు. పాఠశాల హెడ్‌మాస్టరు ఎం.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు సెలవులను ఉపయోగించుకోవాలన్నారు. డైలీ కొద్దిసేపు ఏదో ఒకటి చదవడం, రాయడం చేయాలన్నారు. మన పాఠశాలలో ఉన్న సౌకర్యాలను ఇతర పిల్లలూ ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. బాల్ భవన్ సూపరిటెం డెంట్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాలడేరాలో ఈనెల 29 నుంచి వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య.



నవతెలంగాణ-జవహర్‌నగర్

బాటసారుల దాహార్తి తీర్చడంలో చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయని, ప్రజలు అత్యవసరమైతేనే బటయకు వెళ్లాలని ఎండల్లో తిరగొద్దని మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్ కుమార్ 25 డివిజన్ లోని ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మేయర్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మెడికల్ సిబ్బందిని ఇప్పటికే ఆదేశించామని తెలిపారు.ార్పొరేటర్లు జమాల్పూర్ నవీన్ కుమార్, జిట్టా శ్రీవాణిశ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణగూడ సీఐ రాపోలు శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్

- టాస్క్‌ఫోర్స్ రైడ్స్‌లో సీఐ వ్యవహారం తేటతెల్లం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నారాయణగూడ పోలీస్ స్టేషన్ సీఐ రాపోలు శ్రీనివాస్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో యథేచ్ఛగా నడుస్తున్న హుక్కా పార్లర్లు, స్పా సెంటర్లపై సీఐ రాపోలు శ్రీనివాస్ రెడ్డి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ మామూళ్లకు తెగబడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం టాస్క్ ఫోర్స్ రైడ్స్‌లో తేటతెల్లమైంది. సీఐ వ్యవహారంపై సీవీ ఆనంద్ ఫైర్ అయ్యారు. సీఐ శ్రీనివాస్ రెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి స్పెషల్ సమ్మర్ కోచింగ్ ప్రారంభం

- విక్టరీ ప్లే గ్రౌండ్‌లో లాంఛనంగా ప్రారంభించనున్న మేయర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను మంగళవారం ఖైరతాబాద్ జోన్‌లోని చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించనున్నారు. ఈ నెల 26న, 27 తేదీల్లో మిగితా జోన్లలో క్యాంప్‌లను ప్రారంభించనున్నారు. 28న సాయంత్రం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ పీజేఆర్ చందానగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం, 29న ఎల్బీనగర్ జోన్ ఉప్పల్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను ప్రారంభిస్తారు. 353 ప్లే గ్రౌండ్‌లలో 915 కోచింగ్ సెంటర్లు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 25న మంగళవారం నుంచి మే 31 వరకు 353 ప్లే గ్రౌండ్‌లలో 915 కోచింగ్ సెంటర్లను సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను 37 రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ సమ్మర్ క్యాంపులలో 44 రకాల క్రీడలలో శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణను ఆరేండ్ల నుంచి 16 ఏండ్లలోపు పిల్లలకు జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ ప్లే గ్రౌండ్‌లలో నిర్వహిస్తారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

- జిల్లావ్యాప్తంగా 79 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 17,170 మంది విద్యార్థులు
- గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 4వ తేదీన ముగియనున్నాయి. ఇందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 79 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 17,170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థులు 8,619 మంది ఉండగా, ఇంటర్ స్టూడెంట్స్ 8,551 మంది ఉన్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30గంటల వరకు మరో సెషన్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇక పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం తలెత్తకుండా ఫర్నీచర్, తాగునీరు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి, జిల్లా సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్టు వారు పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 79 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 8 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేశారు. 79 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 79 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 30 మంది కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లతో పాటు ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరవకుండా చర్యలు చేపట్టారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా, తాగునీరు, వసతి, అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం
ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్

ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను ఉదయం 8.00 గంటల నుంచే అనుమతిస్తాం. 9.05 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ సెంటర్‌లోకి అనుమతి ఇవ్వం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

సయ్యద్ ఇబ్రహీం లేని లోటు పూడ్చలేనిది



- సంతాప సభలో సీపీఐ(ఎం) సౌత్ కమిటీ నాయకులు అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ-ధూల్‌పేట్

సయ్యద్ ఇబ్రహీం లేని లోటు పూడ్చలేనిదనీ సీపీఐ (ఎం) సౌత్ కమిటీ నాయకులు అబ్దుల్ సత్తార్ అన్నారు. సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్‌పురా జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇబ్రహీం అలీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ జూన్ పరిధిలో స్థానికంగా సయ్యద్ ఇబ్రహీం ప్రజా సమస్యల పట్ల పోరాటాలు చేశారన్నారు. చార్మినార్ బహదూర్‌పురా ప్రాంతంలో కార్యక్రమాలు చేయడానికి ఎవరూ ముందుకు రాని రోజుల్లో ధైర్యంగా ఆయన ముందుకొచ్చి స్థానిక సమస్యలపై పరిష్కారం కోసం పని చేశారన్నారు. ఇక్కడ కార్యక్రమాలు చేయలేని పరిస్థితిలో తన ఇంటి ముందు టెంట్లు వేసి నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన సూటితత్వం ఆయన సున్నితమైన మనస్తత్వం గురించి అందరికీ తెలుసు కాబట్టి ప్రత్యర్థులు సైతం ఆయనకు తోడుగా నిలబడే వారన్నారు. ఈ కార్యక్రమం ముందుగా జోన్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, ఆయన తమ్ముడు ఇనాయత్ అలీ, కుమారులు, పార్టీ స్థానిక నాయకులు సఫియా, గులాం నజీర్, షౌకత్ అలీ, మహ్మద్ అలీతో పాటు జిల్లా కమిటీ సభ్యులు బాబా ఖాన్, లక్ష్మమ్మ కిషన్, కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు కోటయ్య, మీనా పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కమిటీ సభ్యులు మహమ్మద్ కలిముద్దీన్, సయ్యద్ లాయిఖ్ అలీ, సయ్యద్ నసీర్, తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలో మంచినీటి లోప్రెషర్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద రూ.13.75తో మంచినీటి క్రమబద్ధీకరణకు జంక్షన్‌తోపాటు నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. అలాగే, ఎల్లయ్య బస్తీలో సీవరేజ్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు బస్తీల్లో మంచినీటి సరఫరాలో ప్రెషర్ సమస్య తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. త్వరలో ప్రతి బస్తీలోనూ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అందుకు అత్యధిక నిధులు కేటాయిస్తామని తెలిపారు. అధికారులు త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాల్సిందిగా కోరారు. కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ.. చాలా రోజులుగా మంచినీటి సమస్యపై జలమండలి అధికారులతో చర్చలు జరిపామని తెలిపారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు రాకేష్ కుమార్, ముఠా పద్మ నరేష్, మచ్చుకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస గుప్తా, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, యాద గిరిగౌడ్, శ్రీకాంత్, ముత్యాలు, పి.నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

పోలీసులపై వైఎస్ విజయమ్మ, షర్మిల తీరును ఖండిస్తున్నాం : నల్లా శంకర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంతో బాధ్యతాయుతంగా శాంతి భద్రతలను పరిరక్షిస్తున్న పోలీసులపై దాడులు చేయడం దారుణమని సీటీ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నల్లా శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులపై వైఎస్ విజయమ్మ, షర్మిల చేయిచేసుకోడాన్ని శంకర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం, చేయి చేసుకోవడం మంచి పరిణామాలు కావన్నారు. ఇలాంటి చర్యలతో పోలీసుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ వారి సహనాన్ని పరీక్షించకూడదని హెచ్చరించారు. వారి చర్యలను ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాలను అదుపు చేయడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉన్నారని గుర్తు చేశారు. కొంత మంది రాజకీయ నాయకులు, ప్రముఖులు సైతం వ్యక్తిగత గుర్తింపు కోసం చౌకబారు చర్యలతో పోలీసుల మనో ధైర్యాన్ని దెబ్బ తీయటానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు 24 గంటలూ పని చేస్తారనీ, అలాంటి వారిపై చేయి చేసుకోవడం వల్ల సమాజానికి తప్పుడు సందేశం వెళ్తుందన్నారు. ఇలాంటి చర్యలను హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారుల సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు.

ఉచిత మజ్జిగ, అల్పాహారం ప్రారంభం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాశీ వారణాసిలో 12 ఏండ్లకోసారి వచ్చే పుష్కరాలు ఈసారి గంగానదికి రావడంతో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో దశ అశ్వమేధ ఘాట్ వద్ద వచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగ, అల్పాహారం అందిస్తున్నామని సమితి అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉస్మాన్ గంజ్‌లోని బాస్ కార్యాలయంలో ఉచిత మజ్జిగ పంపిణీ బ్రోచర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం వేసవిలో మండుతున్న ఎండల్లో మాటకు వచ్చే భక్తులకు కొంత మేర దప్పిక తీర్చేందుకు ఊడతా భక్తిగా ఉచిత మజ్జిగ పంపిణీని ప్రారంభించామని తెలిపారు. బాస్ తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ సంయుక్తాధ్వర్యంలో 33 మంది అనాథ చిన్నారులను అక్కున చేర్చుకుని వారికి విద్య, వసతి, భోజనం అందిస్తూ సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉస్మానియా హాస్పిటల్‌లో 365 రోజుల పాటు హాస్పిటల్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు ప్రతిరోజూ ఆంఓయువీ ప్లాంట్ ద్వారా రోజుకు 15 వేల లీటర్ల మంచినీటిని హెల్ప్ ఏ నీడీ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శనిశెట్టి వెంకటేశం, నర్సింగ్, నరేందర్ మధు, నార్త్ జగదీష్, శ్రీహరి, భిక్షపతి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీలో 2కే వాక్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బెలూన్లు ఎగురవేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్సీసీ గేటు వరకు 2 కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 25న వర్సిటీలోని అన్ని విభాగాల్లో ఓపెన్ హౌజ్ కార్యక్రమాలతో పాటు వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. 26న ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం పదిన్నర గంటలకు జరుగనున్న వేడుకలకు ముఖ్య అతిథిగా ఓయూ పూర్వ విద్యార్థి, అంతరిక్షంలో కాలు మోపిన తొలి భారతీయుడు, వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ, గౌరవ అతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, యూజీసీ సభ్యుడు, ఇఫ్లూ వీసీ ప్రొ.ఇ.సురేశ్ కుమార్ హాజరుకానున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయనీ, దీనికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీ నారాయణ, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, డీన్లు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్శిటీ, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఓయూ వీసీ ప్రొ.డి.రవీందర్ ఆదేశాల మేరకు, "ఓయూ తక్ష్" సందర్భంగా క్యాంపస్‌ను క్లీన్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వీసీ ప్రొ.రవీందర్, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవాభావాన్ని అలవర్చుకోవాలని, వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూనే చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. రిజిస్ట్రార్ పి.లక్ష్మినారాయణ, కో-ఆర్డినేటర్ డా. సవీన్ సౌద పాల్గొన్నారు. 600 మంది వాలంటీర్లు ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు రోడ్ల వెంట ఉన్న చెత్తను సేకరించి, శుభ్రపరిచారు. సేకరించిన చెత్తతో ఆర్ట్స్ కళాశాలకు చేరుకున్న వాలంటీర్ల ప్రోగ్రాం ఆఫీసర్లను ఎన్ఎస్ఎస్ పోగ్రాం కోర్డినేటర్ సౌద అభినందించారు.

వయోజనుల్లో రోగ నిరోధకతకు వ్యాక్సిన్‌లు

- ఈ నెల 24 నుంచి 30 వరకు వరల్డ్ ఇమ్యునైజేషన్ డే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఏప్రిల్ 24 నుంచి 30 వరకు – ప్రపంచ రోగనిరోధకత వారోత్సవం (వరల్డ్ ఇమ్యున్కెజేషన్ డే) నిర్వహించనున్నారు. అంటువ్యాధులు లేదా మహమ్మారి వ్యాధులను నివారించడంలో వ్యాక్సిన్‌లు కీలక పాత్ర పోషిస్తాయని జూబ్లీహిల్స్ అపోలో డాక్టర్ విజయ్ కుమార్ సెన్నంశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'నవతెలంగాణ' మాట్లాడుతూ.. రోగనిరోధకత కార్యక్రమం అనేది భారతదేశంలో, ప్రధానంగా 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఉద్దేశించబడిందన్నారు. ఇందులో సామూహిక టీకా కార్యక్రమాలు ఉంటాయన్నారు. టీకాతో నివారించగల చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని చెప్పారు. రోగనిరోధకత లేకపోవడం (బాల్యంలో అందుబాటులో లేని కొన్ని టీకాలు), వయస్సు కారణంగా దీర్ఘకాలిక పరిస్థితులు, రోగనిరోధక శక్తి కాలక్రమేణా మసకబారడం వంటి కారణాల వల్ల వృద్ధాప్యంలోనూ వ్యాధులు వస్తాయన్నారు. వ్యాధి సంకేతాలు, లక్షణాలు (ఇన్ఫెక్షన్) వారిలో మరింత తీవ్రంగా ఉంటాయన్నారు. వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులు, వృద్ధుల మరణాలు, జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావం చూపినప్పటికీ, వాటి ప్రయోజనాలను ఇప్పటికీ బాగా గుర్తించనందున, వయోజన టీకా కవరేజ్ అనేది చాలా తక్కువగా ఉంటున్నదని తెలిపారు. టీకా యొక్క ఆవశ్యకత గురించి అవగాహన పెంచేందుకు, వ్యాక్సిన్‌ల యొక్క ప్రాముఖ్యతను, వ్యాధుల నుంచి టీకాలు ఎలా రక్షిస్తాయో తెలియజేసే లక్ష్యంతో, ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారంలో ప్రపంచ రోగనిరోధక వారోత్సవాలను జరుపుకుంటారమని చెప్పారు. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, సంతోషకరమైన జీవితాలను గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. 'ది బిగ్ క్యాచ్-అప్' అనే బ్యానర్ కింద ప్రపంచ ఆరోగ్య సంస్థ (గవి, వ్యాక్సిన్ అలయన్స్, యూనిసెఫ్, బిల్ & మెలిండా గేట్స్ ఫౌండేషన్ మొదలైన) విస్తృత శ్రేణి భాగస్వాములతో కలిసి క్యాచ్-అప్, రెస్టోర్, స్ట్రెంగ్తనింగ్ వ్యాక్సిన్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తోందన్నారు. తద్వారా పిల్లలు, పెద్దలకు టీకాల యొక్క ప్రాముఖ్యత, వ్యాధి వ్యాప్తిని నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. వయోజన వ్యాక్సినేషన్ ఆరోగ్యకరమైన జీవనానికి ఒక ముఖ్యమైన దోహదకారి కాబట్టి "లైఫ్-కోర్సు ఇమ్యునైజేషన్" అనేక దేశాల్లో అమలు చేయబడుతున్నదని చెప్పారు. అయినప్పటికీ, జాతీయ మార్గదర్శకాలు లేకపోవడం, మనకు అవసరం ఉన్నది అని గ్రహించలేకపోవడం కారణంగా, దేశంలో వయోజన టీకా కవరేజ్ కార్యక్రమం ప్రస్తుతం చాలా తక్కువగా ఉన్నన్నారు. వయోజనులకు రోగనిరోధక శక్తిని అందించడంలో ఈ వైఫల్యం ఉందని చెప్పారు. దేశంలో వయోజనులకు వ్యాక్సినేషన్ కవరేజీని మెరుగుపరచడం, ముఖ్యంగా వృద్ధులలో, ఆస్పత్రిలో చేరడం, ఆరోగ్య ఖర్చులు, మరణాల రేటును తగ్గించడం, జీవన నాణ్యతను మెరుగుపరచడం, వ్యాధి భారాన్ని తగ్గించడంలో వ్యాక్సినేషన్ సహాయపడుతుందన్నారు.

ప్రముఖ సోషల్ వర్కర్ ప్రకాష్‌కు ప్రమాదం

- దాతలు ఆదుకోవాలని విన్నపం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రముఖ సంఘ సేవకుడు, పంచర్ షాప్ ప్రకాష్ అంటే యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ, రహమత్‌నగర్ డివిజన్‌లో తెలియని వారు ఉండరు. ప్రకాశ్ ఆర్బీఐ క్వార్టర్స్ వద్ద రోడ్డు పక్కన డబ్బా పెట్టుకుని, పంచర్లు వేస్తూ జీవిస్తున్నాడు. ఆ కాలనీల్లో ఎక్కడ సమస్య వచ్చినా, వెంటనే మీడియాకు ఫోటోలతో సహా పంపిస్తూ వార్తలు రాయించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేసేవారు. అక్కడ నాలుగు కూడళ్లలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు గుర్తించి ఇచ్చిన పోలీసు స్టిక్‌ను ఉపయోగించి, తన పని మానుకుని ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ, అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనదారులకు సహాయం చేస్తుంటాడు. కొన్నేండ్లుగా అతను ఉంటున్న కూడలిలో ఎలాంటి చిన్న ప్రమాదం కూడా జరగకుండా వాహనదారులను నియంత్రించి, ట్రాఫిక్ జామ్ కాకుండా సహాయ సహకారాలు అందిస్తున్నాడు. అయితే ఇలాంటి మనిషి ఈనెల 20వ తేదీన మోటార్ సైకిల్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగి, వెన్ను పూసకు గాయమై నిమ్స్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుని ఇంటికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు కనీసం రెండు నెలలు బెడ్ రెస్ట్ అవసరమని తెలిపారు. అతను పంచర్ షాపులో పని చేస్తేనే కుటుంబం గడుస్తుంది. ప్రకాశ్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దాతలు ఎవరైనా ఉంటే తన ఫోన్ నెంబర్ 9705005965 కు గూగుల్ పే లేదా ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం చేయాలని దాతలను విజ్ఞప్తి చేస్తున్నారు.

కుళ్లు రాజకీయాలను ఓడించాలి



- అందుకు మీ చదువులు ఉపయోగపడాలి
- విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుత సమాజంలో నెలకొన్న కుళ్లు రాజకీయాలను ఓడించడానికి విద్యార్థుల చదువులు ఉపయోగపడాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఓయూ గెస్ట్ హౌజ్‌లోని ఐసీఎస్ఎస్ఆర్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పోర్ట్స్ లీగ్-2023 ముగింపు వేడుకల, బహుమతుల ప్రధానం కార్యక్రమం నిర్వహించారు. ఓయూ అధ్యక్షుడు ఎస్.సుమంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం, జార్జిరెడ్డి అమరత్వాన్ని స్మరిస్తూ మెమోరియల్ టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య, ప్రొ. కొండా నాగేశ్వరరావు, ప్రొఫెసర్ వంశీధర్, ప్రొ. గుమ్మడి అనురాధ, పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వరరావు ప్రసంగించారు. ఉస్మానియా చరిత్రలో జార్జి రెడ్డి త్యాగం ఆదర్శనీయమన్నారు. ఎకడమిక్స్‌లో, ఉద్యమాలలో జార్జి రెడ్డి అపార ప్రతిభ కనబరిచి ఎందరికో దారి చూపారని చెప్పారు. క్రీడల్లో అగ్రగామిగా ఉంటూ బాక్సింగ్ స్టేట్ చాంపియన్‌గా నిలిచారని తెలిపారు. పీడీఎస్‌యూ ఓయూ ప్రధాన కార్యదర్శి కె.స్వాతి మాట్లాడుతూ.. జార్జి రెడ్డి అమరత్వాన్ని స్మరిస్తూ ఏప్రిల్ 10 నుంచి 14 వరకు నిర్వహించిన స్పోర్ట్స్ లీగ్, సంస్మరణ కార్యక్రమాలు, మూవీ స్క్రీనింగ్, మార్నింగ్ వాక్‌ను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జార్జి స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఓయూ సహాయ కార్యదర్శి రుక్మత్ పాషా, నాయకులు ప్రశాంత్, కొటేశ్, భువన, క్రాంతి, రాము, అంజి, చిరంజీవి, విజయ్, సౌజన్య నరేష్, రాకేష్, వేణు, శివ, కార్తిక్, అవినాష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు : కార్పొరేటర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజా సమస్యలను అధికారులు గాలికి వదిలేశారని ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్, మహాభారత్‌నగర్ లో ప్రజలతో మమేకం పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. గాంధీనగర్లో కొన్ని రోజుల నుంచి నీటి సమస్య, మహాభారత్ నగర్‌లో మురుగునీటి సమస్య, వీధిలైట్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాలు ఇలా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. దాంతో వీటిని ఇంకెన్ని రోజుల్లో పూర్తి చేస్తారని కార్పొరేటర్ అధికారులను ప్రశ్నించారు. ఎన్నికలవేళ ఉత్తిత్తి హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పడతావ్, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్తు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఓయూ

పాలమూరు యూనివర్సిటీలో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌జేఏసీ, ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుడు గద్దెల అంజిబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్తారన్నారు.

బ్రిజ్ భూషణ్ శరణ్‌ను అరెస్టు చేయాలి

- సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భారత రెజ్లర్ సమాఖ్య చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అతను తమను లైంగికంగా వేధిస్తున్నాడని అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చిన రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ పోగట్ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వారందరూ న్యాయం కోసం గత సంవత్సరం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా వారికి మద్దతు రావడంతో గత్యంతరం లేని ప్రభుత్వం విచారణ చేపట్టడం కోసం ఒక కమిటీని నియమించారన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిడ్జి భూషణ్‌ను కనీసం పదవి నుంచి తప్పించలేదని, లైంగిక దాడులు చేసే వాళ్లకు, మహిళలను వేధించే వాళ్లకు బీజేపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తూ మరిన్ని దాడులు జరిగేలా పరోక్షంగా సహకరిస్తోందని పేర్కొన్నారు. అనేక మంది మహిళలు పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు, దాడులకు గురవుతున్నారని అనేక నివేదికలు వస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని అన్నారు. బేటి పడావో బేటి బచావో అనేది కేవలం నినాదానికి పరిమితం అయిందని, విద్యాలయాల్లో హక్కుల కోసం పోరాడుతున్న అమ్మాయిలపై వివక్ష, ఆంక్షలు విధించడమే కాకుండా అనేక సందర్భాల్లో పోలీసులతో లాఠీచార్జి చేయించారని పేర్కొన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన భూషణ్‌పై కేసు నమోదు చేయాలని ఢిల్లీ మహిళా కమిషన్ ఆదేశించినా పోలీసు అధికారులు పట్టించుకోకపోవటం అత్యంత దారుణమన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులకే ఇలాంటి అన్యాయం జరిగితే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

బీజేపీ హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతనహరీష్ ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డితో కలిసి రామంతపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులను సోమవారం ప్రారంభించారు. సుమారు కోటి 65 లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రామంతపూర్ పెద్ద చెరువు పనులు త్వరలో పూర్తి చేయాలని, ప్రజలకు మంచి ఆహ్లాద వాతావరణాన్ని చెరువు కట్టపై తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఎస్ఎన్‌డిపి పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. సాయిచిత్ర నగర్ యుజిడి ఔట్‌లెట్ పనులను త్వరలో ప్రారంభించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు నేలకొండ సుమన్ రావు, చింతకింది ప్రవీణ్, రంగ రవి పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

నవతెలంగాణ-హైదరాబాద్

మాతృభాష తెలుగును కాపాడుకోవాలని అఖిల భారత తెలుగు సేన ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో వక్తలు అన్నారు. బంజారాహిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో జరిగిన వార్షికోత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఫౌండర్ పీఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ.. తాము తెలుగు కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకొని రెండేండ్లుగా ప్రపంచంలో ఉన్న తెలుగు వాళను ఏకం చేస్తున్నామన్నారు. భాషా, సంస్కృతిని కాపాడుకోవడం, పేద పురోహితులను ఆదుకోవడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో ఉన్న ఎంతో మందికి ఇక్కడున్న రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులతో ఉచితంగా ఆన్‌లైన్‌లో తెలుగు నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల్లో వారి వారి భాషలను కాపాడుకునేందుకు ఆయా ప్రభుత్వాలు కృషి చేస్తుంటే ఇక్కడ మాత్రం ఇతర భాషల వైపు మొగ్గు చూపుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషను కాపాడటంలో కృషి చేస్తున్న సినీ కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత రామ సత్యనారాయణ, నటులు మానిక్, పూజిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్‌పి. భారతి, అసోసియేషన్ అధ్యక్షుడు డి వి సాయి సుబ్రమణ్యం, గరిమెళ్ల సత్య సురేష్, మదన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బచ్పన్ కిడ్స్ క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బచ్పన్ కిడ్స్ క్రికెట్ టోర్నమెంట్ టీవీఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో చింతల్ వెంకటేశ్వర బచ్పన్ పాఠశాల యూకేజీ విద్యార్థులు, సూరారం బచ్పన్ పాఠశాల యూకేజీ విద్యార్థుల మధ్య జరిగిన క్రికెట్ పోటీలు జీడిమెట్ల అపురూప కాలనీ టీవీఆర్ పాఠశాలలో సోమవారం అకాడమీ డైరెక్టర్ సూరా రవిచంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సూరారం బచ్పన్ డైరెక్టర్ వేణుమాధవ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా విచ్చేశారు. ఈ క్రికెట్ పోటీలలో బుడిబుడి అడుగులతో చింతల్, సూరారం యూకేజీ చిన్నారులు పాల్గొని బ్యాటింగ్ చేస్తూ... బౌలింగ్ వేస్తూ .. నైపుణ్యం కనబరిచి చూపులను ఆకట్టుకున్నారు. రన్నర్స్, విన్నర్స్ అందరికీ విన్నర్స్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులు పాల్గొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

బల్దియా స్టడీ టూర్..!

- రెండురోజులు ఐదు మెట్రో నగరాల్లో అధ్యయనం
- జోనల్ కమిషనర్ నేతృత్వంలో పర్యటించనున్న బృందం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పౌరులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఎప్పటికప్పుడు అత్యుత్తమ విధానాలను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగానే ఇటీవల జీహెచ్ఎంసీ, పోలీస్, జలమండలి, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు ఆయా శాఖల క్షేత్రస్థాయి అధికారుల సమన్వయంతో ' మల్టీ డిసిప్లీనరీ బృందాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్ల పరిధిలో 5వేలకు పైగా బృందాలను ఏర్పాటు చేస్తూ 'వార్డు ఆఫీసర్'గా క్షేత్రస్థాయిలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నారు. ఈ క్రమంలోనే దేశంలోని మెట్రో నగరాల్లో పురపాలక శాఖ సేవలు, ఫీల్డ్ లెవల్ మెకానిజానికి సంబంధించి అత్యుత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఐదు మెట్రో నగరాల్లో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో ఐదు టీమ్‌లు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పర్యటనకు ప్రభుత్వం అనుమతిచ్చింది. జోనల్ కమిషనర్ నేతృత్వంలో ఈ బృందాలు ఈ నెల 25, 26 తేదీల్లో న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో పర్యటించనున్నాయని సమాచారం.

టీవీ నటి ఇంట్లో చోరీ కేసు ఛేదన

- 96 కేసులున్న పాత నేరస్తుడి అరెస్టు
- రూ.45లక్షల విలువగల బంగారు ఆభరణాలు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీవీనటి సుమిత్ర పంపనా ఇంట్లో జరిగిన చోరీ కేసును పంజాగుట్ట పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రూ.45లక్షల విలువగల 753 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీలు జోయల్ డెవిస్, రాధాకిషన్‌రావుతో కలిసి సీపీ సీవీ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు శ్రీనగర్‌కాలనీలో ఉండే నటి సుమిత్ర పంపనా ఈ నెల 17న ఢిల్లీకి వెళ్లింది. 18న ఇంటి తాళం పగులగొట్టి ఉన్నట్టు ఆమె సోదరుడు గుర్తించి ఆమెకు ఫోన్ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పంజాగుట్ట పోలీసులు అమీర్‌పేట్‌లో నివాసముంటున్న పాత నేరస్తుడు మహమ్మద్ ఇబ్రహీం సిద్దిక్ కదలికలపై ఆరా తీశారు. దాదాపు 100 సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిపై హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లతోపాటు తదితర పోలీస్‌స్టేషన్లలో దాదాపు 96 కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు. ఎస్ఆర్‌నగర్, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్లలో నిందితుడిపై పీడీ యాక్టులున్నాయన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ మోహన్‌కుమార్‌తోపాటు పంజాగుట్ట సీఐ సీ.హెచ్ హరిచంద్రారెడ్డి, డీఐ దుర్గారావు, ఎస్ఐలు నరేష్, రఫియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. చాకచక్యంగా కేసును ఛేదించినందుకు పంజాగుట్ట పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

లింగం గౌడ్ సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మూడున్నర దశాబ్దాలపాటు కుత్బుల్లాపూర్ ప్రాంతంలో రాజకీయంగా, సామాజికంగా విశిష్ట సేవలు చేసిన మాజీ మున్సిపల్ చైర్మెన్ బుడ్డా లింగంగౌడ్ చిరస్మరణీయులని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం లింగంగౌడ్ 80వ జయంతి సందర్భంగా లింగంగౌడ్ ఘాట్, మున్సిపల్ ఆఫీస్ చౌరస్తా, విజయ్‌నగర్ కాలనీలలో గల విగ్రహాలకు రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్, లింగగౌడ్ తనయుడు బుడ్డా విజయశేఖర్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగం గౌడ్ ప్రజానాయకుడని, అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం శ్రమించే వారని చెప్పారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడని కొనియాడారు. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ అన్ని వర్గాల ప్రజలకు రాజకీయంగా సేవలు అందిస్తానని కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్ తెలిపారు. అనంతరం విజయనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ బస్తీల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సమస్యలపై ప్రజలు అందించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ సూచనల మేరకు స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆధ్వర్యంలో శాంతినగర్, బాగ్ అమీర్, చైతన్య నగర్, సుమిత్ర నగర్‌లోని వెల్ఫేర్ అసోసియేషన్లతో శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో పబ్లిక్ కాంటాక్ట్ సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్, ప్రజలతో వివిధ సమస్యలపై చర్చించారు. కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను లిఖితపూర్వకంగా వారికి అందజేశారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాట్లాడుతూ.. ముఖ్యంగా జలమండలికి సంబంధించిన, డ్రైనేజీలు, రోడ్లు వంటి సమస్యలు ఉన్నాయని, పోలీస్ శాఖకు సంబంధించి పెట్రోలింగ్ మెరుగుపరచాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. తమ దృష్టికి వచ్చిన పై సమస్యలన్నింటినీ వీలైనంత తొందరలో పరిష్కరించాలని, ఏ శాఖలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడూ సమీక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, విద్యుత్ సిబ్బంది, జలమండలి సిబ్బంది, మేనేజర్ ప్రియాంక, నాగరాజు, సత్యనారాయణ, పోలీసు శాఖ అధికారులు, రామ్‌కీ ఎస్ఎఫ్ఏ రజిని, డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, మెంబర్స్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ వద్ద 25వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరిగే బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రతినిధుల సభ (ప్లీనరీ సమావేశం) ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పరిశీలించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

బ్రోచర్స్ విడుదల



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఫౌండేషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆర్ట్స్ కాలేజ్ బ్రోచర్స్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఉస్మానియా ఫౌండేషన్ డే కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ కాలేజీలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరగబోయే కార్యక్రమాల వివరాల బ్రోచర్స్‌ను ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ.సి.గణేష్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనుపమ, హెడ్ ప్రొ. కాశీం, డాక్టర్ కొండా నాగేశ్వర్ పాల్గొన్నారు.

పబ్లిక్ కాంటాక్ట్‌ను సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అన్ని శాఖల అధికారులు ప్రజల దగ్గరకు వచ్చి సమస్యలను పరిష్కరించే కార్యక్రమం పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం అన్ని శాఖల అధికారులతో కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-2 కమిటీ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమావేశం ఆల్విన్ కాలనీ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్-1, ఫేస్-2, ఆదిత్య నగర్, చక్రధరి నగర్, సాయి నగర్ ఈస్ట్, రాఘవరేంద్ర కాలనీ, ఆల్విన్ కాలనీ జయశంకర్ కాలనీలలోని సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అధికారులే మన దగ్గరికి వచ్చారు కాబట్టి కాలనీలో చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఎటువంటి సమస్య ఉన్నా వారి దృష్టికి తీసుకొస్తే త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల శ్రీనివాస్, రాజేష్ చంద్ర, ప్రధానకార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, జీహెచ్ఎంసీ అధికారులు, జలమండలి మేనేజర్ ఝాన్సీ, ఏ ఈ శ్రావణి, ఎంటమాలజీ ఏ ఈ ఉషారాణి, డాక్టర్ సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్స్ రవి కుమార్, రవీందర్ రెడ్డి, ఎంటమొలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, అర్బన్ హెచ్ఏ నాగరాణి, స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్ నరేష్, ఎస్ఎఫ్ఏ వెంకట రెడ్డి, శ్రీనివాస్, పోలీస్ శాఖ కె.పాండురంగ చారి, సూపర్వైజర్ శివ, లైన్‌మెన్ రవి, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ గౌడ్, కృష్ణారావు, భాస్కర్ రెడ్డి, కట్టా శ్రీనివాసరావు, వెంకటేష్ గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. ఆయన పలు కాలనీలలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు సమతా నగర్, గౌరీనగర్, రాజారెడ్డి కాలనీ, మైత్రివనం, రాంరెడ్డి కాలనీ, పీవీ ఎన్‌క్లేవ్ తదితర కాలనీలలో పర్యటించగా.. ప్రజలు తమ సమస్యలను అధికారులకు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సమస్యల సత్వర పరిష్కారానికి కార్యాచరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, టీపీఎస్ శ్రీనివాస్ రెడ్డి, జశ్వంత్, ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది చైతన్య, ప్రకాష్, రమేష్, అరుణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మైపాల్ రెడ్డి, ఉదయ్ యాదవ్, బుర్రి యాదగిరి, మల్లేష్ యాదవ్, చందు యాదవ్ మేకల, జేకే బాయ్, ఉదయ్ పాల్గొన్నారు.

యువతిపై కత్తితో ప్రేమోన్మాది దాడి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యువతిపై ప్రేమోన్మాది నడ్డిరోడ్డుపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోరబండ డివిజన్ బంజారానగర్‌లో సోమవారం జరిగింది. అదే బస్తీలో నివసిస్తున్న కిషోర్ కొంతకాలంగా లక్ష్మి అనే యువతని ప్రేమిస్తున్నాడు. ఇద్దరి మధ్య జరిగిన గొడవలలో లక్ష్మిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆమె బంజారానగర్‌లో వెళ్తుండగా.. కూరగాయలు కోసే కత్తితో గొంతు కోయాలని పట్టుకున్నాడు. వెంటనే అక్కడివారు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. యువతి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్సార్ నగర్ పోలీసులు తెలిపారు. ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వ్యవహారమే హత్యా ప్రయత్నానికి కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తాం : కార్పొరేటర్



నవతెలంగాణ-బాలానగర్

జీహెచ్ఎంసీ ప్రారంభించిన 'పబ్లిక్ కాంటాక్ట్' కార్యక్రమంలో భాగంగా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిసి దామోదర సంజీవయ్య కాలనీ, కౌండిన్య నగర్, నేతాజీ కాలనీ, కుమ్మరి బస్తీ, అంబిక కాలనీ, రాజు కాలనీల్లో అసోసియేషన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధ్భంగా కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్ఎంసీ 'పబ్లిక్ కాంటాక్ట్' కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అన్ని విభాగాల అధికారులతో కలసి పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రషీద్, అశ్విని, వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, వాటర్ వర్క్స్ సిబ్బంది, సర్కిల్ సిబ్బంది నాగేశ్వర్ నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు రూ.50 వేల సాయం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గుండె సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్ రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన సంతోష్ కుమార్, మౌనిక దంపతుల కుమార్తె పి.ప్రణతికు గతంలో రెండు సార్లు గుండెకు ఆపరేషన్ జరిగింది. మరొక సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించగా.. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను సంప్రదించారు. ఆయన తల్లిదండ్రుల పేరిట ఉన్న ట్రస్టు ద్వారా రూ.50 వేలను సోమవారం ట్రస్ట్ చైర్మెన్ కూన శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత నల్ల జయశంకర్ గౌడ్ మోహన్ రావు, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ కళాశాలలో 3కే రన్

నవతెలంగాణ-ఓయూ

టెక్నాలజీ కళాశాలలో ఈనెల 25, 26, 27వ తేదీలో జరిగే టెక్నోస్మానియా సన్నాహక కార్యక్రమంలో భాగంగా సోమవారం "3 కే రన్" నిర్వహించారు. 'గ్రీన్ లివింగ్ ఈస్ స్మార్ట్ లివింగ్' నినాదంతో ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం కోశాధికారి రిటైర్డ్ సైంటిస్ట్ సీపీ రాములు జెండా ఊపి 3కె రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎల్లమ్మ టెంపుల్ వద్ద కళాశాల విద్యార్థులు "ఫ్లాష్ మాబ్" నిర్వహించారు. తదనంతరం బైక్ ర్యాలీ ఓయూలో విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చింత సాయిలు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జె. హయవదన, డీన్ ఫాకల్టీ ఆఫ్ ఫార్మసీ ప్రొ. వి.రమేష్ కుమార్, ప్రొ. వి.వి.బసవ రావు, ప్రొ. శ్రీను నాయక్, కన్వీనర్ డా. జ్యోతి, కో కన్వీనర్ డా. ఎ.పరశురాం, డా. ఎ. కవిత, ఆచార్య ధనలక్ష్మి డా. వి.భాస్కర్, డా. టి.అజిత్ కుమార్, డా. అభిలాష్, డా. ఐలయ్య డా.రమేష్, డా. పి.సునిత, విజయకాంత్, డా.అర్జున్, డా.ధీరజ్, అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో అన్నిటికీ ఆధారే ఆధారం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భవిష్యత్తులో అన్నిటికీ ఆధారే ఆధారమని ఐసీడీఎస్ రంగారెడ్డి నగర్ సెక్టార్ సూపర్‌వైజర్ యన్.తిరుమల అన్నారు. సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాల నేతృత్వంలో 0-6 వయసు గల చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల తల్లిదండ్రులు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నసీమా బేగం, ఎస్.నీరజ, కుమారి, వాణి, సునీత, పోస్టల్ శాఖ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రతినిధి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను తగ్గించాలి

- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్

నవతెలంగాణ-ఓయూ

బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకు గండి కొడుతున్నది ముస్లిం రిజర్వేషన్లు కాదని.. ఎలాంటి శాస్త్రీయ పద్ధతి పాటించని అగ్రవర్ణ రిజర్వేషన్లని 10 నుంచి 5 శాతానికి తగ్గించాలని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ.డాక్టర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆనాటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చట్టబద్ధ కమిషన్స్ ద్వారా ముస్లింల జనాభా కంటే తక్కువ నాలుగు శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తే.. దేశవ్యాప్తంగా ఐదు శాతం ఉన్న అగ్రవర్ణ పేదలకు ఆర్థిక ప్రాతిపదికన 10 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి బీసీ ఎస్సీ ఎస్టీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా జనాభా దామాషా పద్ధతిలో అన్ని వర్గాలకు రిజర్వేషన్ల పంపిణీ చేయడమే కాకుండా సంపద పంపిణీ కూడా చేయాలని కోరారు.

యూనివర్సల్ పిక్చర్స్ ద్వారా ఫాస్ట్ ఎక్స్ ట్రైలర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

యూనివర్సల్ పిక్చర్స్ (వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ద్వారా పంపిణీ చేయబడింది) వారి రాబోయే యాక్షన్-ప్యాక్డ్ మూవీ ఫాస్ట్ ఎక్స్ రెండవ ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నీల్ హెచ్. మోరిట్జ్, విన్ డీజిల్, జస్టిన్ లిన్, జెఫ్ రూపొందించారు.

లూయిస్ లెటెరియర్ దర్శకత్వంలో కిర్స్టెన్‌బామ్ మరియు సమంతా విన్సెంట్ మే 19న థియేటర్లలో విడుదల కానున్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమా వాగ్దానం చేసే కొన్ని తీవ్రమైన యాక్షన్ సన్నివేశాల్లో స్నీక్ పీక్‌ను అందిస్తుంది.

మీరు వచ్చే నెలలో థియేటర్లలో చూసే ఆడ్రినలిన్-ప్రేరేపిత సెట్ ముక్కల రుచిని అందిస్తూ, మీరు మీ సీటు అంచున ఉండేలా టిక్కింగ్ స్పీడోమీటర్‌తో ఈ ఉత్కంఠభరితమైన కారు ప్రయాణంలో పాల్గొనండి. మీ సీట్‌బెల్ట్‌లను ఫాస్ట్-10 చేయడం సురక్షితం!

దేశ వ్యాప్తంగా మదర్‌హుడ్ హాస్పిటల్ వర్చువల్ నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నెట్‌వర్క్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలో సుప్రసిద్ధ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్స్ నెట్‌వర్క్, మదర్‌హుడ్ హాస్పిటల్స్ , దేశ వ్యాప్తంగా 10 నగరాలలో 21 హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది. ఈ సంస్థ ఇప్పుడు వినూత్నమైన రిమోట్ మానిటరింగ్ టెక్నాలజీ మరియు సిస్టమ్‌ను వర్చువల్ లైఫ్‌సేవింగ్ నియోనాటల్ కేర్ ను తగినంతగా నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఎన్ఐసీయు) సదుపాయాలు లేని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలోని నర్సింగ్ హెూమ్‌లు , హాస్పిటల్స్‌లో చేరిన నవజాత శిశువులు పొందవచ్చు. నవజాత శిశువులకు జీవితాలను కాపాడే క్లీనికల్ కేర్‌ను నియోనాటల్ కేర్ అందిస్తుంది. ఎన్ఐసీయు లైవ్ అత్యాధునిక రిమోట్ మానిటరింగ్ సాంకేతికత మరియు ప్రత్యేకీకరించిన డిజిటల్ పరిష్కారాలను సుదూరంలోని ఎన్ఐసీయులలో చేరిన నవజాత శిశువులకు చికిత్స నందించడానికి వినియోగిస్తుంది. మొదటి దశలో ఈ వినూత్న కార్యక్రమంలో భాగంగా మదర్‌హుడ్ హాస్పిటల్స్ ఒక సెంట్రల్ కేర్ సెంటర్ (హబ్)ను బెంగళూరులోని తమ హాస్పిటల్స్‌లో ఏర్పాటుచేసింది. ఇది అనంతపూర్, హిందూపూర్, మదనపల్లె, పాట్నా, హిసార్‌లలో ఉన్న ఐదు ఎన్ఐసీయులతో అనుసంధానించబడి ఉంటుంది.

భారత స్టార్ రెజ్లింగ్ క్రీడాకారులు మూడు నెలలుగా చేస్తున్న న్యాయ పోరాటానికి అర్థమే లేకుండా పోయింది!.
లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మల్లయోధులు పట్టుబట్టగా..
భాజపా ఎంపీని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కమిటీ పేరుతో కాలయాపన చేస్తోంది.

మరో కమిటీ..కాలయాపనే!

- డబ్ల్యూఎఫ్ఐ మే 7 ఎన్నికల షెడ్యూల్ రద్దు
- రెజ్లింగ్ సమాఖ్యకు అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు
- ఒలంపిక్ సంఘానికి క్రీడాశాఖ మార్గనిర్దేశం



రోడ్డుపైనే రెజ్లర్ల నిద్ర : లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై నిద్రిస్తున్న భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్ తదితరులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) వ్యవహారాలను పర్యవేక్షించేందుకు మరో కమిటీని నియమించేందుకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘానికి (ఐఓఏ) సోమవారం కేంద్ర క్రీడాశాఖ ఓ లేఖ రాసింది. రెజ్లింగ్ సమాఖ్యలో నిధుల దుర్వినియోగం, అధ్యక్షుడు సహా కోచ్‌ల లైంగిక వేధింపులు, వ్యక్తిస్వామ్యం పట్ల విచారణ జరిపిన ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షణ కమిటీ సమర్పించిన నివేదికను బయటపెట్టడంతో పాటు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భారత రెజ్లర్లు రెండు రోజులుగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 5న మేరీకోమ్ కమిటీ నివేదిక అందజేసినా, రెజ్లింగ్ ఫెడరేషన్ వ్యవహారాలను తిరిగి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఆధీనంలోకి వెళ్లినా.. ఇప్పటివరకు నోరుమెదపని క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తాజాగా రెజ్లర్లు మళ్లీ ఆందోళన బాట పట్టడంతో మరో కమిటీ ఏర్పాటుకు ఆదేశించారు. రెజ్లర్ల డిమాండ్లను నెరవేర్చకుండా క్రీడాశాఖ మరో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవటం పట్ల మల్లయోధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, సంగీత ఫోగట్, సత్యవర్త్ కడియన్, సోమ్‌వీర్ రాఠి, జితేందర్ కిన్హాసహా పలువురు రెజ్లింగ్ క్రీడాకారులు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలో పాల్గొన్నారు.

అడ్‌హాక్ కమిటీ వేయండి :

ఏప్రిల్ 5న ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షణ కమిటీ విచారణ నివేదికను అందజేసింది. నివేదిక చేతికంది సుమారు మూడు వారాలు కావస్తున్నప్పటికీ ఆ విషయంలో క్రీడాశాఖ అధికారులు ఎటువంటి ఆసక్తి చూపించలేదు. పర్యవేక్షణ కమిటీలోని సభ్యులు బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు అనుకూలంగా వ్యవహరించానే ఆరోపణలు వచ్చినప్పటికీ క్రీడాశాఖ పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. విచారణ నివేదికను క్రీడాశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని, ఈ లోగా నివేదికలోని ప్రాథమిక అంశాల ఆధారంగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు ఓ లేఖ రాసింది. అందులో పలు అంశాలను ప్రస్తావించింది. విచారణ నివేదిక ఆధారంగా భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌లో ఫిర్యాదులకు ఓ వ్యవస్థ లేదు. లైంగిక వేధింపుల పరిష్కారానికి సైతం రెజ్లింగ్ సమాఖ్యలో వ్యవస్థీకృత యంత్రాంగం లేదు. రెజ్లింగ్ ఫెడరేషన్‌కు క్రీడాకారులకు మధ్య కమ్యూనికేషన్, పారదర్శకత లోపించింది. నివేదిక అందజేయగానే మేరీకోమ్ కమిటీ గడువు ముగిసింది. భారత రెజ్లింగ్ సమాఖ్య మే 7న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినట్టు మీడియా, వెబ్‌సైట్ ద్వారా తెలిసింది. ఆ ఎన్నిక షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నాం. రెజ్లింగ్ సమాఖ్య భారత ఒలింపిక్ సంఘంలో భాగం. అందుకే, ఆ స్పోర్ట్స్ ఫెడరేషన్ వ్యవహారాలను చూసేందుకు ఐఓఏ ఓ కమిటీని నియమించాలి. ఆ కమిటీ ఏర్పాటైన 45 రోజుల్లో ఎన్నికలను నిర్వహించాలి. ఈ సమయంలో రెజ్లింగ్ సమాఖ్య టోర్నీలు, ట్రయల్స్ నిర్వహణ, క్రీడాకారుల ఎంపికి బాధ్యతలు అడ్‌హాక్ కమిటీ చూసుకోవాలి. ఈ దిశగా భారత ఒలింపిక్ సంఘం చర్యలు తీసుకోవాలని లేఖలో క్రీడాశాఖ కార్యదర్శి కోరారు. ఈ విషయాన్ని ఐఓఏ అధ్యక్షురాలు పి.టి ఉష ట్విట్టర్‌లో వెల్లడించింది. అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు సహా పలు అంశాలను ఏప్రిల్ 27న జరిగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో చర్చిస్తామని తెలిపింది.

రెజ్లర్ల అసంతృప్తి :

బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండగా.. అతడికి అనుకూలంగా నివేదికను తొక్కిపెట్టడం, మరో కమిటీ ఏర్పాటు చేయటం పట్ల రెజ్లింగ్ క్రీడాకారులు అసంతృప్తితో ఉన్నారు. మూడు నెలలు క్రితం క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు. తాజాగా, క్రీడాశాఖ మరోసారి రెజ్లర్ల డిమాండ్లను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని మల్లయోధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12 ఏండ్లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్ నిబంధనల ప్రకారం ఈ సారి ఎన్నికల్లో పోటీచేసేందుకు అర్హత కోల్పోయాడు. దీంతో అతడి కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ ఈసారి అధ్యక్షుడిగా పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. అందుకోసం బ్రిజ్‌భూషణ్ ఇప్పటికే యంత్రాంగం సిద్ధం చేశాడు. క్రీడాశాఖ మంత్రి, విచారణ కమిటీలో పలువురు సభ్యులపై ఆందోళన చేస్తున్న రెజ్లర్లు విశ్వాసం కోల్పోయారని తెలుస్తోంది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సైతం రెజ్లర్ల ఆందోళనపై ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక ఏమైందో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. ఇప్పుడు మళ్లీ రెజ్లింగ్ సమాఖ్య బాధ్యతలు ఐఓఏకు అప్పగించారు. ఏర్పాటు కాబోయే అడ్‌హాక్ కమిటీలోనూ అధికార బిజెపికి చెందిన సభ్యులే అధికంగా ఉండనుండటంతో సహజంగానే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడటమే వారి ప్రథమ కర్తవ్యంగా ఉంటోంది. ఇప్పటికే మేరీకోమ్ కమిటీలో ఈ పరిస్థితిని రెజ్లర్లు చవిచూశారు. దీంతో రెజ్లర్లు ఆందోళన కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.



ఫిర్యాదు అందినా చర్యలేవీ :

ఇక బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని జాతీయ మహిళా కమిషన్‌కు సైతం తెలియజేశారు. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రెజ్లర్లు కోరుతున్నా ఢిల్లీ పోలీసులు చర్యలకు సిద్ధపడటం లేదు. మరోవైపు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ భజరంగ్, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌లు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేశారు. ఎంసీ మేరీకోమ్ నివేదిక ఆధారంగా బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన ఫిర్యాదుపై ముందుకెళ్తామని ఢిల్లీ పోలీసులు ఆ నివేదిక కోసం క్రీడామంత్రిత్వ శాఖను సంప్రదించినట్టు తెలుస్తుంది.



ఇక కదం తొక్కుదాం!

అందరి మద్దతు కోరిన రెజ్లర్లు

రెజ్లర్లు వర్సెస్ బాహుబలి, పోడియం టూ ఫుట్‌పాత్.. ప్లకార్డులతో మల్లయోధులు జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగారు. జనవరిలో తొలిసారి బ్రిజ్‌భూషణ్ నియంతృత్వ ఆగడాలపై గళమెత్తిన మల్లయోధులు.. అప్పుడు రాజకీయ పార్టీలు, రెజ్లింగ్‌యేతర క్రీడాకారులు మద్దతు అందించినా.. నిరాకరించారు. లైంగిక వేధింపుల అంశాన్ని రాజకీయం చేయటం ఇష్టం లేదని, రెజ్లర్లమే న్యాయ పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. మూడు నెలల్లోనే రెజ్లర్ల స్వరం మారింది. న్యాయం చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం.. మాట నిలబెట్టుకోలేదు. ఎవరి వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగామో.. వారి కనుసన్నల్లోనే మరో దశాబ్ద కాలం రెజ్లింగ్ సమాఖ్య పగ్గాలు వెళ్తున్న సంకేతాల నేపథ్యంలో రెజ్లర్లు ఆందోళన పథం మార్చారు.

ఈసారి అన్ని రాజకీయ పార్టీలు, రెజ్లింగ్‌యేతర క్రీడాకారులు సహా అంతర్జాతీయ క్రీడా సమాజం నుంచి సైతం రెజ్లర్లు మద్దతు కోరుకుంటున్నారు. అధికారం అండతో రెచ్చిపోతున్న వ్యక్తిపై పోరాటంలో సత్యం, నిజాయితీ మాత్రమే సరిపోవని ఇంకా శక్తి కావాలని రెజ్లర్లు భావిస్తున్నారు. అందుకోసం వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు సోషల్ మీడియా వేదికగా అన్ని వర్గాల మద్దతు కోరుతున్నారు. రైతుల నుంచి మహిళల వరకు ఎవరైనా రెజ్లర్ల న్యాయ పోరాటంలో భాగస్వామ్యమై కదం తొక్కవచ్చని సాక్షి మాలిక్ కోరింది.

అంతర్జాతీయ వేదికపై భారత్ గర్వపడే విజయాలు సాధించిన స్టార్ రెజ్లర్లు రోడ్డుమీదకు వచ్చినా కేంద్ర ప్రభుత్వం చలించటం లేదు. దీంతో మల్లయోధులు రాత్రి జంతర్‌మంతర్ వద్దే నిద్రకు ఉపక్రమించారు. ఈ దృశ్యాలను చూసిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవటం శోచనీయం. దేశానికి పతకాలు సాధించిన మహిళా అథ్లెట్ల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడినా ఎటువంటి చర్యలు లేకపోతే.. ఇక దేశంలో సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉందో ఊహించగలమని మల్లయోధులు ఆవేదన వ్యక్తం చేశారు.

145 కొట్టలేక..!

- ఢిల్లీ చేతిలో హైదరాబాద్ పరాజయం
- ఛేదనలో వాషింగ్టన్ ఆల్‌రౌండ్ షో వృథా



నవతెలంగాణ-హైదరాబాద్

లక్ష్యం 145 పరుగులు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం. బౌలర్లకు బంతిపై పట్టు అంతగా చిక్కదు. ఇది ఛేదనకు మరింత అనుకూలమైన వాతావరణం. ఇంకేముంది సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం లాంఛనమే అనిపించింది. కానీ చెత్త ప్రదర్శనలో సరిలేరు సన్‌రైజర్స్‌కు ఎవరు అని ఆరెంజ్ ఆర్మీ నిరూపించింది. 7 పరుగుల తేడాతో ఢిల్లీ చేతిలో పరాజయం పాలైంది. సీజన్లో వరుసగా మూడో ఓటమి మూటగట్టుకుంది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (49, 39 బంతుల్లో 7 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (31, 19 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (24 నాటౌట్, 15 బంతుల్లో 3 ఫోర్లు) పోరాడినా ఫలితం లేకుండా పోయింది. చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా..సన్‌రైజర్స్ బ్యాటర్లు అంచనాలను అందుకోలేదు. 20 ఓవర్లలో 6 వికెట్లకు హైదరాబాద్ 137 పరుగులే చేసింది. హ్యారీ బ్రూక్ (7), రాహుల్ త్రిపాఠి (15), అభిషేక్ శర్మ (5), ఎడెన్ మార్క్‌రామ్ (3) విఫలమయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా రెండో విజయం కావటం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (3/28), భువనేశ్వర్ కుమార్ (2/11) మ్యాజిక్ చేశారు. మనీశ్ పాండే (34, 27 బంతుల్లో 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (34, 34 బంతుల్లో 4 ఫోర్లు), మిచెల్ మార్ష్ (25, 15 బంతుల్లో 5 ఫోర్లు) ఢిల్లీ క్యాపిటల్స్‌కు పోరాడగలిగే స్కోరు అందించారు.

సుందర్ షో వృథా : తొలుత బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్ ఫిల్ సాల్ట్ (0) అవుటైనా.. మిచెల్ మార్ష్ (25) బౌండరీల మోతతో కోలుకుంది. సీజన్లో తొలి సిక్సర్ వాషింగ్టన్ సుందర్‌పై బాదిన డెవిడ్ వార్నర్ అతడిపై స్లాగ్ షాట్‌కు వెళ్లి వికెట్ కోల్పోయాడు. అదే ఓవర్లో సర్ఫరాజ్ ఖాన్ (10) స్వీప్ షాట్‌తో, అమన్ హకీమ్ ఖాన్ (4) స్లాగ్ షాట్‌కు ప్రయత్నించి డగౌట్ బాట పట్టారు. సీజన్లో ఇప్పటివరకు ఒక్క వికెట్ పడగొట్టని వాషింగ్టన్ సుందర్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఒకే ఓవర్లో మూడు వికెట్లతో మెరుపు మాయ ప్రదర్శించాడు. వాషింగ్టన్ మాయజాలంతో ఢిల్లీ క్యాపిటల్స్ విలవిల్లాడింది. 62/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న క్యాపిటల్స్‌ను మనీశ్ పాండే (34), అక్షర్ పటేల్ (34) ఆదుకున్నారు. పాండే, పటేల్ ఆరో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. మార్కండె ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అక్షర్ పటేల్ డెత్ ఓవర్లలో ఇన్నింగ్స్‌కు ఊపుతీసుకొచ్చే ప్రయత్నం చేశాడు.

స్కోరు వివరాలు :

ఢిల్లీ క్యాపిటల్స్ : 144/9 (అక్షర్ పటేల్ 34, మనీశ్ పాండే 34, వాషింగ్టన్ 3/28, భువనేశ్వర్ 2/11)

సన్‌రైజర్స్ హైదరాబాద్ : 137/6 (మయాంక్ 49, క్లాసెన్ 31, సుందర్ 24, అక్షర్ పటేల్ 2/21)

నవచిత్రం

బ్లాక్‌బస్టర్ ఖాయం



అనిల్ సుంకర, సాక్షి వైద్య, నాగార్జున, అఖిల్, సురేందర్‌రెడ్డి

అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి క్రేజీ స్టైలిష్ స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏజెంట్'. ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ సినిమా విడుదల నేపథ్యంలో వరంగల్‌లో 'ఏజెంట్' మాసీవ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే అరూరి రమేష్ ఈ వేడుకలో పాల్గొన్నారు.

> 'ఏజెంట్'లాంటి సినిమాలో నేను భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది.
> - సాక్షి వైద్య

అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'వరంగల్ పోరాటాలకు అడ్డా. వీరత్వానికి ఇంటి పేరు.. వైల్డ్ వరంగల్. దర్శకుడు సురేందర్ రెడ్డి కొత్త జోనర్‌తో ఒక చక్కటి సినిమా, థ్రిల్లింగ్ సినిమా, స్పై సినిమా మీ ముందు పెడుతున్నారు. అందుకే ఇది బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాను. అఖిల్ ఈ సినిమా గురించి ఇంట్లో చెబుతుంటే బ్లాక్ బస్టర్ అవ్వడానికి కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. ఇందులో మీరు స్టన్నింగ్ విజువల్స్ చూస్తారు. మమ్ముట్టి కథ ఓప్పుకున్నా రంటే అది మాములుగా ఉండదు' అని అన్నారు. 'ఏజెంట్ రెండేళ్ళ ప్రయాణం. నేను, సురేందర్ రెడ్డి కలసినప్పుడు ఏదో క్రేజీగా చేసేద్దామనుకున్నాం. క్రేజీగానే చేశాం. ఏజెంట్ నాకు ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చింది. అనిల్ సుంకర ఏజెంట్‌కి బ్యాక్ బోన్. మమ్ముట్టి ఈ ప్రాజెక్ట్ ఒప్పుకోవడం, ఆయనతో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రేక్షకులు, అభిమానుల ప్రేమ, బలం కోసమే నేను పని చేస్తున్నాను. మీరు ఎంత ఇచ్చినా తీసుకుంటాను. ఏప్రిల్ 28న థియేటర్ లో కలుద్దాం' అని హీరో అఖిల్ అక్కినేని చెప్పారు.

దర్శకుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, 'అఖిల్ సిక్స్ ప్యాక్ బాడీ చేశాడని అందరూ అంటున్నారు. కానీ నేను అఖిల్ లో చూసింది కసి. ఏదో చేయాలి, ఏదో సాధించాలనే కసి చూశాను. అదే నన్ను ముందుకు నడిపించింది. తన కోసమే ఈ సినిమా చేశాను. సినిమా చాలా బావుంటుంది' అని తెలిపారు. 'సురేందర్ రెడ్డి ఈ కథ చెప్పినపుడే అఖిల్‌ని ఇలా ఊహించారు. యువ సామ్రాట్‌తో సినిమా చేయాలని అనుకున్నాను. కానీ నేను వచ్చేటప్పటికీ ఆయన కింగ్ అయిపోయారు. మరో యువ సామ్రాట్‌తో ఏజెంట్ చేశాం' అని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు.

అద్భుత విజువల్ ట్రీట్

అగ్ర దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థలు లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ బ్యానర్స్‌పై సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 2'. గత ఏడాది విడుదలై, ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుని.. బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబట్టిన 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి ఇది కొనసాగింపు. చోళుల గురించి తెలియజేసే సినిమా ఇది. ఈనెల 28న వరల్డ్ వైడ్‌గా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదలవుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. దిల్ రాజు మాట్లాడుతూ, 'మణిరత్నం డైరెక్ట్ చేసిన అమృత సినిమాతో నేను సినీ రంగంలో జర్నీ స్టార్ట్ చేశాను. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 1ను తెలుగు రాష్ట్రాల్లో మా బ్యానర్ విడుదల చేసింది. చాలా గ్రేట్ సక్సెస్ అందుకున్నాం. ఇప్పుడు పీఎస్ 2 (పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2) కూడా మా బ్యానర్‌లోనే రిలీజ్ చేస్తున్నాం' అని తెలిపారు. ఐశ్వర్యారాయ్ మాట్లాడుతూ, 'ఈనెల 28న మీ అందరినీ థియేటర్స్‌లో కలుస్తాం. మణిరత్నంకి థ్యాంక్స్. ఆయనతో ఇరువర్ నుంచి ఇప్పటి వరకు నా జర్నీ ఉంది. నిర్మాత సుభాస్కరన్‌గారు అందించిన తిరుగులేని సపోర్ట్‌తో గొప్ప మ్యాజికల్ ప్రపంచాన్ని క్రియేట్ చేయగలిగాం. గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి పని చేసే అవకాశం కలిగింది. ప్రతి క్షణాన్ని ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.



కార్తి, విక్రమ్, జయం రవి

'తెలుగు ప్రేక్షకులు మాకు ఇస్తున్న సపోర్ట్‌కి చాలా సంతోషంగా ఉంది' అని సుహాసిని మణిరత్నం చెప్పారు. మణిరత్నం మాట్లాడుతూ, 'దీన్ని రెండు భాగాలుగా చేయటానికి కారణం రాజమౌళి. అందుకు తనకు థ్యాంక్స్. జయం రవి, కార్తి, విక్రమ్, ఐశ్వర్య రాయ్, త్రిష, శోభిత, ఐశ్వర్య లక్ష్మి, తోట తరణి, శ్రీకర్ ప్రసాద్, రెహమాన్ సహా గొప్ప టీమ్‌తో పని చేశాను. వారందరి సపోర్ట్‌తోనే ఈ సినిమాను గొప్పగా చేయగలిగాను' అని అన్నారు.

ఉద్యోగ అవకాశం

ప్రముఖ తెలుగు దినపత్రిక నవతెలంగాణ దినపత్రిక ఎడిటోరియల్ విభాగంలోని హైదరాబాద్ ఎడిషన్‌లో డెస్క్‌లలో పని చేసేందుకు ఉప సంపాదకులు (సబ్ ఎడిటర్స్) కావలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ఆసక్తి ఉన్న వారు కింది చిరునామాలో వెంటనే సంప్రదించగలరు.

నవతెలంగాణ
M.H. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, RTC కళ్యాణమండపం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.
Ph: 9490099003, 9490099023

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మూడు నెలల్లో 'సీతారామ' నీరు

కరువు అనే పదాన్ని డిక్షనరీ నుంచి తొలగించాం

- 14 లక్షల ఎకరాల నుంచి 54 లక్షలకు వరి సాగు పెంచాం
- బీజేపీకి డిపాజిట్ రాదు.. కాంగ్రెస్ పాలన అవినీతిమయం
- ఎవరెన్ని ట్రిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ - కల్లూరు

మూడు నెలల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లు ప్రజల దరిచేరుస్తామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో కరువు అనే పదాన్ని డిక్షనరీలో లేకుండా చేశామన్నారు. 14 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సేద్యాన్ని 54 లక్షలకు పెంచామన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీకి డిపాజిట్ దక్కే అవకాశమే లేనప్పుడు రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ఎద్దేవా చేశారు. స్థానిక శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అధ్యక్షతన సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరులో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ముందుకు నడిపిస్తుంటే ఓర్వలేక బీజేపీ అబద్ధాలతో నిజాన్ని కనుగుమరుగు చేయాలని చూస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కరువు కాటకాలతో అల్లాడి పోయిందని తెలిపారు. 24 గంటల కరెంటు, రైతు బీమా, రైతు బంధు, సాగునీరు, పండించిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయడంతో రాష్ట్రంలో వ్యవసాయం వృద్ధిలోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ రబీలో ధాన్యాన్ని కొనలేమని చేతులెత్తేసినా రైతాంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక్క గింజ లేకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక భూమి విలువ పెరగడంతో పాటు పంట విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును విస్తరింపచేస్తున్నామన్నారు. కర్నాటకలో ఓడిపోతామని, తెలంగాణలో ఏమి అధికారం సాధిస్తామనే ఫ్రెస్టేషన్‌తోనే బీజేపీ ఇష్టానుసారంగా మాట్లాడుతుందన్నారు. కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు మోకరిల్లితే.. బీజేపీ గుజరాత్ పెద్దలకు గులాం చేస్తుందని విమర్శించారు. పేపర్ లీకేజీ విషయంలో బెయిల్ మీద వచ్చిన వాళ్లను పక్కన పెట్టుకొని మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే లంచాలు, అవినీతి పార్టీ అన్నారు.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ రద్దు చేసి రాష్ట్రాన్ని దోచుకుంటారని ఆరోపించారు. ఎవడు ఎన్ని ట్రిక్కు లేసినా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. రెండు, మూడు నెలల్లో సీతారాం ప్రాజెక్ట్ నీరు సత్తుపల్లి గడ్డకు తీసుకువచ్చి రైతుల కాళ్లు కడిగి రుణం తీర్చుకుంటామన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది నుంచి వైద్య కళాశాల : మంత్రి అజయ్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి వైద్య కళాశాల ప్రారంభమవుతుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. కేసీఆర్ పేద ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ విద్యా వైద్యాన్ని అభివృద్ధి చేస్తూ అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సత్తుపల్లిలో వంద పడకలు, పెనుబల్లిలో 50 పడకలు, కల్లూరులో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణాలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. సండ్ర వెంకట వీరయ్య మూడుసార్లు గెలిచి సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు టీఆర్ఎస్ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. సభలో టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, జడ్పీ చైర్మెన్ లింగాల కమలరాజ్ తదితరులు ప్రసంగించారు.

'తెలంగాణ సోన వరి' మార్కెటింగ్ కోసం..

- కర్నాటక రైస్ ఇండస్ట్రీస్ సంస్థ, వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం



నవతెలంగాణ రాజేంద్రనగర్:

కర్నాటకతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ సోన, ఆర్ఎన్ఆర్-15048 వరి రకం బియ్యం మార్కెటింగ్‌కు సంబంధించి కర్నాటక (బళ్లారి)కి చెందిన మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్ సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం రెండేండ్ల పాటు అమలులో ఉంటుంది. ఒప్పంద పత్రాలపై మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు మల్లికార్జున్, మంజునాథ, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్ కుమార్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో పరిశోధనా సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ జమునారాణి, రాజేంద్రనగర్‌లోని వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బీజేపీవి విభజన రాజకీయాలు

- తెలంగాణలో ఉన్న మూడు సీట్లు కూడా రానీయం
- రైతాంగ పోరాట స్ఫూర్తితో బీజేపీని నిలువరిస్తాం: విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ -భువనగిరిరూరల్

బీజేపీ దేశంలో రాష్ట్రంలో విభజన రాజకీయాలు చేస్తుందని, తెలంగాణలో ఉన్న మూడు సీట్లు కూడా ఈసారి ఆ పార్టీకి రానివ్వమని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. రైతాంగ పోరాట స్ఫూర్తితో తెలంగాణ గడ్డమీద బీజేపీని అడుగుపెట్టనివ్వబోమని చెప్పారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో 'మన ఉత్పత్తులు మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఉత్పత్తుల కేంద్రం స్టాల్స్‌ను ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మన ఉత్పత్తులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు, వారిని ప్రోత్సహించేందుకే సుమారు రూ.20 లక్షలతో మన ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, మతతత్వ రాజకీయాల బీజేపీకి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై మంత్రి స్పందిస్తూ.. ఒక వర్గం వారిని టార్గెట్ చేస్తూ బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్పొరేట్, పెట్టుబడుదాలకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. మోడీ, అమిత్ షా ఇద్దరూ దేశంలో ఇద్దరు ముగ్గురు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. దేశాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలోని మేధావులు, కవులు, కళాకారులందరూ విభజన రాజకీయాలపై ఆలోచించి, వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ వైపు చూస్తూ తెలంగాణ భవన్‌కు వస్తున్నారన్నారు. దేశంలో 30 శాతం మంది ప్రజలు మూడు పూటల తిండికి నోచుకోవడం లేదన్నారు. దీనికి బీజేపీ నాయకత్వం సిగ్గుపడాలన్నారు. తెలంగాణలో బీజేపీ పప్పులు ఉడకవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్‌డీఏ పీడీ ఉపేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధ, ఉద్యోగుల శాఖ జిల్లా అధికారి అన్నపూర్ణ, మెప్మా పీడీ రమేష్ బాబు పాల్గొన్నారు.

కడప రౌడీయిజం ఇక్కడ పనిచేయదు

- ప్లాన్ బీజేపీది అమలు షర్మిలది : మేడే రాజీవ్‌సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పోలీసులపై వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల, ఆమె తల్లి విజయమ్మ దాడి చేసి దురుసుగా ప్రవర్తించడాన్ని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చు లేపేందుకు, శాంతి భద్రతల సమస్యలు తీసుకొచ్చేందుకు బీజేపీ కనుసన్నల్లో షర్మిల పనిచేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీజేపీ ఆడుతున్న నాటకంలో షర్మిల ఓ పావుగా మారారని తెలిపారు. ప్లాన్ బీజేపీది అయితే ఆమె అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. భద్రత కల్పిస్తున్న పోలీసుల మీదే దాడి చేయడం వారి అహంకారానికి నిదర్శనమని తెలిపారు. తల్లి కూతుళ్లు ఒకేరోజు కానిస్టేబుళ్లు, ఎస్ఐ అని చూడకుండా దాడి చేసి పరుషపదజాలంతో తిట్టడం దారుణమని పేర్కొన్నారు. కడపలో చేసినట్టుగా ఇక్కడ రౌడీయిజం చేస్తామంటే కుదరదని హితవు పలికారు.

నలుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

తెలంగాణ ఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేసి అనివార్య కారణాల వల్ల విధులకు దూరమైన నలుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను ఆ సంస్థ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ సోమవారం అందజేశారు. మన్నె స్వాతి, శివకుమార్, దివ్య తేజ, పవన్ కుమార్‌లో ఒక్కరికి శాశ్వత ఉద్యోగం, మిగిలిన ముగ్గురిని క్యాజువల్ ఉద్యోగులుగా నియమించామని తెలిపారు. సంస్థ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. ఇందుకోసం సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో 54 కరోనా కేసులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒక్క రోజులో 54 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సోమవారం కోవిడ్ స్టేటస్ బులెటిన్ విడుదల చేసింది. 41 మంది కరోనా నుంచి కోలుకున్నారు. 363 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా అనుమానిత లక్షణాలున్న 5,981 మందికి టెస్టులు చేయగా వారిలో 0.90 శాతం మందిలో కోవిడ్-19 ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది. అంతకుముందు వారంలో ఆదివారం 51, శనివారం 49, శుక్రవారం 55, గురువారం 52, బుధవారం 50, మంగళవారం 52 చొప్పున కేసులొచ్చిన సంగతి తెలిసిందే.

గ్రామ దీపికల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-ముదిగొండ

గ్రామదీపికల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న గ్రామదీపికల నిరవధిక సమ్మెలో సోమవారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ దీపికలతో వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రామదీపికులకు నెలకు రూ.27 వేల గౌరవవేతనం ఇచ్చి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే భవిష్యత్తు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందిరాక్రాంతి పథకంలో పనిచేస్తున్న వారిలో గ్రామదీపికలను విడగొట్టే ప్రయత్నాలను కొద్ది మంది చేస్తున్నారని, అటువంటి వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రమ్య, మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్, గ్రామదీపికల సంఘం మండల కన్వీనర్ దమ్మాలపాటి శారద, సీపీఐ(ఎం) నాయకులు మందరపు వెంకన్న, వేల్పుల భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

కేంద్రాలు ప్రారంభించి.. కొనుగోళ్లు మరిచారు

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- ధాన్యాన్ని తగలబెట్టి రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-ముదిగొండ

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం దాటినా నిర్వాహకులు కొనుగోలు చేపట్టడం లేదని ఆగ్రహించిన రైతులు సోమవారం ప్రధాన రహదారిపై ధాన్యాన్ని తగలబెట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు ఆలస్యం కావటంతో అకాలవర్షంతో కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 17న గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు ప్రారంభించారని, ప్రచార ఆర్భాటమే తప్ప కొనుగోలు చేయటం లేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ గజ్జెల నరేష్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గుగులోతు క్రాంతిబాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, సీపీఐ(ఎం) నాయకులు తొర్తి సైదులు, బొడ్డు శ్రీను, దేవరపల్లి వెంకట్, పలువురు రైతులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై అమిత్‌షాకు అవగాహనే లేదు..

- వైషమ్యాలు సృష్టించేందుకే ఆ వ్యాఖ్యలు
- వచ్చే నెల 7న రాష్ట్రానికి మాయావతి
- విలేకర్ల సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రిజర్వేషన్ల అంశంపై అమిత్‌షాకు అసలు అవగాహన లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. మైనారిటీల రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ అమిత్‌షా వ్యాఖ్యానించటం దారుణమన్నారు. రెండు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కేంద్ర హోం మంత్రి స్థాయిలో ఇలాంటి మాటలు మాట్లాడటం శోచనీయమని అన్నారు. వెంటనే అమిత్‌షా తన వ్యాఖ్యానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా, పి ఎస్ కష్ణన్ కమిటీలు ముస్లిం స్థితిగతులపై పరిశోధన జరిపిన అనంతరం రిజర్వేషన్లు ఇవ్వాలని సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయా రిజర్వేషన్లను మతం పేరిట ఇవ్వలేదని తెలిపారు. వచ్చే నెల 7న రాష్ట్రానికి బీఎస్పీ జాతీయ అధ్యక్షులు కుమారి మాయావతి తెలంగాణకు రానున్నదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆ రోజు నిర్వహించే భరోసా సభకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. తొమ్మిదేండ్లుగా చితికిపోయిన తెలంగాణ ప్రజలకు భరోసా ఇచ్చేందుకే ఈ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రేవంత్ రెడ్డి, ఈటలకు రాష్ట్రంలో ఇతర సమస్యలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. 23 వేల మంది ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగులపై ప్రభుత్వం తీవ్ర బలప్రయోగం చేస్తున్నదని విమర్శించారు. గత మూడు రోజులుగా పోలీసులతో అరెస్టు చేయిస్తూ,భయాందోళనలకు గురి చేస్తున్నారని చెప్పారు. ఒప్పంద కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా మార్చి వదిలేశారన్నారు. వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీఓఏలు గత కొద్ది రోజులుగా ఆందోళన బాటపట్టారని చెప్పారు. వారికి కేవలం రూ.3,900 గౌరవ వేతనం ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు.

అన్ని రకాల పనులు చేస్తున్నా.. కనీస వేతనం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందిరా క్రాంతి,జాతీయ ఉపాధి పథకం ఉద్యోగులకు కూడా కనీస వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసును సీబీఐ కి అప్పగించాలనీ, అసలైన దోషులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం, కానిస్టేబుల్, జూనియర్ అసిస్టెంట్ పరీక్షలు ఒకే రోజు ఎలా నిర్వహిస్తారనీ,వాటిని వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్, కార్యదర్శి గుండెల ధర్మేందర్, కోశాధికారి ఎల్లయ్య, అధికార ప్రతినిధి అరుణ క్వీన్, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ అబ్రార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఐటీ, ఈడీలకు ఫిర్యాదు చేస్తా

- ఆయన పాత ఫోన్ ఏమైంది?
- బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'మంత్రి నిరంజన్‌రెడ్డిని నేను సూటిగా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదు. తిమ్మిని బమ్మి చేసే ప్రయత్నం చేశారు. మసిబూసి మారేడు కాయచేస్తున్నారు. మంత్రికి ఎంత మంది దత్త పుత్రులు ఉన్నారో చెప్పాలి. ఆయనపై ఆదాయ పన్నుల శాఖ, ఈడీలకు ఫిర్యాదు చేస్తా' అని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇంకా ఎవరినో దత్త పుత్రునిగా చూపించారు కదా? అని ప్రశ్నించారు. గౌడ నాయక్ పేరు మీద వనపర్తి నియోజకవర్గంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారని, ఆయన పేరు మీద పొందిన సబ్సిడీలు ఎన్ని? ఏ యే శాఖల నుంచి తీసుకున్నారు? అని ప్రశ్నించారు. దత్తపుత్రునికి కాంట్రాక్టులు, వియ్యంకునికి వీసీ పదవులు దక్కించుకున్నారని గుర్తుచేశారు. వేరుశనగ పరిశోధన కేంద్రం రానేలేదని అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి దానికి రూ.40లక్షల కాంట్రాక్ట్‌ను ఇప్పించుకున్నారని చెప్పారు. వేరుశనగ పరిశోధన కేంద్రాన్ని ఎవరు మంజూరు చేశారు? రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. మంత్రి పాత ఫోన్ ఎందుకు మార్చారో? సమాధానం చెప్పాలని అన్నారు. మంత్రిపై ఈడీకి ఫిర్యాదు చేయబోతున్నానని తెలిపారు.

పాత ఫోన్ నెంబర్‌తో మంత్రి చైనాకు చెందిన మో అనే వ్యక్తికి కాల్ చేసేవారని, చైనా వ్యక్తితో వ్యాపార సంబంధాలు ఉన్నాయని వనపర్తి ప్రజలు చెబుతున్నారని గుర్తుచేశారు. గౌడ నాయక్ భూములు ఎలా కొన్నారు? కొన్న డబ్బు ఎక్కడిది? అనే విషయాలపై ఆదాయపన్ను శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. సర్వే నెం.60లో 20 ఏకరాలు ఆర్‌డీఎస్ భూములని రికార్డులు చెబుతున్నాయని, నేను చెప్పడం లేదన్నారు. వ్యవసాయ క్షేత్రం తన భార్య కష్టార్జితమని, రూ.4కోట్లకు ఇస్తా తీసుకుంటావా? అని మంత్రి సవాల్ చేశారని, ఆయన సవాల్ స్వీకరిస్తానని రఘునందన్‌రావు తెలిపారు. తన భార్యతో మాట్లాడి వ్యవసాయ క్షేత్రాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. తాను లేవనెత్తిన విషయాలపై చర్చించడానికి వ్యవసాయ క్షేత్రానికి రావడానికి సిద్ధమే? అని అన్నారు.

శ్రీచైతన్య, నారాయణపై కేసు నమోదు చేయాలి

- ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఏఐవైఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిబంధనలను ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ బాలకృష్ణ, నిర్లకంటి శ్రీకాంత్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్ బోర్డు నిబంధనలను బేఖాతరు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల ఆగడాలను అరికట్టాలని, గుర్తింపు లేని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు.

బాలశ్రీనివాసమూర్తి మరణం పట్ల గౌరీశంకర్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అస్తిత్వ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన సాహితీశిఖరం బాల శ్రీనివాసమూర్తి మరణం పట్ల తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ సాహిత్యానికి ఆయన అనితరసాధ్యమైన సేవలందించారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురాణ ప్రబంధ తెలుగు సాహిత్య చరిత్రపై గట్టి పట్టున్న ఈ కాలం సాహిత్య విమర్శకుడని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మకథలమీద పరిశోధనాత్మకమైన గ్రంథం రాశారని గుర్తు చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమి వెలువరించిన సమగ్ర తెలంగాణ సాహిత్య చరిత్ర గ్రంథంలో ఆయన కృషి మరువలేనిదని తెలిపారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరనిలోటని పేర్కొన్నారు.

రాష్ట్రం విద్యుత్ వాహనాల హబ్‌గా మారనుంది

స్థానిక యువతకు 80 శాతంపైనే ప్రాధాన్యత ఇవ్వాలి

- విద్యుత్ వాహనాల వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- పర్యావరణ మార్పులో భాగంగానే విద్యుత్ వాహనాల ఉత్పత్తికి పెద్దపీట : ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ శంకుస్థాపనలో మంత్రి



నవతెలంగాణ జహీరాబాద్

రానున్న రోజుల్లో రాష్ట్రం విద్యుత్ వాహనాల తయారీ హబ్‌గా మారనుందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో విద్యుత్ వాహనాల తయారీ యూనిట్‌ను పరిశ్రమ సీఈవో సుమన్ మిశ్రా, మహేంద్ర యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములుతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల తయారీ పరిశ్రమలకు, వాహనాల వినియోగదారులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని జహీరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్‌లో విద్యుత్ ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమకు అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం, కార్మికులు పరస్పర అవగాహన కలిగి ఉంటే ఆ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, మహేంద్ర కార్మిక యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు చెప్పిన మాటలను ఏకభవిస్తున్నానని మంత్రి చెప్పారు. తెలంగాణలో తొమ్మిందేండ్ల పాలనలో ఏ పరిశ్రమ కూడా లాక్‌డౌన్ కాలేదని, కార్మికులు సమ్మెకు దిగలేదన్నారు. సమస్య వస్తే ప్రభుత్వం యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికుల పక్షాన ప్రభుత్వం నిలబడుతూ కార్మికుల హక్కులను కాపాడుతుందని తెలిపారు. ఉత్పత్తులను పెంచి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఎక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసినా స్థానిక యువతకు 80 శాతానికిపైనే ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి కల్పించాలని పరిశ్రమల నిర్వాహకులు, పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంటున్నామని, మహేంద్ర కంపెనీ కూడా దాన్ని అమలు చేయాలని సీఈవో సుమన్ మిషన్‌కు విజ్ఞప్తి చేశారు. మహీంద్రా అండ్ మహేంద్రా పరిశ్రమలో ఉపాధి కోసం స్థానిక యువతకు ప్రభుత్వపరంగా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకువస్తున్న పెట్టుబడిదారులకు టీఎస్ఐపాస్ విధానం ద్వారా 15 రోజుల్లో అనుమతులు ఇస్తున్నామని, లేనిపక్షంలో 16వ రోజు నుంచి ఆటోమేటిక్‌గా ఆ పరిశ్రమ ఏర్పాటుకు అన్ని అనుమతులు లభిస్తాయని తెలిపారు. అలా ఈ తొమ్మిదేండ్లలో 23 వేల పైచిలుకు పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇచ్చామని, దాంతో రూ.3.30 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ పరిశ్రమల ద్వారా 20 లక్షలపైన తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని తెలిపారు.

ప్రతిభ ఉన్న పరిశ్రమలు యూనివర్సిటీలు, విద్యాసంస్థల నుంచి ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు. దీనికోసం డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం టీఎస్ ఐపాస్‌ను ఏర్పాటు చేశామన్నారు. దాంతో గ్రామీణ విద్యార్థులు మల్టీనేషన్ కంపెనీలో ఉద్యోగాలను పొందుతున్నారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు బైక్‌లు, ఆటోలు, కార్లు ఇక్కడే ఉత్పత్తి అయి ఎగుమతి కావాలని ఆకాంక్షించారు. అందుచేతనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మహేంద్ర అండ్ మహేంద్రలో ఉత్పత్తి అయిన వాహనాలను మున్సిపాలిటీల్లో, ఆర్టీసీలో, మెట్రో స్టేషన్ల వినియోగానికి అనుమతులు ఇస్తామని తెలిపారు. తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఫార్ములా ఈ రేస్‌కు కూడా హైదరాబాద్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ విష్ణువర్ధన్ రెడ్డి, మహేంద్ర స్థానిక పరిశ్రమ అధికారులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, తహసీల్దార్ స్వామి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

బీఓఎంకు అదిరిపోయే లాభాలు

- క్యూ4లో రెట్టింపై రూ.840 కోట్లు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) అత్యంత ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. బ్యాంక్ మొండి బాకీలు తగ్గడం, ఆదాయం పెరగడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 136 శాతం వృద్ధితో రూ.840 కోట్ల లాభాలు సాధించింది. ఇంతక్రితం ఇదే క్యూ4లో రూ.355 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3,949 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ4లో రూ.5,317 కోట్లకు చేరింది. నికర వడ్డీపై ఆదాయం రూ.3,426 కోట్ల నుంచి రూ.4,495 కోట్లకు పెరిగింది. 2023 మార్చి 31తో ముగిసిన ఏడాదికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.1.30 లేదా 13 శాతం డివిడెండ్‌ను అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.47 శాతానికి తగ్గాయి. 2022 మార్చి 31 నాటికి జీఎన్‌పీఏ 3.94 శాతంగా నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.97 శాతం నుంచి ఏకంగా 0.25 శాతానికి తగ్గడం విశేషం.

ఇండుస్‌ఇండ్ బ్యాంక్ 140 శాతం డివిడెండ్



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2022-23 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 50 శాతం వృద్ధితో రూ.2,040 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఆర్థిక సంవతరం ఇదే క్యూ4లో రూ.1,361 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022-23కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.14 లేదా 140 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి ఆ బ్యాంక్ ఆఫ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.8.50 శాతం లేదా 85 శాతం బోనస్‌ను అందించింది. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 17 శాతం పెరిగి రూ.4,669 కోట్లుగా నమోదయ్యింది. ఇతర ఆదాయం 13 శాతం వృద్ధితో రూ.2,154 కోట్లుగా చోటు చేసుకుంది.

భారత మార్కెట్లోకి మారుతి ఫ్రాంక్స్ విడుదల



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మార్కెట్లోకి తన కొత్త ఎస్‌యువి 'ఫ్రాంక్స్' మోడల్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరల శ్రేణిని రూ.7.47 లక్షల నుంచి రూ.13.14 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో ఫ్రాంక్స్ సిగ్మా, డెల్టా, డెల్టాం, జీటా, ఆల్ఫా అనే వేరియంట్లు ఉన్నాయి. 1.0 లీటర్, 1.2 లీటర్ ఇంజిన్ సామర్థ్యంతో వీటిని డిజైన్ చేసింది. రూ.11,000తో ముందస్తు బుకింగ్స్‌ను స్వీకరిస్తున్నట్లు తెలిపింది. త్వరలోనే డెలివరీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

ఆస్ట్రేలియాలో ఎన్‌ఎండీసీ లిథియం ఉత్పత్తి

- ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 21 శాతం వృద్ధి లక్ష్యం



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ముడి ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 21 శాతం వృద్ధితో 41.22 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరాలని ఎన్ఎండీసీ లక్ష్యంగా పెట్టుకుంది. 2026-27లో ఏకంగా 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయాలని నిర్దేశించుకున్నట్టు ఆ సంస్థ ఉన్నతాధికారి వెల్లడించారు. గడిచిన మార్చి త్రైమాసికంలో ఎన్ఎండిసి 14.29 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించింది. ఆస్ట్రేలియాలో లిథియం రిజర్వులను వెలికితీయాలని యోచిస్తున్నామని ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) డికె మోహంతి వెల్లడించారు. అక్కడి ఒక గనిలో మెజారిటీ వాటాను పొందినట్లు వెల్లడించారు. ఉత్పత్తికి తుది దశలో ఉన్నామని.. మంచి ఫలితాలు రావొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లిథియం గని ఆస్ట్రేలియాలోని పెర్త్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు.

ఎన్నికల వేళ సోదాల కలకలం

- కర్ణాటకలో ఐటి, లోకాయుక్త దాడులు

బెంగళూరు : మే 10న జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం రాష్ట్రంలో తీవ్ర స్థాయిలో ప్రచారం జరుగుతున్న వేళ సోమవారం ఆదాయపు పన్ను, లోకాయుక్త దాడులు జరగడం కలకలం సృష్టించింది. మాజీ మంత్రి కె. గంగాధర గౌడ, అతని కుమారుడు- బెల్తంగడి కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు రంజన్ జి. గౌడ నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బెల్తంగడి, దాని సమీప గ్రామం ఇన్‌దబెట్టులోని ఉన్న ఈ ఇద్దరు నాయకుల నివాసాల్లో ఈ దాడులు జరిగాయి. అలాగే ప్రసన్న ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యాలయంపైనా దాడులు జరిగాయి. ఈ ట్రస్టు ద్వారా గంగాధర గౌడ, రంజన్ గౌడ అనేక విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసుల సహాయంతో ఐటి అధికారులు ఈ దాడులు జరిపారు. క్రీడా, యువజన శాఖ మంత్రిగా పనిచేసిన గంగాధర గౌడ 1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తరువాత కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా 2008 ఎన్నికల్లో మాత్రం జెడి(ఎస్) అభ్యర్థిగా పోటీ చేశారు. రంజన్ గౌడ 2013 ఎన్నికల్లో బిజెపి తరుపున పోటీ చేసి ఓటమి చెందాడు. 2019లోకాంగ్రెస్‌లో చేరారు. గంగాధర గౌడ, రంజన్ జి. గౌడ నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు రాజకీయ ప్రేరేపిత చర్య అని బెల్తంగడి కాంగ్రెస్ అభ్యర్థి రక్షిత్ శివరామ్ విమర్శించారు. నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న మద్దతు చూసి అధికార బిజెపి ఆందోళన చెందుతుందని ఆరోపించారు. ఎఐసిసి అధికార ప్రతినిధి చరణ్ సింగ్ సప్రా మాట్లాడుతూ ఈ దాడులను చట్టపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.

అధికారులపై లోకాయుక్త దాడులు

కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో అధికారులపై లోకాయుక్త పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమాస్తుల కేసులు నమోదు చేశారు. బెంగళూరు, శివమొగ్గ, చిత్రదుర్గ, కోలార్, బీదర్ జిల్లాలో ఈ దాడులు జరిగాయి. బెంగళూరులో బిబిఎంపి యెలహంక జోన్ టౌన్ ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య కార్యాలయం, నివాసంపై దాడులు జరిగాయి. సోమవారం మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో దాడులు జరిపినట్లు లోకాయక్త పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

తూర్పు లడఖ్‌లో సమస్యలకు పరస్పర ఆమోదయోగ్య పరిష్కారానికై కసరత్తు

- భారత్, చైనా అంగీకారం

న్యూఢిల్లీ : తూర్పు లడఖ్ (పశ్చిమ సెక్టార్)లో మిగిలివున్న సమస్యలకు సాధ్యమైనంత త్వరలో పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని రూపొందించేందుకు, సన్నిహిత సంబంధాలు కలిగివుండేం దుకు భారత్, చైనా అంగీకరించాయి. ఆదివారం జరిగిన మిలటరీ చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. ఈ మేరకు సోమవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ పొడవునా సంబంధిత సమస్యల పరిష్కారంపై ఉభయ పక్షాలు అరమరికలు లేకుండా, కూలంకషంగా చర్చలు జరిపాయని ఆ ప్రకటన పేర్కొంది.

'మూసీ' విధ్వంసం

'నది'ని కాల్వగా మార్చారు

- ప్రభుత్వమే అతిపెద్ద ఆక్రమణదారు
- ఎస్టీపీలు పనిచేయట్లేదు
- విషతుల్యంగా నీరు... వాటితోనే పంటలు
- 'నగర్-నది' నివేదిక విడుదల చేసిన పీఆర్సీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో పుట్టి, ఇక్కడే కలిసిపోయే అపూర్వ చరిత్ర కలిగిన మూసీ నది విషతుల్యంగా మారిందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మూసీలో అతిపెద్ద ఆక్రమణదారు ప్రభుత్వమేనని విమర్శించారు. సహజంగా పారే నదిని కాల్వలాగా మార్చేశారనీ, దీనివల్ల జీవవైవిధ్యం అసమతుల్యమవుతున్నదని చెప్పారు. ఢిల్లీకి చెందిన పీపుల్స్ రిసోర్స్ సెంటర్ (పీఆర్సీ) ఆధ్వర్యాన సోమవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'నగర్-నది' పేరుతో మూసీనదిపై నివేదికను విడుదల చేశారు. ఈ పరిశోధనా నివేదికను మానవహక్కుల వేదిక ప్రతినిధి సంజయ్ రూపొందించారు.

పీపుల్స్ రిసోర్స్ సెంటర్ అధ్యక్షులు రాజేంద్ర రవి, జాయింట్ ఆక్షన్ ఫర్ వాటర్ ప్రతినిధి డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ కన్వీనర్ జీవన్ కుమార్, సేవ్ రివర్స్ ఫోరమ్ ప్రతినిధి డాక్టర్ టీ ఇంద్రసేనారెడ్డి, హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కే వీరయ్య, మూసీ పరీవాహక ప్రాంత నివాసి పిట్టల శ్రీశైలం తదితరులు మాట్లాడారు. మూసీ నదిలోని మురుగునీటిని శుద్ధి చేసేందుకు 17 ఎస్టీపీలు ఏర్పాటు చేశారనీ, వాటిలో ఇన్‌టేక్ వివరాలు చెప్తున్నారే తప్ప, ఔట్‌ఫ్లో వివరాలు లేవన్నారు. ఎస్టీపీలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రమాదకరమైన విష రసాయనాలు భూమిలో ఇంకి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని వివరించారు. ఈ నీటితో పండిస్తున్న పంటల వల్ల ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 269 కిలోమీటర్ల మూసీనదితో 90 గ్రామాలు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో కల్లు రుచి కూడా మారిపోయేంత గాఢతతో ప్రమాదఘంటికలు మోగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. జీవవైవిధ్యం విచ్ఛిన్నమై పశువులు గర్భం దాల్చట్లేదనీ, కులవృత్తులు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. మురుగు నీటి శుద్ధి కేంద్రాలను వికేంద్రీకరించాలనీ, భవన నిర్మాణ నిబంధనల్లో మార్పులు చేయాలనీ, బహుళ అంతస్తుల భవనాల్లో మూడు నీటి పైపుల విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ఆక్రమణల్ని తొలగించకుంటే భవిష్యత్‌లో భాగ్యనగరవాసులు మరిన్ని ప్రకృతి వైపరీత్యాలకు గురి అవుతారని హెచ్చరించారు. పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేననీ, ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

దర్యాప్తులో క్రైమ్ వర్టికల్స్‌ను కచ్చితంగా పాటించండి

అన్ని జిల్లాల ఎస్పీలు, సిటీ కమిషనర్‌లకు డీజీపీ ఆదేశాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

నేరాల దర్యాప్తులో నిందితుల విచారణను క్రైమ్ వర్టికల్స్‌ను కచ్చితంగా పాటించాలనీ, తద్వారానే దర్యాప్తు సంపూర్ణ స్థితికి చేరుకుంటుందని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. సోమవారం అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరస్థుల బారి నుంచి ప్రజలను కాపాడటం ఎంత ముఖ్యమో దర్యాప్తును సక్రమంగా నిర్వహించడం ద్వారా నిందితులకు శిక్షను పడేలా చేయడమూ అంతే ముఖ్యమని ఆయన అన్నారు. ఈ ఫలితాలు సాధించాలంటే క్రైమ్ వర్టికల్స్‌లో పేర్కొన్న అంశాలను తూ.చ తప్పకుండా దర్యాప్తు అధికారులు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే నేరాల అదుపు, కోర్టుల నుంచి నేరస్థులకు శిక్షలు సాధించడంలో రాష్ట్ర పోలీసు శాఖ మంచి ఫలితాలను సాధిస్తున్నదని ఆయన అన్నారు. అయితే, పోలీసు శాఖలో కొత్తగా చేరిన పోలీసు అధికారులు, సిబ్బందికి వివిధ నేరాలకు సంబంధించిన దర్యాప్తులలో మంచి అవగాహనను, అనుభవాన్ని సాధించడానికి క్రైమ్ వర్టికల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో సీనియర్ పోలీసు అధికారులు వారికి మార్గ నిర్దేశకత్వం చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని చూపరాదని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పోలీసు స్టేషన్ మొదలుకొని సీసీఎస్‌ల వరకు క్రైమ్ వర్టికల్స్‌ను అమలు చేయడంలో తీసుకుంటున్న చర్యలకు సంబంధించి తాము ఎప్పటికప్పుడు విశ్లేషణలు జరుపుతుంటామని, చక్కటి ఫలితాలను సాధించిన పోలీసు అధికారులకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్, రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షికా గోయెల్, రీజియన్ ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, షానావాజ్ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ ఖాళీ భూముల్లో తోటల పెంపకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీటిపారుదల శాఖ కింద ఖాళీగా ఉన్న భూముల్లో ఆ శాఖ సమన్వయంతో పెద్దఎత్తున తోటల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ కార్యక్రమం హరితహారం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలు చేయడంలో దోహదపడుతుంది. ఇది క్షీణించిన అడవులను పునరుజ్జీవింపజేయడంలో సహాయపడటమే కాకుండా తాజా అందుబాటులో ఉన్న సర్వేల ప్రకారం ఏడు పచ్చదనాన్ని పెంచడంలో సహాయ పడుతుంది.

2022-23 సంవత్సరంలో జిల్లాల వారీగా నీటిపారుదల భూములలో తోటల కోసం అందుబాటులో ఉన్న కాలువల మొత్తం వైశాల్యం/పొడవును నీటిపారుదల శాఖ అందించింది. 2022-23 సంవత్సరంలో లీనియర్ ప్లాంటేషన్ కింద 5408.53 కిలోమీటర్ల విస్తీర్ణం మరియు బ్లాక్ ప్లాంటేషన్ కింద 1782 ఎకరాల విస్తీర్ణం కోసం జిల్లా కలెక్టర్ల నుంచి యాక్షన్ ప్లాన్ అందింది. లీనియర్ ప్లాంటేషన్స్‌లో భాగంగా 9475.68 కిలోమీటర్ల విస్తీర్ణంలో 2767.31 కిలోమీటర్లలో ప్లాంటేషన్ చేపట్టగా అందులో 13,42,173 మొక్కలు నాటారు. బ్లాక్ ప్లాంటేషన్లలో భాగంగా 3875.26 ఎకరాల విస్తీర్ణంలో 590.04 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టగా అందులో 6,01, 385 మొక్కలు నాటారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, జోగులాంబ

గద్వాల్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, సిద్దిపేట, సూర్యాపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ తోటలను పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయిలో ఏడు బృందాలను ఏర్పాటు చేయడంజరిగింది. రాజన్న సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, మహబూబాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాల్లోని ప్లాంటేషన్‌లను క్వాలిటీ కంట్రోల్ సెల్ ఆధ్వర్యంలో సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (ఎస్‌క్యూసీఓ), జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (జేక్యూసీఓ), ప్లాంటేషన్ మేనేజర్ పరిశీలించారు. కానుగ, ఈత, గుల్మోహర్, సీమ తంగేడు, రెయిన్ ట్రీ, సీతాఫల్, దిరిశెన, పెల్టోఫోరం వంటి జాతుల మొక్కలను ఈ జిల్లాల్లో నాటడం జరిగింది.

క్షేత్రస్థాయిలో ప్లాంటేషన్లను పరిశీలించిన అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది అందరికీ ఓరియంటేషన్ అవసరమని భావించారు. మొక్కలు కట్టే ఏర్పాట్లు, పొడవాటి మొక్కల వినియోగం, అంచనా తయారీ మరియు మొక్కల మధ్య అంతరం పాటించాలని, వేప, చింతపండు, జాముని, బాబుల్, నీరు మద్ది, మారేడు, కాసురినా, వెదురు మొదలైన స్థానిక జాతులను ప్లాంటేషన్ కోసం ప్రతిపాదించారు. అవసరమైన చోట సాధారణమైన రీప్లేస్‌మెంట్ అవసరమని అధికారులు సూచించారు. పశువులు మేయకుండా ఫెన్సింగ్ వేయాలని, తోటల మంచి మనుగడ కోసం ఎరువులు వేయడం, కలుపు తీయడం, నీరు పెట్టడం మొదలైన అన్ని పనులను చేయల్సిన అవసరం ఉందని వారు సూచించారు.

బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా షహబుద్దీన్ ప్రమాణం

ఢాకా : బంగ్లాదేశ్ 22వ అధ్యక్షుడుగా ప్రముఖ రాజకీయ నేత మహ్మద్ షహబుద్దీన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చారిత్రక దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ షిరిన్ షర్మిన్ ఆయనచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాని షేక్ హసీనా, ఆమె మంత్రివర్గ సహచరులు, కొత్త అధ్యక్షుడి కుటుంబ సభ్యులు, రాజకీయ నేతలు, సుప్రీం న్యాయమూర్తులు, సీనియర్ సివిల్, మిలటరీ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆదివారంతో అబ్దుల్ హమీద్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో షహబుద్దీన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాలక పార్టీ అవామీ లీగ్ అభ్యర్థిగా షహబుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం హహబుద్దీన్ సంబంధిత ప్రమాణ పత్రాలపై సంతకాలు చేశారు. దేశాధ్యక్షుడి పదవి అలంకార ప్రాయమే అయినప్పటికీ, సార్వత్రిక ఎన్నికల సమయంలో అధ్యక్ష కార్యాలయం పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమై వుంటుంది. అధ్యక్షుడు, ప్రధానిని నియమించడంతోపాటు దేశ రాజ్యాంగ సంరక్షకుడిగా కూడా వ్యవహరిస్తారు. ఎన్నికల వ్యవస్థ పట్ల పాలక అవామీ లీగ్, ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ మధ్య అభిప్రాయ బేధాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబరులో లేదా వచ్చే ఏడాది జనవరిలో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దిగువ కోర్టు న్యాయమూర్తి అయిన షహబుద్దీన్ గత వారం మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ, ప్రజలందరూ తమ ఓటు హక్కు వినియోగించేలా ఓటర్లను ప్రోత్సహించేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనని చెప్పారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత, రాజకీయ పరిస్థితులను సమీక్షించి, రాజకీయ పార్టీల మధ్య వివాదాలను తగ్గించడంలో తన పాత్ర వుంటుందా, లేదా అన్నది సమీక్షిస్తానని చెప్పారు.

ప్రస్తుత కాలం అవసరానికి తగ్గట్లుగా భారత్-గయానా మధ్య సంబంధాలు

ఎస్ జైశంకర్

జార్జిటౌన్ (గయానా) : ప్రస్తుత కాలం యొక్క అవసరాలకు తగినట్లుగా భారత్-గయానా మధ్య సంబంధాలు ఏర్పాడుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. సోమవారం భారత్ తయారు చేసిన ఫెర్రీ ఎంవి ఎంఎ లిషా ప్రారంభోత్సవంలో గయానా అధ్యక్షులు ఇర్ఫాన్ అలీతో కలిసి ఎస్ జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కడ నివసిస్తున్న భారతీయ సమాజాన్ని ఉద్దేశించి జైశంకర్ ప్రసంగించారు. గయానా ప్రభుత్వంతో తన చర్చలు గురించి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇరు దేశాల ఉమ్మడి సంకల్పం గురించి కూడా భారతీయ సమాజానికి జైశంకర్ తెలియచేశారు. 'ప్రస్తుత కాలం యొక్క అవసరాలకు తగిన విధంగా సంబంధాలను మేం ఏర్పరుచుకుంటున్నాం' అని జైశంకర్ తెలిపారు. కాగా, ఆదివారం భారత్‌లో శిక్షణ పొందిన గయానా సివిల్ సర్వీసెస్ అధికారులతో జైశంకర్ భేటీ అయ్యారు. గయానా, పనామా, కొలంబియా, డొమినికన్ రిపబ్లిక్ దేశాల కోసం తొమ్మిది రోజుల పర్యటనను జైశంకర్ ఈ నెల 20న ప్రారంభించిన సంగతి తెలిసిందే.

పటిష్ట కార్యాచరణతోనే అన్ని రంగాల్లో గ్రామాభివృద్ధి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పటిష్టమైన కార్యాచరణతోనే అన్ని రంగాల్లోనూ గ్రామాల అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నొక్కి చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల టీఎస్ఐఆర్‌డీలో జిల్లా పంచాయతీరాజ్, జిల్లాపరిషత్ సీఈఓలు, డీఆర్‌డీఓలకు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ...50 శాతం గ్రామాల్లో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలను ఇంకా వినియోగించట్లేదనీ, నీటి సరఫరా, విద్యుత్, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించి సత్వరమే వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాలు నిర్మించి వదలివేయకుండా గ్రామీణ యువత వాడుకునేలా చూడాలన్నారు. తడి, పొడి చెత్త సేకరించి వర్మి కంపోస్టు తయారు చేసి ఆదాయం సమకూర్చుకునేలా జీపీలను ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో పంచాయతీలు శాశ్వత ఆదాయం పొందే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని సరైన రీతిలో సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ చట్టం పనుల విషయంలో 19 బృందాలు పరిశీలించి పనుల నాణ్యతను ప్రశంసించాయనీ, పనుల్లో చిన్న లోపం కూడా లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కేంద్రం నుంచి రూ.907 కోట్లు మెటీరియల్ కాంపోనెంటు నిధులు రావాల్సి ఉందని చెప్పారు. సీఎస్ శాంతకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జీపీల్లోనూ ఖాళీ స్థలాలు గుర్తించి ఆదాయం చేకూర్చేలా వెదురు, టేకు, గంధం, తదితర చెట్ల పెంపకం చేపట్టి సంపద వనాలను సృష్టించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువతను భాగస్వాములను చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలోని 13 పంచాయతీలు కేంద్ర అవార్డులు సాధించడంలో కృషి చేసిన సర్పంచులను, గ్రామ కార్యదర్శులను అభినందించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ..నాలుగేండ్లుగా ఉద్యమ స్ఫూర్తితో సిబ్బంది పనిచేయడంతో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ హన్మంతరావు, స్పెషల్ కమిషనర్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్లు, అవార్డులు పొందిన సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అబద్ధాల అమిత్‌షా సరి చేసుకో...

- గణాంకాలపై చర్చకు సిద్ధం
- బీజేపీ నాయకులకు వినోద్ కుమార్ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర హెూంశాఖ మంత్రి ఆదివారం నాటి చేవెళ్ల సభలో అన్ని అబద్ధాలే చెప్పారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్లోని మంత్రుల నివాస సముదాయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీజేపీ నాయకులు చెబుతున్నగణాంకాలు తప్పు అని చర్చించి నిరూపించేందుకు తాను సిద్ధమేనని సవాల్ చేశారు. రాష్ట్రానికి రూ.1.20 లక్షల కోట్లు వివిధ గ్రాంట్ల రూపంలో ఇచ్చినట్టు అమిత్ షా చెప్పారనీ, అందులో నాలుగో వంతు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు సెస్ కింద రాష్ట్రం కేంద్రానికి రూ. 39,189 కోట్లు చెల్లించిందనీ, కేంద్రం మాత్రం రాష్ట్రానికి చెందిన రోడ్లకు రూ. 34 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకా రూ. 5 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. అబద్ధాలు చెప్పినందుకు రాష్ట్ర ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి. ఆదాయ లెక్కలకు చర్చకు రావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను సవాల్ చేశారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా జరిగిందా? అని ప్రశ్నించారు. రైతు ఎలా చనిపోయినా రైతుబీమా ఇస్తున్నామనీ, ఆ లెక్కలను తీసుకుని ఆత్మహత్యలుగా బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

పాట్నా హైకోర్టులో రాహుల్‌కు ఊరట

- స్టే ఉత్తర్వులు జారీ

పాట్నా : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి పాట్నా హైకోర్టులో ఊరట లభించింది. దిగువ కోర్టు సమన్లపై హైకోర్టు సోమవారం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. మోడీ ఇంటిపేరుపై పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారంటూ రాజ్యసభ సభ్యుడు సుశీల్ కుమార్ మోడీ వేసిన కేసులో ఎంపి, ఎంఎల్ఏ కోర్టు సమన్లు జారీ చేసింది. రాహుల్ స్టేట్‌మెంట్‌ను నమోదు చేయడానికి మంగళవారం రావాల్సిందిగా దిగువ కోర్టు ఆదేశించింది. వీటి అమలుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చింది. ఇదే కేసులో సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా నిర్ధారించిన వారంరోజుల తర్వాత పాట్నా కోర్టు మార్చి 30న రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్ 12న రాహుల్ తమ ముందు హాజరు కావాలని ఎంపి, ఎంఎల్ఏ కోర్టు ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆది దేవ్ మార్చి 18న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వేరే విచారణా తేదీని నిర్దేశించాల్సిందిగా రాహుల్ తరపు న్యాయవాది కోరడంతో ఏప్రిల్ 25 తదుపరి విచారణా తేదీగా నిర్ధారించారు. తాజాగా ఈ ఆదేశాలు అమలుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చింది.

నరోదా అల్లర్ల కేసులో ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేయనున్న సిట్

అహ్మదాబాద్:నరోదా గమ్ అల్లర్ల కేసులోని 67మంది నిందితులందరినీ ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టడాన్ని సుప్రీంకోర్టు నియమిత సిట్ గుజరాత్ హైకోర్టులో సవాలు చేయనుంది. గోద్రా అనంతర ఘర్షణల సమయంలో 2002లో అహ్మదాబాద్‌లోని నరోదా గమ్ ఏరియాలో ఊచకోతలో 11మంది ముస్లింలు చనిపోయారు. ఈ కేసులో రెండు దశాబ్దాల తర్వాత ఏప్రిల్ 20న మొత్తంగా 67మంది నిందితులను విడిచిపెడుతూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం అన్యాయం

మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అమిత్‌షా పర్యటన

- ఆ రిజర్వేషన్లకు వెనుకబాటుతనం తప్ప మతం ఆధారం కాదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన ముఠా నాయకుడిగా తెలంగాణకు వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఏం చేస్తారో చెప్పకుండా బండి సంజయ్‌ని అరెస్టు చేస్తే నిద్రపట్టలేదంటూ ఫ్యాక్షనిస్టులా మాట్లాడారని చెప్పారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే రాష్ట్రానికి ఆయన వచ్చారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ముస్లింలకు రిజర్వేషన్లను సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చారు తప్ప మతం ఆధారంగా కాదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ పెంచుతామంటూ అమిత్ షా అన్నారని, ఆయనకు నిజంగా హిందువుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ల పరిమితిని 50 శాతం ఎందుకు పెంచడం లేదని అడిగారు. ఎస్టీ రిజర్వేషన్‌ను ఆరు నుంచి పది శాతానికి పెంచుతూ తెలంగాణ శాసనసభ పంపిన తీర్మానాన్ని ఏండ్ల తరబడి కేంద్ర ప్రభుత్వం ఎందుకు నాన్చుతున్నదని ప్రశ్నించారు. రిజర్వేషన్లకు ఆధారమైన బీసీ జనగణన చేయించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ఒప్పించడం లేదన్నారు. త్వరలో తెలంగాణలో ఎన్నికలు ఉన్న కారణంగానే హిందూ, ముస్లిం పేరుతో ఓట్లలో చీలిక తీసుకొచ్చేందుకు అమిత్‌షా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

హిందువులపైన నిజంగా ప్రేమ ఉంటే, వివేకానంద ఏం చెప్పారో చదవాలని, అలాగే శివాజీ సైన్యంలో ఎంత మంది ముస్లింలు ఉన్నారో తెలుసుకోవాలని బీజేపీ నేతలకు సూచించారు. రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించుకోవడం దుర్మార్గమన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌పై కేంద్ర ప్రభుత్వం కక్షగట్టిందని విమర్శించారు. పుల్వామా దాడికి భద్రతాలోపాలు, గోవాలో జరిగిన అవినీతిని ప్రస్తావించిన కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. న్యాయవ్యవస్థను కేంద్రం గుప్పెట్లో పెట్టుకుందన్నారు. బీజేపీకి ఇష్టంలేని వారు హిందూ మతానికి చెందిన వారైనా చంపేస్తున్నారని, గాంధీ, గౌరీలంకేశ్, పన్సారే, కల్బుర్గిని హత్య చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. దేశాన్ని పరిరక్షించాల్సిన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా విచ్ఛిన్నకర శక్తులుగా మారారని విమర్శించారు. కేసీఆర్ కంటే బీజేపీతోనే ఎంఐఎంకు ఎక్కువ సంబంధాలున్నాయని చెప్పారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బీజేపీ, ఎంఐఎం పరస్పర అవగాహనతో పోటీ చేస్తున్నాయని వివరించారు. సమ్మె చేయనున్న ఆర్టిజన్లను పెద్ద నేరస్తులుగా, సంఘ విద్రోహులుగా చిత్రీకరించడం, కనీసం మీడియా సమావేశాన్ని కూడా నిర్వహించుకునే అవకాశాన్ని ఇవ్వక పోవడాన్ని కూనంనేని ఖండించారు. రూ.లక్ష వరకు రుణ మాఫీ చేయాలని, పోడుభూముల సమస్యను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే అమిత్ వ్యాఖ్యలు : అజీజ్‌పాషా

రాజకీయ దురుద్దేశంతోనే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ అమిత్‌షా వ్యాఖ్యానించారని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా విమర్శించారు. ముస్లింల పరిస్థితి దళితుల కంటే అధ్వాన్నంగా ఉన్నదంటూ పలు కమిటీలు ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయని గుర్తు చేశారు. దేశంలో ఎవరి పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా లేకుండా ఆయా వర్గాలకు ఎలా న్యాయం చేస్తారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంటనష్టంపై సత్వరమే సర్వే చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ డిమాండ్ చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి, లౌకిక వ్యవస్థకు వ్యతిరేకమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు.

కేంద్రంలో బాధ్యతాయుతంగా ఉండాల్సిన హోంమంత్రి మతతత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడడం దురదృష్టకరమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితులు, గిరిజనుల కంటే ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారంటూ సీపీఐ నేత చంద్రరాజేశ్వర్‌రావు పరిశీలన చేసి చెప్పారని గుర్తు చేశారు.

గతంలో ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఐదు శాతం నుంచి నాలుగు శాతానికి ముస్లిం రిజర్వేషన్లను తగ్గించారని పేర్కొన్నారు. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న అమిత్‌షా మతతత్వాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడ్డాన్ని తీవ్రంగా ఖండించారు.

భారత స్టార్ రెజ్లింగ్ క్రీడాకారులు మూడు నెలలుగా చేస్తున్న న్యాయ పోరాటానికి అర్థమే లేకుండా పోయింది!.
లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మల్లయోధులు పట్టుబట్టగా..
భాజపా ఎంపీని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కమిటీ పేరుతో కాలయాపన చేస్తోంది.

మరో కమిటీ..కాలయాపనే!

- డబ్ల్యూఎఫ్ఐ మే 7 ఎన్నికల షెడ్యూల్ రద్దు
- రెజ్లింగ్ సమాఖ్యకు అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు
- ఒలంపిక్ సంఘానికి క్రీడాశాఖ మార్గనిర్దేశం





రోడ్డుపైనే రెజ్లర్ల నిద్ర : లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై నిద్రిస్తున్న భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్ తదితరులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) వ్యవహారాలను పర్యవేక్షించేందుకు మరో కమిటీని నియమించేందుకు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సిద్ధమైంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘానికి (ఐఓఏ) సోమవారం కేంద్ర క్రీడాశాఖ ఓ లేఖ రాసింది. రెజ్లింగ్ సమాఖ్యలో నిధుల దుర్వినియోగం, అధ్యక్షుడు సహా కోచ్‌ల లైంగిక వేధింపులు, వ్యక్తిస్వామ్యం పట్ల విచారణ జరిపిన ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షణ కమిటీ సమర్పించిన నివేదికను బయటపెట్టడంతో పాటు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భారత రెజ్లర్లు రెండు రోజులుగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 5న మేరీకోమ్ కమిటీ నివేదిక అందజేసినా, రెజ్లింగ్ ఫెడరేషన్ వ్యవహారాలను తిరిగి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఆధీనంలోకి వెళ్లినా.. ఇప్పటివరకు నోరుమెదపని క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తాజాగా రెజ్లర్లు మళ్లీ ఆందోళన బాట పట్టడంతో మరో కమిటీ ఏర్పాటుకు ఆదేశించారు. రెజ్లర్ల డిమాండ్లను నెరవేర్చకుండా క్రీడాశాఖ మరో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవటం పట్ల మల్లయోధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, సంగీత ఫోగట్, సత్యవర్త్ కడియన్, సోమ్‌వీర్ రాటి, జితేందర్ కిన్హా సహా పలువురు రెజ్లింగ్ క్రీడాకారులు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలో పాల్గొన్నారు.

అడ్‌హాక్ కమిటీ వేయండి :

ఏప్రిల్ 5న ఎంసీ మేరీకోమ్ సారథ్యంలోని పర్యవేక్షణ కమిటీ విచారణ నివేదికను అందజేసింది. నివేదిక చేతికంది సుమారు మూడు వారాలు కావస్తున్నప్పటికీ ఆ విషయంలో క్రీడాశాఖ అధికారులు ఎటువంటి ఆసక్తి చూపించలేదు. పర్యవేక్షణ కమిటీలోని సభ్యులు బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చినప్పటికీ క్రీడాశాఖ పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. విచారణ నివేదికను క్రీడాశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని, ఈ లోగా నివేదికలోని ప్రాథమిక అంశాల ఆధారంగా భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు ఓ లేఖ రాసింది. అందులో పలు అంశాలను ప్రస్తావించింది. విచారణ నివేదిక ఆధారంగా భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌లో ఫిర్యాదులకు ఓ వ్యవస్థ లేదు. లైంగిక వేధింపుల పరిష్కారానికి సైతం రెజ్లింగ్ సమాఖ్యలో వ్యవస్థీకృత యంత్రాంగం లేదు. రెజ్లింగ్ ఫెడరేషన్‌కు క్రీడాకారులకు మధ్య కమ్యూనికేషన్, పారదర్శకత లోపించింది. నివేదిక అందజేయగానే మేరీకోమ్ కమిటీ గడువు ముగిసింది. భారత రెజ్లింగ్ సమాఖ్య మే 7న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినట్టు మీడియా, వెబ్‌సైట్ ద్వారా తెలిసింది. ఆ ఎన్నిక షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నాం. రెజ్లింగ్ సమాఖ్య భారత ఒలింపిక్ సంఘంలో భాగం. అందుకే, ఆ స్పోర్ట్స్ ఫెడరేషన్ వ్యవహారాలను చూసేందుకు ఐఓఏ ఓ కమిటీని నియమించాలి. ఆ కమిటీ ఏర్పాటైన 45 రోజుల్లో ఎన్నికలను నిర్వహించాలి. ఈ సమయంలో రెజ్లింగ్ సమాఖ్య టోర్నీలు, ట్రయల్స్ నిర్వహణ, క్రీడాకారుల ఎంపికి బాధ్యతలు అడ్‌హాక్ కమిటీ చూసుకోవాలి. ఈ దిశగా భారత ఒలింపిక్ సంఘం చర్యలు తీసుకోవాలని లేఖలో క్రీడాశాఖ కార్యదర్శి కోరారు. ఈ విషయాన్ని ఐఓఏ అధ్యక్షురాలు పి.టి ఉష ట్విట్టర్‌లో వెల్లడించింది. అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు సహా పలు అంశాలను ఏప్రిల్ 27న జరిగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో చర్చిస్తామని తెలిపింది.

రెజ్లర్ల అసంతృప్తి :

బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండగా.. అతడికి అనుకూలంగా నివేదికను తొక్కిపెట్టడం, మరో కమిటీ ఏర్పాటు చేయటం పట్ల రెజ్లింగ్ క్రీడాకారులు అసంతృప్తితో ఉన్నారు. మూడు నెలలు క్రితం క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు. తాజాగా, క్రీడాశాఖ మరోసారి రెజ్లర్ల డిమాండ్లను పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని మల్లయోధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12 ఏండ్లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్న బ్రిజ్ భూషణ్ నిబంధనల ప్రకారం ఈ సారి ఎన్నికల్లో పోటీచేసేందుకు అర్హత కోల్పోయాడు. దీంతో అతడి కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ ఈసారి అధ్యక్షుడిగా పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. అందుకోసం బ్రిజ్‌భూషణ్ ఇప్పటికే యంత్రాంగం సిద్ధం చేశాడు. క్రీడాశాఖ మంత్రి, విచారణ కమిటీలో పలువురు సభ్యులపై ఆందోళన చేస్తున్న రెజ్లర్లు విశ్వాసం కోల్పోయారని తెలుస్తోంది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సైతం రెజ్లర్ల ఆందోళనపై ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక ఏమైందో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. ఇప్పుడు మళ్లీ రెజ్లింగ్ సమాఖ్య బాధ్యతలు ఐఓఏకు అప్పగించారు. ఏర్పాటు కాబోయే అడ్‌హాక్ కమిటీలోనూ అధికార బిజెపికి చెందిన సభ్యులే అధికంగా ఉండనుండటంతో సహజంగానే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడటమే వారి ప్రథమ కర్తవ్యంగా ఉంటోంది. ఇప్పటికే మేరీకోమ్ కమిటీలో ఈ పరిస్థితిని రెజ్లర్లు చవిచూశారు. దీంతో రెజ్లర్లు ఆందోళన కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.



ఫిర్యాదు అందినా చర్యలేవీ :

ఇక బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని జాతీయ మహిళా కమిషన్‌కు సైతం తెలియజేశారు. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రెజ్లర్లు కోరుతున్నా ఢిల్లీ పోలీసులు చర్యలకు సిద్ధపడటం లేదు. మరోవైపు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ భజరంగ్, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌లు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేశారు. ఎంసీ మేరీకోమ్ నివేదిక ఆధారంగా బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన ఫిర్యాదుపై ముందుకెళ్తామని ఢిల్లీ పోలీసులు ఆ నివేదిక కోసం క్రీడామంత్రిత్వ శాఖను సంప్రదించినట్టు తెలుస్తుంది.



ఇక కదం తొక్కుదాం!

అందరి మద్దతు కోరిన రెజ్లర్లు

రెజ్లర్లు వర్సెస్ బాహుబలి, పోడియం టూ ఫుట్‌పాత్.. ప్లకార్డులతో మల్లయోధులు జంతర్ మంతర్ వద్ద ధర్నాకు దిగారు. జనవరిలో తొలిసారి బ్రిజ్‌భూషణ్ నియంతృత్వ ఆగడాలపై గళమెత్తిన మల్లయోధులు.. అప్పుడు రాజకీయ పార్టీలు, రెజ్లింగ్‌యేతర క్రీడాకారులు మద్దతు అందించినా.. నిరాకరించారు. లైంగిక వేధింపుల అంశాన్ని రాజకీయం చేయటం ఇష్టం లేదని, రెజ్లర్లమే న్యాయ పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. మూడు నెలల్లోనే రెజ్లర్ల స్వరం మారింది. న్యాయం చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం.. మాట నిలబెట్టుకోలేదు. ఎవరి వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగామో.. వారి కనుసన్నల్లోనే మరో దశాబ్ద కాలం రెజ్లింగ్ సమాఖ్య పగ్గాలు వెళ్తున్న సంకేతాల నేపథ్యంలో రెజ్లర్లు ఆందోళన పథం మార్చారు.

ఈసారి అన్ని రాజకీయ పార్టీలు, రెజ్లింగ్‌యేతర క్రీడాకారులు సహా అంతర్జాతీయ క్రీడా సమాజం నుంచి సైతం రెజ్లర్లు మద్దతు కోరుకుంటున్నారు. అధికారం అండతో రెచ్చిపోతున్న వ్యక్తిపై పోరాటంలో సత్యం, నిజాయితీ మాత్రమే సరిపోవని ఇంకా శక్తి కావాలని రెజ్లర్లు భావిస్తున్నారు. అందుకోసం వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు సోషల్ మీడియా వేదికగా అన్ని వర్గాల మద్దతు కోరుతున్నారు. రైతుల నుంచి మహిళల వరకు ఎవరైనా రెజ్లర్ల న్యాయ పోరాటంలో భాగస్వామ్యమై కదం తొక్కవచ్చని సాక్షి మాలిక్ కోరింది.

అంతర్జాతీయ వేదికపై భారత్ గర్వపడే విజయాలు సాధించిన స్టార్ రెజ్లర్లు రోడ్డుమీదకు వచ్చినా కేంద్ర ప్రభుత్వం చలించటం లేదు. దీంతో మల్లయోధులు రాత్రి జంతర్‌మంతర్ వద్దే నిద్రకు ఉపక్రమించారు. ఈ దృశ్యాలను చూసిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవటం శోచనీయం. దేశానికి పతకాలు సాధించిన మహిళా అథ్లెట్ల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడినా ఎటువంటి చర్యలు లేకపోతే.. ఇక దేశంలో సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉందో ఊహించగలమని మల్లయోధులు ఆవేదన వ్యక్తం చేశారు.

వాషింగ్టన్ మాయ

- విజృంభించిన భువనేశ్వర్ కుమార్
- ఢిల్లీ క్యాపిటల్స్ 144/9



నవతెలంగాణ-హైదరాబాద్ :

వాషింగ్టన్ సుందర్ (3/28) మ్యాజిక్ చేశాడు. ఐపీఎల్16లో ఆరు మ్యాచుల్లో ఒక్క వికెట్ పడగొట్టని వాషింగ్టన్ సుందర్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై మాయజాలం సృష్టించాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టిన వాషింగ్టన్ సుందర్ ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించాడు. పేసర్ భువనేశ్వర్ కుమార్ (2/11) సైతం నిప్పులు చెరగాడు. దీంతో సోమవారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులే చేసింది. మనీశ్ పాండే (34, 27 బంతుల్లో 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (34, 34 బంతుల్లో 4 ఫోర్లు), మిచెల్ మార్ష్ (25, 15 బంతుల్లో 5 ఫోర్లు) ఢిల్లీ క్యాపిటల్స్‌కు గౌరవప్రద స్కోరు అందించారు.

ఢిల్లీ ధమాల్ :

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు సన్‌రైజర్స్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (0)ను అవుట్ చేసిన భువనేశ్వర్ కుమార్.. క్యాపిటల్స్‌ను గట్టి దెబ్బ కొట్టాడు. కానీ తర్వాత మార్కో జాన్సెన్ ఓవర్లో మిచెల్ మార్ష్ (25) బౌండరీల మోత మోగించాడు. జాన్సెన్ ఓవర్లో 19 పరుగులు పిండుకున్న మార్ష్ ఢిల్లీకి ధనాధన్ ఆరంభం అందించాడు. జోరుమీదున్న మార్ష్‌ను నటరాజన్ రివ్యూ సాయంతో ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపించగా.. ఢిల్లీకి దిమ్మతిరిగే షాక్ వాషింగ్టన్ సుందర్ ఇచ్చాడు. సీజన్లో తొలి సిక్సర్ వాషింగ్టన్ సుందర్‌పై బాదిన డెవిడ్ వార్నర్ అతడిపై స్లాగ్ షాట్‌కు వెళ్లి వికెట్ కోల్పోయాడు. అదే ఓవర్లో సర్ఫరాజ్ ఖాన్ (10) స్వీప్ షాట్‌తో, అమన్ హకీమ్ ఖాన్ (4) స్లాగ్ షాట్‌కు ప్రయత్నించి డగౌట్ బాట పట్టారు. సీజన్లో ఇప్పటివరకు ఒక్క వికెట్ పడగొట్టని వాషింగ్టన్ సుందర్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఒకే ఓవర్లో మూడు వికెట్లతో మెరుపు మాయ ప్రదర్శించాడు. వాషింగ్టన్ మాయజాలంతో ఢిల్లీ క్యాపిటల్స్ విలవిల్లాడింది. 62/5తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న క్యాపిటల్స్‌ను మనీశ్ పాండే (34), అక్షర్ పటేల్ (34) ఆదుకున్నారు. పాండే, పటేల్ ఆరో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. మార్కండె ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అక్షర్ పటేల్ డెత్ ఓవర్లలో ఇన్నింగ్స్‌కు ఊపుతీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. కానీ అక్షర్, మనీశ్ స్వల్ప విరామంలో వెనుదిరిగటంతో క్యాపిటల్స్ కథ మొదటికొచ్చింది. 20 ఓవర్లలో 9 వికెట్లకు ఆ జట్టు 144 పరుగులే చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్‌లు రాణించారు. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్, ఉమ్రాన్ మాలిక్ సైతం ఆకట్టుకున్నారు.

నవచిత్రం

బ్లాక్‌బస్టర్ ఖాయం

అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి క్రేజీ స్టైలిష్ స్పై యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఏజెంట్'. ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ సినిమా విడుదల నేపథ్యంలో వరంగల్‌లో 'ఏజెంట్' మాసీవ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. అక్కినేని నాగార్జున ముఖ్య అతిధిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే అరూరి రమేష్ ఈ వేడుకలో పాల్గొన్నారు.



అనిల్ సుంకర, సాక్షి వైద్య, నాగార్జున, అఖిల్, సురేందర్‌రెడ్డి

అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'వరంగల్ పోరాటాలకు అడ్డా. వీరత్వానికి ఇంటి పేరు.. వైల్డ్ వరంగల్. దర్శకుడు సురేందర్ రెడ్డి కొత్త జోనర్‌తో ఒక చక్కటి సినిమా, థ్రిల్లింగ్ సినిమా, స్పై సినిమా మీ ముందు పెడుతున్నారు. అందుకే ఇది బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాను. అఖిల్ ఈ సినిమా గురించి ఇంట్లో చెబుతుంటే బ్లాక్ బస్టర్ అవ్వడానికి కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. ఇందులో మీరు స్టన్నింగ్ విజువల్స్ చూస్తారు. మమ్ముట్టి కథ ఒప్పుకున్నారంటే అది మాములుగా ఉండదు' అని అన్నారు.

'ఏజెంట్ రెండేళ్ళ ప్రయాణం. నేను, సురేందర్ రెడ్డి కలసినప్పుడు ఏదో క్రేజీగా చేసేద్దామనుకున్నాం. క్రేజీగానే చేశాం. ఏజెంట్ నాకు ధైర్యాన్ని, నమ్మకాన్ని ఇచ్చింది. అనిల్ సుంకర ఏజెంట్‌కి బ్యాక్ బోన్. మమ్ముట్టి ఈ ప్రాజెక్ట్ ఒప్పుకోవడం, ఆయనతో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రేక్షకులు, అభిమానుల ప్రేమ, బలం కోసమే నేను పని చేస్తున్నాను. మీరు ఎంత ఇచ్చినా తీసుకుంటాను. ఏప్రిల్ 28న థియేటర్‌లో కలుద్దాం' అని హీరో అఖిల్ అక్కినేని చెప్పారు. దర్శకుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, 'అఖిల్ సిక్స్ ప్యాక్ బాడీ చేశాడని అందరూ అంటున్నారు. కానీ నేను అఖిల్‌లో చూసింది కసి. ఏదో చేయాలి, ఏదో సాధించాలనే కసి చూశాను. అదే నన్ను ముందుకు నడిపించింది. తన కోసమే ఈ సినిమా చేశాను. సినిమా చాలా బావుంటుంది' అని తెలిపారు. 'సురేందర్ రెడ్డి ఈ కథ చెప్పినపుడే అఖిల్‌ని ఇలా ఊహించారు. యువ స్మామాట్‌తో సినిమా చేయాలని అనుకున్నాను. కానీ నేను వచ్చేటప్పటికే ఆయన కింగ్ అయిపోయారు. మరో యువ స్మామాట్‌తో ఏజెంట్ చేశాం' అని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు.

అద్భుత విజువల్ ట్రీట్

అగ్ర దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థలు లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ బ్యానర్స్‌పై సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 2'. గత ఏడాది విడుదలై, ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుని.. బ్లాక్ బస్టర్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబట్టిన 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికి ఇది కొనసాగింపు. చోళుల గురించి తెలియజేసే సినిమా ఇది. ఈనెల 28న వరల్డ్ వైడ్‌గా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

ఈ నేపథ్యంలో ఆదివారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.

దిల్ రాజు మాట్లాడుతూ, 'మణిరత్నం డైరెక్ట్ చేసిన అమృత సినిమాతో నేను సినీ రంగంలో జర్నీ స్టార్ట్ చేశాను. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 1ను తెలుగు రాష్ట్రాల్లో మా బ్యానర్ విడుదల చేసింది. చాలా గ్రేట్ సక్సెస్ అందుకున్నాం. ఇప్పుడు పీఎస్ 2 (పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2) కూడా మా బ్యానర్‌లోనే రిలీజ్ చేస్తున్నాం' అని తెలిపారు.



కార్తి, విక్రమ్, జయం రవి

ఐశ్వర్యా రాయ్ మాట్లాడుతూ, 'ఈనెల 28న మీ అందరినీ థియేటర్స్‌లో కలుస్తాం. మణిరత్నంకి థ్యాంక్స్. ఆయనతో ఇరువర్ నుంచి ఇప్పటి వరకు నా జర్నీ ఉంది. నిర్మాత సుభాస్కరన్‌గారు అందించిన తిరుగులేని సపోర్ట్‌తో గొప్ప మ్యాజికల్ ప్రపంచాన్ని క్రియేట్ చేయగలిగాం. గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి పని చేసే అవకాశం కలిగింది. ప్రతి క్షణాన్ని ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. 'తెలుగు ప్రేక్షకులు మాకు ఇస్తున్న సపోర్ట్‌కి చాలా సంతోషంగా ఉంది. మణిరత్నం, సుభాస్కరన్, దిల్ రాజు కలిసి ఈ సినిమాను తెలుగు ఆడియెన్స్‌కు అందిస్తున్నారు. ఈ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని సుహాసిని మణిరత్నం చెప్పారు. మణిరత్నం మాట్లాడుతూ, 'దీన్ని రెండు భాగాలుగా చేయటానికి కారణం రాజమౌళి. అందుకు తనకు థ్యాంక్స్. జయం రవి, కార్తి, విక్రమ్, ఐశ్వర్య రాయ్, త్రిష, శోభిత, ఐశ్వర్య లక్ష్మి తోట తరణి, శ్రీకర్ ప్రసాద్, రెహమాన్ సహా గొప్ప టీమ్‌తో పని చేశాను. వారందరి సపోర్ట్‌తోనే ఈ సినిమాను గొప్పగా చేయగలిగాను' అని అన్నారు.

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'రామబాణం'. సోమవారం ఈ చిత్రంలోని మూడవ లిరికల్ వీడియోను 'ధమాకా' హీరోయిన్ శ్రీలీల రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మిక్కీ జె మేయర్ ఈ పాటని మెస్మరైజింగ్ ట్రాక్‌గా కంపోజ్ చేశారు. ఇటు మెలోడీ, అటు బీట్ రెండిటిని అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తూ... మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా 'నువ్వే..నువ్వే' పాటని స్వరపరిచారు. తను ఇష్టపడే అమ్మాయి అందంపై హీరో ప్రశంసలు కురిపించే పాటకు శ్రీమణి సాహిత్యం అందించారు. రితేష్ జి రావు ప్లజెంట్ వాయిస్ పాటకు అదనపు ఆకర్షణ తెచ్చింది. కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ పాటలో విజువల్స్ కూడా చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. గోపీచంద్, డింపుల్ హయాతి అందంగా కనిపించారు. దినేష్ కుమార్ పాటకు చక్కని కొరియోగ్రఫీ అందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. జగపతి బాబు, ఖుష్బు ముఖ్య తారాగణంగా నటిస్తున్నారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని మే 5న భారీస్థాయిలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



డింపుల్ హయాతి, గోపీచంద్

మహా వీరుడు



శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ కథానాయకుడిగా మడోన్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మహావీరుడు'. ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివ కార్తికేయన్‌కు జోడిగా అదితి శంకర్ నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఆగస్ట్ 11న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు.

నిలకడగా ఆరోగ్యం


హాస్యనటుడు చలాకీ చంటి అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఛాతినొప్పి రావడంతో ఈనెల 21న కుటుంబ సభ్యులు ఆయన్ని గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌కి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గమనించిన వైద్యులు గుండెపోటుగా గుర్తించారు. రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ ఉండటంతో ఆయనకు స్టంట్ వేసినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. పలు చిత్రాల్లో పోషించిన హాస్య పాత్రలతో చంటి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత 'జబర్దస్త్', బిగ్‌బాస్ షో.. ఆయనకి మరింత గుర్తింపు తీసుకొచ్చాయి.



చలాకీ చంటి

ఉద్యోగ భారతం కావాలి..

ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మిస్తున్న చిత్రం 'యూనివర్సిటీ'. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ, 'భారత్ దేశం లాంటి వర్ధమాన దేశాల్లో లక్షలాది మంది యువత గవర్నమెంట్ ఉద్యోగాల కోసం ఆశావహ దృక్పథంతో ఉన్నారు. దీని కోసం ఎన్నో డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుంటున్నారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న సమయంలో ఎగ్జామ్ పేపర్ లీకేజీలు అయిపోతూవుంటే వాళ్ళ కన్న కలలు ఏమైపోవాలి. వాళ్ళ గమ్యం అగమ్య గోచరం అయిపోతూ, నిరాశ నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలా కాకూడదు. ప్రశ్నా పత్రాలు లీకేజీ అవుతుంటే విద్యార్థుల భవిష్యత్ ఏమి అవ్వాలి? లంభకోణం చెప్పేవాడు కుంభకోణం చేసుకు పోతూ ఉంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు గిల గిల లాడి పోతుంటే ఈ విద్యా వ్యవస్థకు అర్థం ఎక్కడుంది?, మనది నిరుద్యోగ భారతం కాదు.. ఉద్యోగ భారతం కావాలని చెప్పే సినిమా ఇది. విద్యార్థుల సమస్యలకు ప్రతిబింబంగా ఉంటుంది. సెన్సార్ పూర్తయ్యింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి పాటలు : గద్దర్, నిస్సార్, మోటపలుకుల రమేష్, వేల్పుల నారాయణ, గాయకులు : గద్దర్, సాయిచరణ్, గోస్కుల రమేష్, పల్లె నరసింహం, ఎడిటింగ్ : మాలిక్, కెమెరా : బాబురావుదాస్, కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-సంగీతం-దర్శకత్వం-నిర్మాత : ఆర్.నారాయణమూర్తి.



ఆర్.నారాయణమూర్తి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.